RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 సంచిక : 205 గురువారం 20 - 02 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## ఫోన్ ట్యాపింగ్ కేసు...

## హరీశ్ రావుకు హైకోర్టులో ఊరట




2

- తన ఫోన్ ట్యాప్ చేశారని పంజాగుట్ట పీఎస్‌లో చక్రధర్ ఫిర్యాదు
- హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన హరీశ్ రావు
- తదుపరి విచారణ చేపట్టే వరకు దర్యాప్తుపై స్టే విధించిన హైకోర్టు

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తుపై హైకోర్టు ఈరోజు స్టే విధించింది.

## మళ్లీ మనదే అధికారం..

# కష్టపడి పనిచేయాలి

### మళ్లీ మనదే అధికారమని, మీరే ఎమ్మెల్యేలు అవుతారని అభిప్రాయం వ్యక్తం

- ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యతను విస్మరించి కాంగ్రెస్‌కు తొత్తులుగా మారిపోయారని
- ప్రజలలో వ్యతిరేకత పెరుగుతున్న విధానంపై ఆశ్చర్యం వ్యక్తం
- రాష్ట్రంలో త్వరలో ఉపఎన్నికలు వస్తాయని, అందుకు సంబంధించి పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని
- ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠను పెంచాయని చెప్పవచ్చు.



వివరాలు 2లో..

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తాజాగా జరిగిన బీఆర్ఎస్ (భారతీయ రాష్ట్ర సమితి) నేతల విస్తృతస్థాయి సమావేశంలో కమ్యూనిస్టులపై తీవ్ర విమర్శలు చేశారు.

## కేసీఆర్, రేవంత్‌పై

# ఈటల హాట్ కామెంట్స్..

కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేసీఆర్ బాటలోనే నడుస్తోందని మండిపడ్డారు.

తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలను కేసీఆర్ భ్రష్టు పట్టించారని విమర్శించారు.

రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని ఈటల విమర్శించారు.




2

వరంగల్, ఫిబ్రవరి 19: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు చేశారు. అంతేకాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేసీఆర్ బాటలోనే నడుస్తోందని మండిపడ్డారు. ఇలాగే చేస్తే కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు కూడా పడుతుందని హెచ్చరించారు ఈటెల రాజేందర్. బుధవారం మీడియాతో మాట్లాడిన ఈటెల రాజేందర్.. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలను కేసీఆర్ భ్రష్టు పట్టించారని విమర్శించారు. అదే తరహాలో కాంగ్రెస్ నడుస్తోందన్నారు. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ చట్టం ప్రకారం

## కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లోకాయుక్తలో ఊరట




భూ కేటాయింపుల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు

అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలు లేవన్న లోకాయుక్త పోలీసులు

తుది నివేదికను హైకోర్టుకు సమర్పించనున్న లోకాయుక్త పోలీసులు

ముడా (మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) భూముల వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లోకాయుక్తలో భారీ ఊరట లభించింది. భూముల కేటాయింపులో

## గుంటూరు మిర్చియార్డులో

# పర్యటించిన జగన్




ఈసీ ఆదేశాలను లెక్కచేయని వైనం

మళ్లీ వచ్చేది వైసీపీ అని ధీమా

గుంటూరు మిర్చి యార్డ్ పర్యటనకు వైసీపీ అధినేత జగన్ వెళ్లిన సంగతి తెలిసిందే.

## ఏపీ, తెలంగాణకు అమిత్ షా శుభవార్త




2024లో ప్రకృతి వైపరీత్యాలకు ప్రభావితమైన 5 రాష్ట్రాలకు రూ. 1554.99 కోట్లు


అమిత్ షా నేతృత్వంలో భేటీ అయిన ఉన్నత స్థాయి కమిటీ నిధుల మంజూరుకు ఆమోదం

ఏపీకి రూ. 608.8 కోట్లు, తెలంగాణకు రూ. 231.75 కోట్లు

రెండు తెలుగు రాష్ట్రాలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుభవార్త తెలిపారు.

## త్వరలో పీఎం కిసాన్

## 19వ విడత నిధుల విడుదల




2

- ఫిబ్రవరి 24న విడుదల కానున్న పీఎం కిసాన్ నిధులు
- రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున నిధుల జమ
- 19వ విడతలో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం

ఢిల్లీ: రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద అందించే పీఎం కిసాన్ పథకం 19వ విడత నిధుల విడుదలకు

## మిర్చి రైతుల కోసం

# కేంద్రమంత్రికి చంద్రబాబు లేఖ

- ఏపీలోని మిర్చి రైతులను ఆదుకోవాలంటూ మంత్రి శివరాజ్ సింగ్ కు లేఖ
- మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద వెంటనే మిర్చి పంటను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి
- రైతులు అమ్ముకునే ధరకు, సాగు వ్యయానికి మధ్య పొంతన ఉండటం లేదని వ్యాఖ్య



వివరాలు 2లో..

అమరావతి: ఏపీలోని మిర్చి రైతులను ఆదుకోవాలంటూ సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్ సింగ్ కు లేఖ రాశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా రైతులను ఆదుకోవాలని కోరారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా రైతుల నుంచి వెంటనే మిర్చి పంటను కొనుగోలు చేయాలని అన్నారు. ఈ నెల 14న ఢిల్లీలో మిర్చి రైతుల పరిస్థితి, వివరాలు 2లో..

## మేడారంలో

## కొనసాగుతున్న మినీజాతర



సమ్మక్క పూజ మందిరం నుంచి పసుపు, కుంకుమ, నైవేద్యం

నాలుగు రోజులపాటు ఈ వేడక

తొలిరోజు ప్రధాన ఘట్టంగా మండమెలిగె కార్యక్రమం

మేడారం మినీజాతర కొనసాగుతోంది. బుధవారం రాత్రి పూజారులు సమ్మక్క పూజ మందిరం నుంచి పసుపు, కుంకుమ, నైవేద్యం తీసుకువచ్చి సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఆదివాసీల నృత్యాలు, డోలు వాయిద్యాలతో మేడారం మారు మ్రోగింది. తాడ్వాయి మండలం, మేడారంలో వనదేవతలు సమ్మక్క- సారలమ్మల మినీ జాతర బుధవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. వివరాలు 2లో..

## కార్పొరేటర్ టు సీఎం.. ఆమె వైపు

## అధిష్టానం మొగ్గుకు కారణం అదేనా




2

- ఢిల్లీ సీఎం ఎంపిక విషయంలోనూ బీజేపీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ సంచలన నిర్ణయం
- బీజేపీ ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తాను ప్రకటించనుందనే ప్రచారం జోరుగా

ఢిల్లీ: ముఖ్యమంత్రుల ఎంపికలో బీజేపీ ఆలోచన ఎలా ఉంటుందనేది ఎవరికి అంతుపట్టని విషయం..

## తెలంగాణ ప్రజల కోసం

## బీఆర్ఎస్ మాత్రమే పోరాడగలదు

తెలంగాణ ప్రజల కష్టనష్టాలు బీఆర్ఎస్‌కు మాత్రమే తెలుసన్న కేసీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న కేసీఆర్

ఏప్రిల్ 27న బీఆర్ఎస్ బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయం



తెలంగాణ ప్రజల కష్టనష్టాలు బీఆర్ఎస్‌కు మాత్రమే తెలుసని, వారి కోసం మన పార్టీ మాత్రమే పోరాడగలదని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రజల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ గురించి, ప్రజల గురించి బీఆర్ఎస్ మాత్రమే ఆలోచించగలదని అన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దశాబ్దాల పాటు కొట్లాడి సాధించుకున్న తెలంగాణ, కాంగ్రెస్ పాలనలో తిరోగమనం చెందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాతికేళ్ల స్ఫూర్తితో వివరాలు 2లో..

## మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే.. ఇది పక్కా




వివరాలు 2లో..

- మాజీ సీఎం కేసీఆర్ అసహనంతో మాట్లాడుతున్నారని మంత్రి
- అందుకే 10 మంది ఎమ్మెల్యేలు నైరాశ్యంతో పార్టీ మారారు
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో రెండు హామీలను అమలు చేసాం

బీఆర్ఎస్ శ్రేణులు వాస్తవాలు మాట్లాడుతుంటే.. అవి జీర్ణించుకోలేని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసహనంతో మాట్లాడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు.కేసీఆర్ అధ్యక్షతన బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఆ సమావేశంలో పార్టీ పని అయిపోయిందంటూ వ్యతిరేక ప్రచారం చేసిన బీఆర్ఎస్ నేతలపైన కేసీఆర్ మండిపడ్డారు.'ఎంపీ ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందగానే పార్టీ పని అయిపోందని మన పార్టీ నేతలే ప్రచారం చేశారు. అందుకే 10 మంది ఎమ్మెల్యేలు నైరాశ్యంతో పార్టీ మారారు. ఇలాంటి ప్రచారం చేయడం సరైంది కాదు. ఇది వివరాలు 2లో..

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
గురువారం 20 - 02 - 2025

## మిర్చి రైతుల కోసం కేంద్రమంత్రికి చంద్రబాబు లేఖ

ధరల పతనంపై జరిగిన సమావేశం వివరాలను చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలను కూడా సమర్పించినట్లు సీఎం గుర్తు చేశారు. గత పదేళ్లలో మిర్చి ఉత్పత్తి, ధరల వివరాలను కూడా లేఖలో తెలిపారు. ఈ మధ్య మిర్చి ధరలు బాగా పడిపోయాయని చంద్రబాబు పేర్కొన్నారు. సాధారణ మిర్చి క్వింటాల్ కు రూ. 11 వేలు, ప్రత్యేక వెరైటీ మిర్చి క్వింటాలు రూ. 13 వేలకు పడిపోయిందన్నారు. ఆ ధర గతంలో రూ. 20 వేలుగా ఉండేదన్నారు. విదేశాలకు మిర్చి ఎగుమతి తగ్గిపోవడం కూడా ఈ పరిస్థితికి ఒక కారణమని అన్నారు. మిర్చి ధరలు బాగా తగ్గిపోవడంతో రైతులకు ఆర్థిక కష్టాలు తప్పడం లేదన్నారు. రైతులు అమ్ముకునే ధరకు, సాగు వ్యయానికి మధ్య పొంతన ఉండటం లేదన్నారు. 50 శాతం నిష్పత్తిలో కాకుండా 100 శాతం నష్టాన్ని కేంద్రం భరించాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ జోక్యం ద్వారా తగ్గిన ధరను భర్తీ చేసేలా చూడాలని కోరారు.

## తెలంగాణ ప్రజల కోసం
## బీఆర్ఎస్ మాత్రమే పోరాడగలదు

మళ్లీ తెలంగాణను నిలబెట్టుకోవడానికి పోరాటం చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. సభ్యత్వ నమోదు, సంస్థాగత కమిటీలు, ప్లీనరీ తదితర అంశాలపై చర్చించారు. పార్టీ ఆవిర్భావం మొదలు ఇప్పటి వరకు సుదీర్ఘ ప్రస్థానంపై కేసీఆర్ వివరించారు. తెలంగాణ కోసం జరిగిన ఉద్యమం, అధికారంలోకి వచ్చాక తెలంగాణ అభివృద్ధి కోసం చేసిన కృషిని కూడా వివరించారు.

### ఏప్రిల్ 27న బీఆర్ఎస్ బహిరంగ సభ

ఏప్రిల్ 27న బీఆర్ఎస్ బహిరంగ సభను నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. పార్టీ రజతోత్సవ వేడుకలను ఏడాది పొడవునా నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ కమిటీలను వేయాలని నిర్ణయించారు. కమిటీల ఇంఛార్జి బాధ్యతలను హరీశ్ రావుకు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు.

## త్వరలో పీఎం కిసాన్ 19వ విడత నిధుల విడుదల

కేంద్ర ప్రభుత్వం తేదీలను ఖరారు చేసింది. ఫిబ్రవరి 24న రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. బీహార్‌లోని భాగల్పూర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిధులను విడుదల చేయనున్నారు. 19వ విడతలో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలగనున్నట్లు అధికారులు వెల్లడించారు. పీఎం కిసాన్ నిధులు అందుకోవాలంటే అర్హులైన రైతులు ఎన్‌పీసీఐ, ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతాను కలిగి ఉండాలి. ఈ-కేవైసీ చేసి ఉండాలి. పీఎం కిసాన్ పథకానికి సంబంధించి స్టేటస్ తెలుసుకోవడానికి లేదా పీఎం కిసాన్ జాబితాలో పేరు ఉందో లేదో చూడడానికి పీఎం కిసాన్ ప్రభుత్వ వెబ్ సైట్‌లోకి వెళ్లి తనిఖీ చేసుకోవాలి. రిజిస్టర్డ్ మొబైల్ లేదా ఆధార్ నెంబర్‌ను ఎంటర్ చేసి వివరాలు పొందవచ్చు. పీఎం కిసాన్ మొబైల్ యాప్ కూడా అందుబాటులో ఉంటుంది.

## కేసీఆర్, రేవంత్‌పై ఈటల హాట్ కామెంట్స్..

భూ నిర్వాసితులకు 3 రెట్లు అధికంగా పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని.. కానీ, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఈటల ఆరోపించారు. జాతీయ రహదారుల కోసం సేకరించే భూములను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని.. కేంద్రం డబ్బులు చెల్లిస్తుందని ఈటల రాజేందర్ తెలిపారు. గ్రీన్ ఫిల్డ్ భూ సేకరణలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈటల ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గ్రీన్ ఫిల్డ్ భూ నిర్వాసితులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. గ్రీన్ ఫిల్డ్ హై వే పనులు వేగంగా జరుగుతున్నా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని ఈటల విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇకనైనా కళ్లు తెరవాలని హితవు చెప్పారు ఎంపీ. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలపై పోరాటం చేస్తామని ఎంపీ ఈటల ప్రకటించారు. దేశ వ్యాప్తంగా కులగణన చేసే పరిస్థితి లేదని ఈటల స్పష్టం చేశారు. కుల గణనకు బీజేపీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారాయన. కాంగ్రెస్ పార్టీ చేసిన కులగణనకు చట్టబద్ధత ఉందా? అని ఎంపీ ప్రశ్నించారు. తమిళనాడులో చేసిన విధంగా చేస్తే స్వాగతిస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీకి కట్టుబడి కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

## మేడారంలో కొనసాగుతున్న మినీజాతర

మొదటి పేజి తరువాయి

నాలుగు రోజులపాటు జరిగే ఈ వేడకలో భాగంగా తొలిరోజు ప్రధాన ఘట్టంగా మండమెలిగె కార్యక్రమాన్ని పూజారులు నిర్వహించారు. తెల్లవారుజామున గంగా స్నానాలు ఆచరించారు. అనంతరం మేడారంలోని సమ్మక్క మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మల మందిరాన్ని మహిళలు శుద్ధి చేసి తల్లుల ఆది స్థానాలను ఆలుకుపూతలు చేసి ముగ్గులు వేశారు.వనదేవతల అంతర్గత మందిరాల్లో సమ్మక్కకు సిద్దబోయిన వంశీయులు, సారలమ్మకు కాక వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా గ్రామంలోని దేవతలను పూజించారు. దీప దూప నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డోలు వాయిద్యాల నడుమ గ్రామానికి నాలుగు వైపులా ద్వార స్తంభాలు ఏర్పాటు చేసి దిష్ఠి తోరణాలు కట్టారు. ఈ క్రమంలో వనదేవతల గుడుల్లో మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. ఆనవాయితీలో భాగంగా చర్ప వంశీయులు దివంగత మాజీ ఎమ్మెల్యే చర్ప భోజరావు కుటుంబ సభ్యులు సహా ఊరట్టం గ్రామం నుంచి డోలు వాయిద్యాల నడుమ సెలపెయ్యను గద్దెల వద్దకు తీసుకొచ్చి సమ్మక్క, సారలమ్మ పూజారులకు అందజేశారు. అనంతరం సాయంత్రం ఇలవేల్పులను ఘనంగా తమ తమ మందిరాలకు చేర్చారు. డోలు వాయిద్యాలు, కొమ్ము శబ్దాల నడుమ మహిళలు నీళ్లు ఆరబోస్తుండగా వడ్డెలు (పూజారులు) గద్దెల వద్దకు చేరుకొని జాగారం చేశారు.గురువారం ఉదయం సూర్యోదయానికి ముందు పూజారులు వనదేవతల మందిరాలకు చేరుకొని తల్లులకు శనివారం వరకు అంతర్గత పూజాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. ఇక మినీ జాతర ప్రారంభమైన నేపథ్యంలో మేడారానికి భక్తులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. మండమెలిగె పండుగ సందర్భంగా తల్లుల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తొలిరోజు సుమారు 2.5 లక్షల మంది మేడారం చేరుకున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు... హరీశ్ రావుకు హైకోర్టులో ఊరట

ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ చేపట్టే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని కోర్టు స్పష్టం చేసింది. తన ఫోన్‌ను ట్యాప్ చేశారంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వివిధ సెక్షన్ల కింద నమోదైన ఈ కేసులో ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను అరెస్టు చేశారు. అతను హరీశ్ రావు వద్ద గతంలో పని చేశాడు. తనపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును క్వాష్ చేయాలని హరీశ్ రావు, రాధాకిషన్ రావు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో హరీశ్ రావును అరెస్టు చేయవద్దని హైకోర్టు గతంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు, ప్రభుత్వం తరఫున వాదనల కోసం లాయర్ సిద్ధార్థ లూథ్రా వస్తారని పీపీ కోర్టుకు తెలిపారు. లూథ్రా మరో కేసులో బిజీగా ఉన్నందున సమయం కావాలని కోరారు. దీంతో హైకోర్టు తదుపరి విచారణను మార్చి 3వ తేదీకి వాయిదా వేసింది.

## గుంటూరు మిర్చియార్డులో పర్యటించిన జగన్

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పర్యటనకు అనుమతి లేదని జిల్లా ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆయన తన పర్యటనకు వెళ్లారు. జగన్ తన పర్యటన సందర్భంగా మిర్చి రైతులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతిపక్ష నేత అయిన తనకు ప్రోటోకాల్ ఇవ్వలేదని మండిపడ్డారు. ఎన్నికల కోడ్ అంటూ... కనీస పోలీస్ భద్రతను కూడా కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో మిర్చి రైతులకు అత్యధిక మద్దతు ధర ఇచ్చామని జగన్ చెప్పారు. ఇప్పుడు రైతు సమస్యలపై మాట్లాడేందుకు వస్తుంటే... తనను అడ్డుకున్నారని మండిపడ్డారు. మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని... అప్పుడు చంద్రబాబుకు సెక్యూరిటీ కూడా లేకుండా చేస్తామని వ్యాఖ్యానించారు. రైతుల కష్టాలు చంద్రబాబుకి పట్టడం లేదని విమర్శించారు. జగన్ గుంటూరు పర్యటనకు ఈసీ అనుమతిని నిరాకరించింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని తెలిపింది. అయినా ఈసీ ఆదేశాలను ఉల్లంఘించి జగన్ గుంటూరు పర్యటన చేపట్టారు. ఈనాటి పర్యటనపై ఈసీ తదుపరి చర్యలు తీసుకుంటుందా? లేదా? అనేది వేచి చూడాలి.

## ఏపీ, తెలంగాణకు అమిత్ షా శుభవార్త

2024లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలకు ప్రభావితమైన ఐదు రాష్ట్రాలకు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్‌డీఆర్ఎఫ్) కింద రూ. 1554.99 కోట్ల అదనపు సహాయం అందించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో భేటీ అయిన ఉన్నత స్థాయి కమిటీ ఈ నిధుల మంజూరును ఆమోదించింది. ఇక మొత్తం రూ. 1554.99 కోట్లలో ఏపీకి రూ. 608.8 కోట్లు, తెలంగాణకు రూ. 231.75 కోట్లు, త్రిపురకు రూ. 288.93 కోట్లు, ఒడిశాకు రూ. 255.24 కోట్లు, నాగాలాండ్ కు రూ. 170.99 కోట్లు ఇవ్వాలని ఉన్నత స్థాయి కమిటీ నిర్ణయించింది.

## కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లోకాయుక్తలో ఊరట

మొదటి పేజి తరువాయి

ఆయన అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలు లేవని లోకాయుక్త పోలీసులు వెల్లడించారు. ముడా భూముల వ్యవహారంలో సిద్ధరామయ్య ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ వ్యవహారంలో సిద్ధరామయ్యకు వ్యతిరేకంగా ఆధారాలు లేవని ఆధారాలు లేవని లోకాయుక్త పోలీసులు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రితో పాటు ఆయన భార్య పార్వతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతరులకు వ్యతిరేకంగా ఆధారాలు లేవని తేల్చి చెప్పారు. ఈ అంశంపై తుది నివేదికను హైకోర్టుకు సమర్పించనున్నట్లు సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణకు పోలీసులు లేఖ రాశారు. ఈ కేసులో మొదటి నలుగురు నిందితులపై వచ్చిన ఆరోపణలకు ఆధారాలు లేకపోవడంతో నిరూపితం కాలేదని తెలిపారు. నివేదికపై అభ్యంతరాలు తెలిపేందుకు స్నేహమయికి వారం రోజులు గడువు ఇస్తున్నట్లు ఆ లేఖలో వెల్లడించారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

## కార్పొరేటర్ టు సీఎం.. ఆమె వైపు అధిష్టానం మొగ్గుకు కారణం అదేనా

మొదటి పేజి తరువాయి



లోకమంతా ఒకటి అనుకుంటే.. బీజేపీ అధిష్టానం మాత్రం మరొకటి తలుస్తుంది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ సీఎంల ఎంపిక విషయంలో బీజేపీ ఇలానే చేసింది. తాజాగా ఢిల్లీ సీఎం ఎంపిక విషయంలోనూ బీజేపీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకోబోతుందనే చర్చ జరుగుతోంది. మరికొన్నిగంటల్లో బీజేపీ శాసనసభా పక్షం సమావేశమై సీఎం అభ్యర్థిని ఎన్నుకుంటారు. అధిష్టానం ముందుగానే నిర్ణయించిన పేరును సమావేశంలో ప్రతిపాదిస్తారు. దీనిపై పార్టీ ఎమ్మెల్యేలు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తూ.. ఏకగ్రీవంగా సీఎంను ఎంచుకోవడం లాంఛనమే. బీజేపీ ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తాను ప్రకటించనుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. బీజేపీలో సీనియర్ నాయకురాలుగా ఉన్నప్పటికీ గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం లేదు. వార్డు కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా పనిచేశారు. కార్పొరేటర్‌గా పనిచేసిన వ్యక్తిని బీజేపీ సీఎం ఎందుకు చేయాలనుకుంటోంది. కార్పొరేటర్ టు సీఎం కాబోతున్న ఆమె అసలు హిస్టరీ ఏమిటో ఓసారి తెలుసుకుందాం.

సుదీర్ఘ రాజకీయ అనుభవం..

రేఖా గుప్తాకు గతంలో ఎమ్మెల్యే, ఎంపీగా పనిచేసిన అనుభవం లేదు. కానీ రాజకీయంగా ఆమెకు సుదీర్ఘ అనుభవం ఉంది. విద్యార్థి నాయకురాలిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. పితంపుర, షాలీమార్ బాగ్ ప్రాంత ప్రజలకు సుపరిచితురాలు. స్థానికంగా పార్కుల అభివృద్ధికి ఆమె ఎంతగానో కృషిచేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండేవారు. రేఖాగుప్తా కుటుంబానికి సంఘ్ నేపథ్యం ఉండటం ఆమెకు కలిసొచ్చింది. విద్యార్థి దశలో ఏబీవీపీలో చురుకైన పాత్ర పోషించిన ఆమె ఆ తర్వాత బీజేపీలో చేరారు. పితంపుర కౌన్సిలర్‌గా, షాలీమార్ బాగ్-బి నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. స్థానిక ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకురాలు. ఢిల్లీ ప్రాంతంలో పార్టీ వాయిస్‌ను గట్టిగా వినిపించే నేతల్లో ఆమె ఒకరు. షాలీమార్ బాగ్ శాసనసభ నియోజకవర్గం నుంచి 2015, 2020 ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి సమీప ప్రత్యర్థి ఆప్‌కు చెందిన బందనాకుమారి చేతిలో ఓటమి చెందారు. 2025లో అదే నియోజకవర్గం నుంచి బందనాకుమారిని 29వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడించారు. రేఖాగుప్తా బీజేపీలో ఎన్నో బాధ్యతలు నిర్వర్తించారు. బీజేపీ ఢిల్లీ శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. పదవులతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజల్లో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేయడమే ఆమెను సీఎంగా బీజేపీ ఎంపిక చేయడానికి ఒక కారణంగా చెప్పుకోవచ్చు.

విద్యార్థి దశ నుంచి..

1994-95 సంవత్సరంలో ఆమె దౌలత్ రామ్ కళాశాలలో చదువుతున్న సమయంలో ఆ కళాశాల విద్యార్థి సంఘం ఎన్నికల్లో పోటీచేసి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1995-96 సంవత్సరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఎన్నికల్లో పోటీచేసి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1996-97 సంవత్సరంలో ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి పోటీచేసి విజయం సాధించారు. విద్యాభ్యాసం పూర్తైన తర్వాత ఆమె బీజేపీలో చేరారు. 2003 నుంచి 2004 వరకు బీజేవైఎం ఢిల్లీ కార్యదర్శి పదవిని నిర్వహించారు. 2004 నుంచి 2006 వరకు బీజేవైఎం జాతీయ కార్యదర్శిగా పనిచేశారు. 2007లో ఢిల్లీలోని ఉత్తరి పితంపుర వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. 2012లో జరిగిన ఎన్నికల్లోనూ ఉత్తరి పితంపుర నుంచి కౌన్సిలర్‌గా రెండోసారి గెలిచారు. 2022లో షాలీమార్ బాగ్-బి నుంచి కా ర్పొరేటర్‌గా గెలుపొందారు. ఆమె వార్డు కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా పనిచేసిన సమయంలో ఆ ప్రాంత అభివృద్ధికి విశేషకృషి చేశారు. పితంపుర ప్రాంతంలో ఎగువ మధ్య తరగతితో పాటు ఉద్యోగస్తుల కుటుంబాల ప్రజలు ఎక్కువగా నివాసం ఉంటారు. ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా.. అపార్ట్‌మెంట్‌ల పక్కన పార్కుల నిర్మాణంతో పాటు, వాటి అభివృద్ధికి విశేషకృషి చేశారు.

సీఎంగా ఆమెవైపు ఎందుకంటే..

ఈ ఏడాది ఢిల్లీ శాసనసభ ఎన్నికలు జరగడానికంటే ముందు ఆప్ నుంచి సీఎంగా అతిషి ఉన్నారు. ఆమె మహిళకావడంతో.. ప్రస్తుతం బీజేపీ కూడా మహిళా అభ్యర్థికే ఢిల్లీ సీఎం పీఠం అప్పగించాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు కాంగ్రెస్ నుంచి షీలాదీక్షిత్ వరుసగా మూడుసార్లు ఢిల్లీ సీఎంగా పనిచేశారు. మరోవైపు దేశంలో ఎక్కువ రాష్ట్రాల్లో బీజేపీ సీఎంలు ఉన్నా.. ఏ రాష్ట్రంలోనూ మహిళా సీఎం లేరు. దీంతో ఢిల్లీలో మహిళా సీఎం వైపు బీజేపీ మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనప్పటికీ ఢిల్లీ సీఎం ఎవరనే ఉత్కంఠకు మరికొద్ది గంటల్లో తెరపడనుంది.

## మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే.. ఇది పక్కా

మొదటి పేజి తరువాయి




ఖండించ దగ్గ విషయం' అని సీరియస్ టోన్‌తో అన్నారాయన. అయితే.. ఇప్పటికీ మించి పోయింది ఏమీ లేదని.. లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీ కోసం అంతా కష్టపడాలని సూచించారు.కేసీఆర్ చేసిన ఆ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. 'కేసీఆర్‌కు ప్రజాస్వామ్యం అంటే విలువ లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో రెండు హామీలను అమలు చేసాం. పంట బోనస్ , రైతు భరోసా పెంపు , 55 వేల ఉద్యోగాలు, డీఎస్సీ పోస్టింగులు ఇలా చెప్పుకుంటే పోతే అనేకం చేశాం. ఇంకా చేస్తాం.కేసీఆర్ వ్యాఖ్యల్లో అసహనం తప్ప మరొకటి కనబడటం లేదు. అధికారం దరిదాపుల్లో కనబడక పోవడంతోనే కేసీఆర్‌లో అసహనం ఎక్కువై ఇలా మాట్లాడుతున్నారు. తెలంగాణ ప్రజలు పదేళ్లు అధికారం ఇస్తారు... ఇది పక్కా.ఆర్థిక విధ్వంసం తర్వాత కూడా పాత పథకాలను ఒక్కటి కూడా రద్దు చేయకుండా ,మేము ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. కేంద్రం ఇంకా సహకరిస్తే.. మరింత అభివృద్ధి చేస్తాం. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కేసీఆర్ కలిసి రావాలి. తమిళనాడు తరహాలో రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పక్షాలు ప్రభుత్వంతో కలిసి పనిచేయాలి. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీ వెళ్తాం. ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ కలసి రావాల్సిందేనని డిమాండ్ చేశారు పొన్నం ప్రభాకర్.

## మళ్లీ మనదే అధికారం.. కష్టపడి పనిచేయాలి

మొదటి పేజి తరువాయి



ఈ క్రమంలో కమ్యూనిస్టులు అధికార పార్టీతో అనుసంధానమై, ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యతను విస్మరించి కాంగ్రెస్‌కు తొత్తులుగా మారిపోయారని ఆరోపించారు. అంతేకాదు ఈ సమావేశంలో కేసీఆర్, తెలుగుదేశం పార్టీ ప్రస్థానం గురించి కూడా మాట్లాడారు. ఎన్టీఆర్ (నందమూరి తారక రామారావు) పడిన కష్టనష్టాలను వివరించారు. టీడీపీ ఎన్టీఆర్ కాలంలో ఉన్న పరిస్థితులను గుర్తుచేశారు.

### ప్రజల్లో వ్యతిరేకత

ఈ క్రమంలోనే ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి పాలనపై ప్రజలలో వ్యతిరేకత పెరుగుతున్న విధానంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సీఎంపై ఇంత తొందరగా ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనుకోలేదని ఆయన అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆదాయం ప్రతి సంవత్సరం పెరుగుతుందని చెప్పారు. కానీ ప్రస్తుతం మాత్రం ప్రభుత్వంలో రాష్ట్ర ఆదాయం పడిపోతుందని ఆరోపించారు. అదే అధికారులు ఉన్నారు. కానీ ఈ ప్రభుత్వానికి చేయించుకోవడం రావడం లేదని ఎద్దేవా చేశారు. ఈ క్రమంలో ఆయన యువ నేతలకు కష్టపడి పనిచేయాలని సూచించారు.

### ఉపఎన్నికలపై సూచనలు

ఈ క్రమంలో రాష్ట్రంలో త్వరలో ఉపఎన్నికలు వస్తాయని, అందుకు సంబంధించి పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. మళ్లీ మనదే అధికారమని, మీరే ఎమ్మెల్యేలు అవుతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కేసీఆర్, టీడీపీ పార్టీ ప్రస్థానం, కష్టనష్టాలు, ఎన్టీఆర్ కాలం గురించి వివరిస్తూ, ప్రజల మద్దతు పొందేందుకు పార్టీ కార్యకర్తలను ప్రోత్సహించారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠను పెంచాయని చెప్పవచ్చు. ముఖ్యంగా కమ్యూనిస్టులపై చేసిన విమర్శలు, టీడీపీ ప్రస్తావనతోపాటు సీఎంపై వ్యతిరేకత అంశం వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి.

## కాంగ్రెస్ : కూలుతున్న మహావృక్షం

భారతవని రాజకీయ మహావృక్షం భారత జాతీయ కాంగ్రెస్ క్రమేణా బలహీనపడుతోంది. పార్లమెంటులో ప్రభావశీలతను, ప్రజల్లో ఆకర్షణ శక్తిని కోల్పోతోంది. ఒకటి, రెండు మినహాయించి ప్రతీ ఎన్నికలలోనూ ఈ జాతీయ సంస్థ ప్రాబల్యం సన్నగిల్లుతోంది. దేశ జనాభాలో సగానికి మించి ఉన్న యువతతో మమేకం కాలేకపోతోంది. అసలు యువజనులను తన వైపు ఆకట్టుకోవడంలో సాఫల్య వైఫల్యాలు అటుంచి కనీసం వారిని తన రాజకీయ కార్యకలాపాలలో భాగస్వాములుగా చేసుకునేందుకు ఒక అడుగు కూడ ముందుకు వేయడం లేదు. దేశ ప్రగతి నిర్మాణ శక్తి యువతే కదా. అయినా యువ భారతీయులతో యువనేత రాహుల్‌గాంధీ సారథ్యంలో సైతం మమేకం కాలేకపోవడం కాంగ్రెస్ కష్టాలకు ఒక ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఒకప్పుడు అనునిత్యం వివిధ కార్యక్రమాలతో నిమగ్నమై నేటి తరానికి మేటి నాయకులను అందించిన యువజన కాంగ్రెస్ నేడు ఫెక్సీలకు కూడ పనికి రాకుండ పోగా, విద్యార్థి విభాగమైన ఎన్ఎస్‌యుఐ ఉనికినే కోల్పోయింది. గతంలో ఢిల్లీ కాంగ్రెస్‌లోనే కాదు జాతీయ స్థాయిలో రాహుల్‌గాంధీ యూత్ బ్రిగేడ్‌లో ప్రముఖుడుగా భాసించిన సందీప్ దీక్షిత్ ఘోర పరాజయం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు మాత్రమే పరిమితమైన విషయం కానే కాదు. షీలా దీక్షిత్ తనయుడు అయిన సందీప్‌కు వచ్చిన ఓట్లు కాంగ్రెస్ పతనావస్థకు సంకేతం. మారిన, మారుతున్న లోకం పోకడలను అర్థం చేసుకోకుండా ఒకనాటి తమ అధికార దర్పంతో ఎక్కువ స్థానాలకు పట్టుబట్టడం, ఆ తర్వాత పరాజయం పాలై ప్రభావం కోల్పోవడం కాంగ్రెస్‌కు పరిపాటి అయిపోయింది. నిన్నగాక మొన్నటి దాకా తాము దేశాన్ని ఏలిన నాయకులమనే అభిజాత్యాన్ని కాంగ్రెస్ నేతలు వీడలేకపోతున్నారు. నాటి నవాబులూ సరిగ్గా ఇలానే వ్యవహరించేవారు. లక్నో నవాబుల వారసురాలుగా చెప్పుకున్న ఒక మహిళకు 1985లో రాజీవ్‌గాంధీ న్యూ ఢిల్లీలో ఒక బంగ్లాను కేటాయించారు. నవాబు వాజీద్ అలీ షా వారసురాలుగా తాను ఆ బంగ్లాలో ఉండడం తన వంశ స్థాయికి తగదని ఆమె తిరస్కరించారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులు వేచి ఉండే గదిలో తొమ్మిది సంవత్సరాలు గడిపిన అనంతరం, ఆమెకు ఢిల్లీ శివారులోని ఒక నిర్మానుష్య శిథిల భవంతి అయిన మల్చ మహల్‌ను కేటాయించారు. తలుపులు లేని ఆ హర్మ్యంలో విద్యుత్ కాదు కదా కనీసం మంచి నీటి వసతి కూడ లేదు. అలా తాను ఇంకా నవాబు వంశస్థురాలుననే భ్రమల్లో ఆమె బతికింది. ఈ రకంగా అనేక మంది గడిచిపోయిన గతం నుంచి వర్తమానంలోకి రాకుండ భ్రమల్లో గడుపుతుంటారు. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకగణం పరిస్థితి కూడ సరిగ్గా ఇదే విధంగా ఉంది. చెప్పవచ్చినదేమిటంటే యువతకు చేరువ కావడానికి ముమ్మరంగా ప్రయత్నించవలసిన కాంగ్రెస్ ఇంకా పురా వైభవ స్మృతులలోనే మునిగి తేలుతోంది. ప్రత్యర్థి బిజెపి తన వాట్సాప్ విశ్వవిద్యాలయం ద్వారా దేశంలోనే కాదు విదేశాలలోని భారతీయ యువతను సైతం ఆకర్షించడంలో సఫలమయింది. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే వ్యూహాలు కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. ప్రగతిశీల భావజాల ప్రాతిపదికపై పార్టీని పునర్నిర్మించేందుకై 7-18 సంవత్సరాల వయసులోని నవతరాన్ని ఆకర్షించే దిశగా 'జవహర్ బాల మంచ్' (జె.బి.యం)ను నెలకొల్పాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలకు జారీ చేసిన ఆదేశాలను అధికారంలో ఉన్న తెలంగాణలోనే పట్టించుకోవడం లేదంటే కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉన్నదో ఊహించుకోవచ్చు. ఇక రాహుల్‌గాంధీ నిత్యం ఉద్ఘాటిస్తుండే సైద్ధాంతిక విధానాలు ఆయన్ను అనుసరిస్తున్న ఎంత మంది నాయకులకు అర్థమవుతున్నాయనేది ఒక అంతు చిక్కని ప్రశ్న. యువ కిశోరాలుగా దేశాన్ని ఆకర్షించిన కన్హయ కుమార్, హర్థిక్ పటేల్, జిగ్నేష్ మేవానీలను సరైన రీతిలో వినియోగించుకోలేదు. ఇదే కన్హయ కుమార్ బిజెపిలో చేరి ఉంటే ఆ పార్టీ అతన్ని ఏ విధంగా ఉపయోగించుకునేదో ఒక్కసారి అలోచించాలి. ఒకప్పుడు హైదరాబాద్ నగరంలో యువతలో బలమైన సంస్థాగతమైన పట్టు కలిగి ఉండి మజ్లిస్, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీలను దీటుగా ఎదుర్కొన్న హైద్రాబాద్ నగర కాంగ్రెస్ విభాగం నేడు నిర్వీర్యమైపోయింది. పార్టీ నిర్మాణాన్ని పక్కన పెడితే నగర కాంగ్రెస్ అధ్యక్షుడు రోహణ్‌రెడ్డి కనీసం కార్యవర్గాన్ని కూడ నియమించుకోలేకపోతున్నారు. దీన్ని బట్టి కాంగ్రెస్ కార్యకలాపాలు ఏ రీతిలో ఉన్నాయో ఊహించుకోవచ్చు. తెలంగాణలో వారసత్వంగానైనా కొంత మంది యువనేతలు శాసనసభకు ఎన్నికయినప్పటికి పార్టీ పట్ల వారి విధేయత ఎంత అనేది ఒక అంతుబట్టని ప్రశ్న. కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు ఎవరైనా విదేశీ పర్యటనలకు వస్తే వారిని కలుసుకోవడానికి ప్రవాసులు ఇష్టపడడం లేదు. పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల నాయకగణం కూడా తమ విదేశీ పర్యటనల్లో జనాలను కలుసుకోవడానికి ఇష్టపడకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? 1999లో ఢిల్లీలో కురిసిన భారీ వర్షాలకు 24, అక్బర్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం ఆవరణలోని ఒక మహా వృక్షం తన నీడలో ఉన్న ఒక చిన్న మందిరంపై కూలిపోవడాన్ని అపశకునంగా అనేక మంది భావించారు. సంవత్సరాల తరబడి వేళ్ళు దెబ్బతిన్న చెట్టు ఒక్క పది నిమిషాల వర్షానికి కూలిపోవడం అశ్చర్యం కాదని ఆ సందర్భంగా సోనియాగాంధీ వ్యాఖ్యానించారని చెబుతారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అనే మహా వృక్షం వేళ్ళన్నీ కూడ పూర్తిగా దెబ్బతిని కూలిపోతోంది. ఈ పతన క్రమంలో అక్కడక్కడ మిగిలి ఉన్న పచ్చని కాండాన్ని చూసి మురిసిపోతే ఎలా?

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక



# ఉదండాపూర్‌లో సర్వే చేయిస్తాం..బోగస్ ఏరేస్తాం

బీఆర్ఎస్ నేతల తప్పులు బయటపెడతాం

నిజమైన నిర్వాసితులకు న్యాయం చేస్తాం

అవార్డు పాసైన ఆరు నెలల్లోపు పరిహారాలు ఇప్పిస్తాం

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే రూ.42 కోట్లు ఖాతాల్లో పడ్డాయి

తాజాగా మరో రూ.71 కోట్లు కలెక్టర్ ఖాతాలోకి వచ్చాయి

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వెల్లడి



**జడ్చర్ల, తెలంగాణ సేన న్యూస్ :** ఉదండాపూర్ లో తప్పకుండా సర్వే జరుగుతుంది.. అందులో బోగస్ లబ్దిదారులను ఏరివేసి నిజమైన నిర్వాసితులందరికీ న్యాయం చేయడం కూడా జరుగుతుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేసారు. ఇప్పటికే ఇతర ప్రాంతాల్లో సర్వే పూర్తి కాగా ఉదండాపూర్ లో సర్వే జరిగితే తమ దొంగతనం బయటపడుతుందని బీఆర్ఎస్ నాయకులే సర్వే జరగనివ్వకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. జడ్చర్లలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులు అర్పించిన అనంతరం తనను కలిసిన కొందరు మీడియా ప్రతినిధులతో అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, ఉదండాపూర్ లో నివాసం ఉన్నట్లుగా గతంలో 1005 మంది నుంచి దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. అయితే వాస్తవానికి అందులో 570 మంది మాత్రమే ఉదండాపూర్ లో నివాసం ఉంటున్న నిర్వాసితులు కాగా మిగిలిన వారందరూ బీఆర్ఎస్ నేతలు చేర్చిన బోగస్ లబ్దిదారులని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసలైన లబ్దిదారులతో పాటుగా బోగస్ లబ్దిదారులకు కూడా ప్రభుత్వం నుంచి ఇళ్లు పరిహారాలు ఇప్పించాలని బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించారని ఆరోపించారు. అయితే తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి పాచిక పారలేదన్నారు. ప్రస్తుతం వల్లూరు గ్రామంలోనూ, ఇతర తాండాల్లోనూ సర్వే పనులు పూర్తి కాగా ఉదండాపూర్ లో మాత్రం సర్వే జరగనివ్వకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. సర్వే చేస్తే ఎవరికి ఇళ్లు రావాలో, ఎవరికి స్ట్రక్చర్ పైసలు రావాలో వారికి వస్తాయన్నారు. ఉదండాపూర్ లో సర్వే జరిగితే తమ దొంగతనం బయటపడుతుందనే భయంతోనే బీఆర్ఎస్ నేతలు సర్వే జరగనివ్వకుండా అడ్డుకుంటున్నారని అనిరుధ్ రెడ్డి దుయ్యబట్టారు. అయితే ఉదండాపూర్ లో సర్వే జరిపి తీరుతామని, అక్కడున్న బోగస్ లబ్దిదారులను ఏరివేసి నిజమైన నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేసారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన నిర్లక్ష్యం కారణంగానే ఉదండాపూర్ సమస్య పరిష్కారం కాకుండా మిగిలిపోయిందన్నారు. తమ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.42 కోట్ల రుపాయలు తాండాలకు చెందిన నిర్వాసితుల ఖాతాల్లోకి జమ కావడం జరిగిందని గుర్తు చేసారు. ఇది కాకుండా రెండు రోజుల క్రితమే దీనికి సంబంధించి మరో రూ.71 కోట్లు జిల్లా కలెక్టర్ ఖాతాలోకి వచ్చాయని అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. దీంతో ఆ తాండాల వారందరికీ ప్లాట్ల కేటాయింపులు పూర్తి కావడంతో పాటుగా స్ట్రక్చర్ పైసలు కూడా వారి అక్కౌంట్లలోకి రావడం జరుగుతుందని వివరించారు. వల్లూరు, ఉదండాపూర్ గ్రామాలకు అవార్డు పాసైతే ఆరు నెలల లోపుగా వారికి రావాల్సిన నిధులన్నీ తాను తీసుకువస్తానని హామీ ఇచ్చారు. నిర్వాసితులకు పరిహారం పెంపు విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా ఈ సమస్య వెళ్లిందన్నారు. తాను అధికార పక్షానికి చెందిన శాసన సభ్యుడైనప్పటికీ ఎప్పుడు కూడా నిర్వాసితుల పక్షమే ఉంటానని అనిరుధ్ రెడ్డి మరోసారి స్పష్టం చేసారు.

# వంగ మహేందర్ రెడ్డి గోడ గడియారాలకు ఓట్లు రాలవు

ఆయన టీచర్ జాబ్ వద్దనుకోని రియల్టర్ అయిండు

ఉపాధ్యాయ వృత్తే వద్దనుకున్న ఆయన.. టీచర్ల ఓట్లు ఎలా అడుగతడు?

రియలెస్టేట్ బ్రోకర్ ప్రలోభాలకు టీచర్లు తలొగ్గుతారా?

పీఆర్టీయూ నాయకత్వం అవినీతిలో కూరుకుపోయింది

వంగ మహేందర్ రెడ్డిపై సంచలన కామెంట్స్ చేసిన రఘోత్తం రెడ్డి

తాజా మాజీ ఎమ్మెల్సీ ఎక్స్ క్లూజివ్ ఇంటర్వ్యూ



**ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ సేన బ్యూరో :** హైదరాబాద్: కరీంనగర్ మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి పంచే గోడ గడియారాలకు టీచర్ల ఓట్లు రాలవని, ఉపాధ్యాయుల విలువలను తగ్గిస్తున్న ఆయనకు ఎవరూ ఓటు వేసే ప్రసక్తి లేదని తాజా మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి అన్నారు. పీఆర్టీయూ నాయకత్వం మొత్తం అవినీతిలో కూరుకుపోయిందని, ఆ సంఘ నాయకులను టీచర్లు ఎవరూ నమ్మడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు తాజాగా ఆయన ఓ యూట్యూబ్ చానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూ వైరల్ గా మారింది. ఇంటర్వ్యూలోని ప్రధాన అంశాలు.. ఆయన మాటల్లోనే "పీఆర్టీయూలో అక్రమ మార్గంలో సంఘ అధ్యక్షుడిగా అయిన ఓ వ్యక్తి వల్ల పీఆర్టీయూ వరుస ఓటములపాలవుతున్నది. ఆ అధ్యక్షుడి తీరు వల్ల ఆరు సంవత్సరాల క్రితం వరంగల్ స్థానం టీచర్స్ ఎమ్మెల్సీలో మేము ఓడిపోవాల్సి వచ్చింది. అంతేకాదు రెండేండ్ల కింద మహబూబ్ నగర్ రంగారెడ్డి హైదరాబాద్ స్థానంలో పీఆర్టీయూ అభ్యర్థి ఓడిపోవడానికి కారణం కూడా అతనే. వాళ్లు ఓడిపోయినప్పుడు మాకు అర్థం కాలేదు.. కానీ ఇప్పుడు ఒక్కొక్క విషయాలు బయటపడుతున్నాయి. మీడియా ద్వారా వెలుగులోకి వస్తున్నాయి. సంఘానికి సంబంధించిన స్థలాన్ని రూ.10 కోట్లకు అమ్ముకున్నాడని, కరీంనగర్ మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చేందుకు రూ.15 కోట్లు తీసుకున్నడని, పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోస్టు ఖాళీ అయినప్పుడు నియమించేందుకు రూ.50 లక్షలు తీసుకున్నాడని ఇలా అనేక అక్రమాలకు పాల్పడ్డట్టుగా ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. ఆయన కూడా ఇప్పుడు నల్గొండ వరంగల్ ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ బరిలో ఉన్నారు.""నల్గొండ ఖమ్మం వరంగల్ స్థానం నుంచి టీచర్స్ ఎన్నికల బరిలో ఉన్న పీఆర్టీయూ అధ్యక్షుడు కరీంనగర్ మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి దగ్గర రూ.15 కోట్లు తీసుకొని ఆయనకు పీఆర్టీయూ మ్యాండేట్ ఇచ్చాడు. ఆ వచ్చిన డబ్బులతో ఆయన నల్గొండ స్థానం నుంచి పోటీ చేస్తున్నాడు.""నేను పీఆర్టీయూ భవనానికి రెండెకరాల స్థలం ఇస్తా.. పెద్ద బిల్డింగ్ కడతానని వంగ మహేందర్ రెడ్డి ప్రచారం చేస్తున్నాడు. నేను సిద్దిపేట జిల్లా పీర్టీయూ మిత్రులను అడుగుతున్నది ఒక్కటే.. ఆ స్థలమేదో ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ముందే రిజిస్ట్రేషన్ చేయాలని ఆయనను అడగండి. బిల్డింగ్ తర్వాత కట్టుకోవచ్చు.""టీచర్ ను తక్కువ చేసి.. రియలేస్టేట్ వ్యాపారం చేసి డబ్బు సంపాదించిన వంగ మహేందర్ రెడ్డి సిగ్గుపడాలి. ఉపాధ్యాయుడు అంటే తెల్వది. సమస్య అంటే తెల్వది.. సమస్యను ఎలా పరిష్కరించాలో తెలియదు. ఉపాధ్యాయ వృత్తిలో సరిగా విధులు నిర్వర్తించడం లేదనే ఫిర్యాదు వచ్చినప్పుడు వంగ మహేందర్ రెడ్డి టీచర్ జాబ్ కు రాజీనామా చేశారు. ఆయన సమస్యను ఆయన పరిష్కరించుకోలేని వంగ మహేందర్ రెడ్డి.. "నేను ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా" అని పెద్ద పెద్ద మాటలు చెప్తుంటే.. బాధనిపిస్తున్నది. ""వంగ మహేందర్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెల్వడం కోసం బడి బడి తిరిగి200 రూపాయల గోడ గడియారం మా సార్లకు ఇస్తున్నడు. ఆబిడ్స్ రమేశ్ కంపెనీలో 6 వేల గడియారాలు కొన్నాడట. మా టీచర్లను ఆయన ఎట్లా ఊహిస్తున్నడో అర్థం కావడం లేదు. కానీ మా టీచర్లు సమాజ భవిష్యత్ దశ దిశను నిర్ణయించేటోళ్లు. ఇలాంటి రియల్టర్లను నమ్మరు.""రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ మండలిలో ఉపాధ్యాయులకు అవకాశం కల్పిస్తే.. వంగ మహేందర్ రెడ్డి లాంటి రియల్టర్లు ఉపాధ్యాయ వ్యవస్థలోకి వచ్చి టీచర్ల విలువ తగ్గిస్తున్నారు. సంఘం కోసం, టీచర్ల సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తులను కాదని, కోట్లు పెట్టి టికెట్ కొనుక్కొని ఎన్నికల్లో నిలబడితే.. టీచర్ల విలువ పెరుగుతదా? తగ్గుతదా?""వంగ మహేందర్ రెడ్డి తాను వీఎమ్మార్ ఫౌండేషన్ ద్వారా వెయ్యి స్కూళ్లకు సాయం చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఇందులో వాస్తవం ఏమిటంటే.. పీఆర్టీయూ నుంచి వంగ మహేందర్ రెడ్డికి టికెట్ రాకముందే.. బడి బడి తిరిగి 210 రూపాయలకొక గోడ గడియారం పంచిండు. ఆయన గోడ గడియారం షాపులో ఉన్నప్పుడే నాకు సమాచారం వచ్చింది. టికెట్ రాకముందు 500 గడియారాలు కొన్నాడు. టికెట్ వచ్చాక 6 వేల గడియారాలు తీసుకున్నడు. ఇలా గోడ గడియారాలు పంచితే టీచర్ల ఓట్లు పడ్తాయా?""వంగ మహేందర్ రెడ్డికి నిజంగా ఉపాధ్యాయ వృత్తిపై గౌరవం ఉండి ఉంటే.. పేద పిల్లలకు విద్యనందించాలనే గొప్ప ఆశయం ఉండి ఉంటే ఆయన ఉపాధ్యాయ వృత్తిని కాదనుకొని డబ్బుల కోసం రియలెస్టేట్ లోకి పోయేవాడు కాదు. ఉపాధ్యాయ వృత్తిపై, టీచర్ల సమస్యలపై అప్పుడు లేని ప్రేమ ఇప్పుడు ఎలా వస్తుంది? రియలెస్ట్ లో డబ్బులు సంపాదించాలని, వీఎంఆర్, బీఎంఆర్ కాలేజీలను బాగు చేసుకోవాలని టీచర్ వృత్తికి రాజీనామా చేశాడే కానీ.. ఆయనకు ఉపాధ్యాయ వృత్తి అంటే తెల్వదు. పేద విద్యార్థుల కన్ సర్న్ తెల్వది. వాళ్ల కష్ట సుఖాల్లో పాలుపంచుకున్న పాపాన పోయిన వ్యక్తి కాదు.""ఓటుకు రూ. 5 వేలు ఇస్తా, రూ.10 వేలు ఇస్తానని వంగ మహేందర్ రెడ్డి చెప్పుకుంటున్నడు. ఎన్నికల అఫిడవిట్ లో 1.19 కోట్ల మాత్రమే తన ఆదాయం అని ఎలా చెప్తాడు? ఆయన ఎవరిని మోసం చేస్తున్నడు? 30 వేల మందికి ఆయన రూ.10 వేల చొప్పున ఎలా ఇవ్వగలడు? ఆ డబ్బు ఎక్కడిది? ఉపాధ్యాయులంతా ఆలోచించి సరైన వ్యక్తి ఓటు వేస్తారు'.

# ఇళ్ల స్థలాల కేటాయింపులో నిర్లక్ష్య వైఖరికి చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేసిన జర్నలిస్టులు

జర్నలిస్టులకు కేటాయించిన భూమిని ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేయాలిలి

జర్నలిస్టులు ఇక ఉద్యమాలకు సిద్ధం కావాలి

ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు డిమాండ్



**ములుగు జిల్లా ప్రతినిధి,తెలంగాణ సేన న్యూస్ :** ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించిన 23 ఎకరాల స్థలాన్ని తక్షణమే జర్నలిస్టులకు అప్పగించి స్థలాలను పంపిణీ చేయాలని, అందుకు అవసరమైన కార్యాచరణను వేగవంతం చేయాలని ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధికారులను డిమాండ్ చేశారు.ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించిన 23 ఎకరాల భూమిని జర్నలిస్టులకు అప్పగించే అంశంలో తీవ్ర నిర్లక్ష్యం వైఖరికి నిరసనగా జర్నలిస్టులు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం జరిగిన జర్నలిస్టుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత మూడు దశాబ్దాలుగా జర్నలిస్టులు సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్నారని, గత సర్కార్ జర్నలిస్టులకు 23.2 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసి జీవోను విడుదల చేసిందని, కానీ రోజురోజుకు జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే జర్నలిస్టులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం హౌసింగ్ సొసైటీ కి తక్షణమే భూమిని అప్పగించి జర్నలిస్టులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మూడు జర్నలిస్ట్ యూనియన్లు, హౌసింగ్ కమిటీ, ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీతో సమన్వయంగా వ్యవహరించి సమస్య పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని సూచించారు. సభ్యత్వాలు రాని జర్నలిస్టులకు తక్షణమే సభ్యత్వాలు ఇవ్వాలని, ఇళ్ల స్థలాల సాధన కోసం ఇకపై దశల వారి ఆందోళనలు నిర్వహించాలని, అందుకు అవసరమైన జేఏసీ ని ఏర్పాటు చేయాలని కోరారు. దశలవారి ఉద్యమం లో జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు, వీడియో గ్రాఫర్లు, ఫోటోగ్రాఫర్లు, పలు విభాగాలకు చెందిన జర్నలిస్టు మిత్రులు పాల్గొని ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని, అందుకు అవసరమైన చొరవ మూడు యూనియన్లు, హౌసింగ్ కమిటీ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టి జె ఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, సీనియర్ డెస్క్ జర్నలిస్టులు నారాయణ రావు, ప్రసాద్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు చక్రవర్తి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ కే జానీ పాషా, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కి గోపి, సహాయ కార్యదర్శులు మూల జీవన్ రెడ్డి, మేడి రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్, సూర్య బ్యూరో సత్యనారాయణ, మహిళ ప్రతినిధులు వంగూరి ఈశ్వరి, రోజా, శ్రీదేవి, జర్నలిస్టు నాయకులు సంతోష్, అంతోటి శ్రీనివాస్, పానకాలరావు, తిరుపతి రావు, గోవింద్, వెంకటరెడ్డి, హుస్సేన్, వెంకటాద్రి, నాగేష్, గణేష్, సూర్య, శ్రీధర్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, ఉపేందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బడా కార్పొరేట్ శక్తులకు ఉడిగం చేసేలా కేంద్ర బడ్జెట్

సీపీఎం జిల్లా నాయకులు కొరబోయిన కుమారస్వామి



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఈరోజు ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రజలను వంచన చేసి బడా కార్పోరేట్ శక్తులకు ఉడిగం చేసే విధంగా ఉందని, ప్రజలకు ఆసరాగా లేని బడ్జెట్ ప్రవేశపెట్టారని దాని నిరసిస్తూ ఈ రోజు నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డు కూడలి వద్ద సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కొరబోయిన కుమారస్వామి మాట్లాడుతూ 2025-26 బడ్జెట్ తన రాజకీయ అవసరాలే ఉపయోగించుకున్నది తప్ప, దేశ సమ్మిళిత వృద్ధిని ఏమాత్రం పట్టించుకున్నట్లు లేదని కేంద్ర ప్రభుత్వం పదే పదే వల్లెవేస్తున్న వికసిత్ భారత్ ఇలాంటి వైఖరితో సాధ్యమవుతుందా అని పునర్ సమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు .ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు పెద్ద మొత్తంలో వరాలు ప్రకటించి, ఎన్నికలు లేని రాష్ట్రాల పట్ల వివక్ష చూపడం సరికాదు. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అంటూ ప్రసంగించిన నిర్మల సీతారామన్ దేశమంటే కొన్ని రాష్ట్రాలే అన్నట్లు బడ్జెట్ ప్రవేశ పెట్టడం బాధాకరం పది సంవత్సరాలనుండి ఇదే దోరణిని ప్రదర్శిస్తూ రాజకీయ అవసరాలు తీర్చుకుంటున్నది కేంద్ర ప్రభుత్వంలీ. 2024 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్, 2025 ఢిల్లీ, బిహార్ రాష్ట్రాల కోసం బడ్జెట్ పెట్టారు 2026 యూపీ బడ్జెట్, 2027 గుజరాత్ కోసం బడ్జెట్ పెడుతారా యావత్ దేశానికి సరిపోయే బడ్జెట్ ఎప్పుడు పెడతారని ప్రశ్నించారు. బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి చోటు లేదా తెలంగాణ ప్రాంత ప్రయోజనాలకు విలువ లేదా అని విమర్శించారు .ఇది కేంద్ర బడ్జెట్ లా లేదు, కేవలం మూడు, నాలుగు రాష్ట్రాల బడ్జెట్ లాగా ఉందని అన్నారు తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు ఉండి తెలంగాణ రాష్ట్రానికి ఏం సాధించినట్లు అని విమర్శించారు తెలంగాణతో తమకు బంధం లేదని బడ్జెట్ ద్వారా మరోసారి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరూపించింది. కేంద్ర జీడీపీకి 5.1శాతం కాంట్రిబ్యూట్ చేస్తున్న తెలంగాణ మరోసారి మోస పోయిందని ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ట్రైబల్ యూనివర్సిటీకి ఇవ్వాల్సిన నిధులు కూడా ఇవ్వకపోవడం బాధాకరం తెలంగాణకు నిధులు కేటాయించక పోవడం దారుణమని అన్నారు . రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీ చేసిందేం లేదు అని కేంద్రం బడ్జెట్ ద్వారా నిధులు రాబట్టుకోవడంలో బిజెపి ఎంపీలు విఫలమయ్యారని .బిజేపీ పార్టీ తీరు వల్ల తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని నిధుల కేటాయింపు సంగతి దేవుడెరుగు, విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను కూడా కేంద్రం నెరవేర్చలేకపోయిందని .కేంద్రానికి మద్దతు పలికిన జనతాదళ్ (యూ) బీహార్‌లో వివిధ అభివృద్ధి పనులకు గతేడాది రూ. 26,000 కోట్ల సాయం, 2,400 మెగావాట్ల పవర్ ప్లాంట్, గయాలో పారిశ్రామిక కారిడార్, నూతన విమానాశ్రయాలు, మెడికల్ కాలేజీలకు సాయం తదితరాలు పొందింది.ఎన్నికలు దగ్గర ఉన్నాయని ఇప్పటి బడ్జెట్ లో బిహార్ కు మరిన్ని వరాల జల్లు కురిపించారు.బిహార్ లో మఖాన బోర్డు ఏర్పాటు,మిథిలాంచల్ లో వెస్టర్న్ కోసి కెనాల్,ఐఐటీ పాట్నా విస్తరణ,బిహార్ లో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు,ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.8 సీట్లు ఇచ్చి బీజేపిని గెలిపిస్తే తెలంగాణ ప్రజలకు మొండి చెయ్యి ఇచ్చారని 8 మంది బిజెపి ఎంపీలు, రాష్ట్రానికి ప్రత్యేకంగా 8 రూపాయలు కూడా అధికంగా సాధించిన దాఖలాలు లేవు అని అన్నారు తెలంగాణలో ప్రాజెక్టుల సంగతి ఏమిటి? పునర్విభజన చట్టం హామీల పరిస్థితి ఏమిటి దేశ ప్రయోజనాలు కాపాడటంలో బీజేపీ వైఫల్యం చెందిన విషయాన్ని దేశ ప్రజలు గమనించాలని అన్నారు ఈ కార్యక్రమం లో సీపీఎం పట్టణ కార్యదర్శి , హన్మకొండ శ్రీధర్,పట్టణ నాయకులు గడ్డమీద బాల కృష్ణ, కంది కొండ రాజు, బుర్రి ఆంజనేయులు, ఎండీ ఫరిదా, వజ్జంతి విజయ ,కార్తీక్ అనిల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాములపర్తిలో ఘనంగా శివాజీ జయంతి వేడుకలు



**తెలంగాణ సేన న్యూస్ :** ఛత్రపతి శివాజీ తరగని స్ఫూర్తి అని తాండా బాలకృష్ణ గౌడ్ అన్నారు, సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాముల పర్తి గ్రామంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకొని గ్రామస్తుల ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త తాండ బాలకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ అఖండ భారత సామ్రాజ్యమే లక్ష్యంగా మొగల్ చక్రవర్తులను ఎదిరించి పోరాడిన యోధుడు ఛత్రపతి శివాజీ శౌర్యానికి ప్రతిరూపమని వారి అడుగుజాడల్లో యువత పయనించాలని అన్నారు ఈ కార్యక్రమంలో రాజు, ప్రవీణ్ బాలకృష్ణ ,మల్లేష్ అనిల్ ,అరుణ్ ,భాస్కర్ ,భాను,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్జీబీటీఐక్యూ లకు తోడుగా

విద్యలో సమాన అవకాశాలు, హక్కుల దిశగా ప్రయాణం




**విద్యారణ్య పూరి, కె యూ/హన్మకొండ తెలంగాణ సేన న్యూస్ :** ట్రాన్స్ జెండర్ లపై అపోహలు తొలిగిపోవాలని, వారిని చూసే తీరు మారాలని ట్రాన్స్ జెండర్ హక్కుల కార్యకర్త ఓరుగంటి లైలా అన్నారు. తనను తాను ట్రాన్స్ మహిళగా పరిచయం చేసుకున్నానంటే, బయట హిజ్రాలను బెగ్గర్‌గా సమాజం చూస్తుంది. సమాజంలో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అన్నిట్లోనూ సమాన అవకాశాలు, హక్కులు కల్పించాలని కోరారు.సాథీ, స్టార్ సంస్థల సంయుక్త ఆద్వర్యంలో సోషియాలజీ సోషల్ వర్క్ డిపార్ట్ మెంట్స్ కలిసి సెమినార్ నిర్వహించారు.సోషియాలజీ డిపార్ట్ మెంట్ హెచ్. ఓ. డి స్వర్ణలత మాట్లాడుతూ ఎడ్యుకేషన్ లో ట్రాన్స్ జెండర్ లకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో స్టార్ సంస్థ జనరల్ సెక్రటరీ కిరణ్ నాయక్, ప్రతినిధులు అమిత్, నేహా, ప్రొ. ఐలయ్య, ప్రొ. రాజ్ కుమార్, డా. వెంకన్న, ప్రొ. కె. శ్రీనివాస్,ప్రొ. ప్రసన్న, ప్రొ. వాసు, సోషియాలజీ విద్యార్థులు సాంబ రాజు, గణపతి, ఉదయ్, శర్మ, అమర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బన్సిలాల్ పేటలో శివాజి జయంతి



**సికింద్రాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** బన్సిలాల్ పేట్ డివిజన్ లో జై భవాని వీర్ శివాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ కైలాష్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ 395వ జయంతి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ భారత జాతి సగర్వంగా చెప్పుకునే ధీరుడు.. వీరత్వానికి ప్రతీకగా కొలుచుకునే యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నిర్వాహకులు కైలాష్, నితిన్, సాయి, శాంతి, విక్కీ, నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్ కుమార్, మహేందర్ గౌడ్, రమణ, లంక రాజు, తదితరులు పాల్గొన్నారు.

## రెజిమెంటల్ బజార్ చత్రపతి శివాజీ జయంతి




**సికింద్రాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్ ఛత్రపతి శివాజీ మహారాజ్ మరాఠా ధర్మశాల ప్రెసిడెంట్ గోవింద్ బైసి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ 395వ జయంతి ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత జాతి సగర్వంగా చెప్పుకునే ధీరుడు వీరత్వానికి ప్రతీకగా కొలుచుకునే యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అన్నారు అనంతరం ఆయన శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ బాబు పాటిల్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాబాన్ పాటిల్ ధర్మశాల మెంబర్ సంతోష్ బాబురావు, బీరదర్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

### జిల్లావ్యాప్తంగా చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఘనంగా నివాళి



**తెలంగాణ సేన న్యూస్,మహబూబ్ నగర్ :** జిల్లా వ్యాప్తంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు బాలనగర్ మండలం పెద్దరేవల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాష్కారంలో ఎంపీ డీకే అరుణ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పాల్గొన్నారు జడ్చర్లలో ఛత్రపతి మహారాజు విగ్రహానికి పూల ఆవిష్కరణ అలాగే రక్తదాన కార్యక్రమం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాజీ మంత్రి లక్ష్మారెడ్డి వివిధ రాజకీయ నాయకులు అధికార ప్రతినిధులు పాల్గొన్నారు మిడ్జిల్ మండలంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఘనంగా నివాళి అర్పించారు ఏబీవీపీ. బిజెపి యువ మోర్చా ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి





**తెలంగాణ సేన న్యూస్ మహబూబ్నగర్ :** జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో ఫంక్షన్ హాల్ లో వేముల యువ నాయకుడు వెంకటస్వామి సోదరుడికి వివాహానికి హాజరైన వధువరులను ఆశీర్వదించిన మాజీ మంత్రివర్యులు డాక్టర్ లక్ష్మారెడ్డి గారు. మాజీ ఎంపీపీ సుదర్శన్. పి టి సి బాలు శశిరేఖ. జిల్లా నాయకులు సుధా బాలరెడ్డి శ్రీనివాస్ గుప్తా మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్. యూత్ విగ్ బంగారు. మాజీ సర్పంచ్ మంజుల భాస్కర్ నాయక్. మండల నాయకులు జగన్ గౌడ్ విజయ నాయక్ ఆంజనేయులు రవి నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సింగం సత్తయ్య నియామకం



**తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం కాశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ బిజెపి నాయకుడు సింగం సత్తయ్య బీజేపీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నియామకమయ్యారు, బుధవారం సింగం సత్తయ్య మాట్లాడుతూ నా మీద నమ్మకంతో బిజెపి పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా అవకాశం కల్పించిన బీజేపీ నాయకులకు, ఎంపీ రఘునందన్ రావు ఎంపీ ఈటెల రాజేందర్ కు, బీజేపీ శ్రేణులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు,బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ విజయం సాధించడానికి కార్యకర్తలు కృషి చేయాలని, మోడీ సారథ్యంలో భారతదేశం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి జయ కేతనం ఎగుర వేస్తుందని అన్నారు.

## చేబర్తిలో ఘనంగా శివాజీ జయంతి వేడుకలు



**తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చేబర్తి లో బుదవారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా, శివాజీ యూత్, బజరంగ్ దళ్ యూత్ ఆధ్వర్యంలో, స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సిద్దేశ్వర్, మర్కుక్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ర్యాకం యాదగిరి, సీనియర్ నాయకుడు తిరుపతి,చంద్రం, తోట హరి బాబు, ప్రవీణ్, బాబు,నవీన్,అనిల్,రాంబాబు, బాను,బాబు, శివాజీ యూత్ సభ్యులు, బజరంగ్ దళ్ యూత్ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముట్రాజ్ పల్లిలో ఘనంగా శివాజీ విగ్రహ ఆవిష్కరణ



**తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ముట్రాజ్ పల్లి గ్రామంలో శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ రాజమౌళి, తాజా మాజీ కౌన్సిలర్ శ్యామల మల్లేశం, బిజెపి సీనియర్ నాయకుడు జశ్వంత్ రెడ్డి, మనోహర్ యాదవ్, నందు పంతులు మాట్లాడుతూ, ముట్రాజ్ పల్లి లో చత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని, చత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటు కు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు, యువతకు స్ఫూర్తి ప్రదాత శివాజీ మహారాజ్ అని అన్నారు,అనంతరం శివాజీ యూత్ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహ దాత వేమూరి ఆంజనేయులు గౌడ్ కు, విగ్రహ ఏర్పాటుకు సహకరించిన దాతలకు చిరు సన్మానం చేశారు, ఈ కార్యక్రమంలో హైందవ సోదరులు, బజరంగ్దళ్ విశ్వహిందూ పరిషత్ సభ్యులు, గజ్వేల్ ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ నాగమున్నయ్య, బుక్క రమేష్, నాయిని సందీప్, మర్కంటి ఏగొండ, కాశమైన సందీప్, ము ట్రాజ్ పల్లి యువకులు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వంగపల్లి అంజయ్య స్వామి సేవలు అభినందనీయం బండ్రు శోభారాణి



**తెలంగాణ సేన న్యూస్ :** వంగపల్లి అంజయ్య సేవలు అభినందనీయమని మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి అన్నారు బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కాచారం రేణుక ఎల్లమ్మ దేవాలయం లో అమ్మవారిని దర్శించుకున్న బండ్రు శోభారాణి ఈ సందర్భంగా బండ్రు శోభారాణి మాట్లాడుతూ ప్రజలను భక్తి మార్గం వైపు పయనించే విధంగా కృషి చేస్తూ ప్రతి మంగళవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న వంగపల్లి అంజయ్య స్వామి అభినందనీయని అన్నారు, అనంతరం వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కాచారంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అనగా 23 - 02 - 2025 రోజున నిర్వహించే వార్షికోత్సవ వేడుకలకు రావాల్సిందిగా శ్రీమతి శోభారాణి కి ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది అని అన్నారు.

## యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షరెడ్డికి ఘన సన్మానం



**తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో బుధవారం కాంగ్రెస్ నాయకుడు సమీర్, కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్ష రెడ్డికి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు అనంతరం సమీర్ మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలుగా ఆంక్ష రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వారికి చిరు సన్మానం చేయడం జరిగిందని ఆంక్ష రెడ్డి రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తూ గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కూతురుగా తండ్రికి తగ్గ తనయగా ప్రజల్లో మంచి ఆదరణ పొందాలని, స్వశక్తితో రాజకీయాల్లో రాణిస్తూ, యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేసి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలుగా ఎన్నికవ్వడం అభినందనీయమని, వారికి మంచి రాజకీయ భవిష్యత్తు ఉన్నదని అన్నారు.

## భరతజాతి ఆత్మగౌరవ ప్రతీకా చత్రపతి శివాజీ మహారాజ్



**ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ , ఏటూరునాగారం :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏటూరు నాగారం నందు తేదీ 19-02-2025 న చరిత్ర విభాగం ఆధ్వర్యంలో శివాజీ జన్మదినాన్ని పురస్కరించుకొని శివాజీ జయంతి ఉత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ రేణుక శివాజీ చిత్రపటానికి అధ్యాపక బృందంతో కలిసి మాలాధారణ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చరిత్ర విభాగాధిపతి వెంకటయ్య ప్రసంగిస్తూ శివాజీ సామాన్య సైనిక జీవితం నుంచి ఒక గొప్ప రాజ్య నిర్మాతగా ఎదిగిన విధానమును, మరియు అనైక్యతతో ఉన్న మరాఠా జాతిని ఏకీకృతం చేసి మరాఠా స్వరాజ్యాన్ని సాధించిన గొప్ప యోధుడని కొనియాడారు. శివాజీ "మరాఠులకు కీర్తికరుడని - మొగలులకు భయంకరుడని కీర్తించబడ్డాడు. ఛత్రపతి బిరుదంతో పరిపాలించి యావత్ భారత జాతికే కాక ప్రపంచ ప్రజలందరికీ మార్గదర్శకుడని, ఆదర్శనీయుడని, గొప్ప మతసహన పరిపాలకుడని శివాజీ సౌశీల్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నవీన్, కోఆర్డినేటర్ జ్యోతి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ శ్రీమతి కానీస్ ఫాతిమా, రమేష్, జీవ వేణి, సంపత్, మున్ని,శేఖర్, అభిలాష్, సుమలత తదితర అధ్యాపకులు, విద్యార్థులుపెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## కార్పొరేట్, మతోన్మాద ఆర్ఎస్ఎస్, బిజెపి ఫాసిజాన్ని ప్రతిఘటిద్దాం



సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్

**కొత్తగూడ తెలంగాణ సేన :** దేశంలో ప్రజాస్వామ్యం లౌకికవాదం పిడరలిజంలకై ప్రతి ఒక్కరూ పోరాడాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ కొత్తగూడ, గంగారం సంయుక్త మండలాల సహాయ కార్యదర్శి ల్యాదల్ల రాజు పిలుపునిచ్చారు. బుధవారం చలో ఢిల్లీ కార్యక్రమం పిలుపులో భాగంగా కొత్తగూడ మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ల్యాదల్ల రాజు మాట్లాడుతూ ఈ సంవత్సరం బడ్జెట్ కేటాయింపులో కేంద్రం కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు అనుగుణంగా బడ్జెట్ కేటాయించడం జరిగిందని ఉపాధి కల్పనపై, కనీసం రైతులకు మద్దతు ధరపై బడ్జెట్ కేటాయించకపోవడం చాలా బాధాకరమన్నారు. సామాన్య ప్రజల కొనుగోలు శక్తిని పెంచే విధంగా రైతు రుణమాపిపై దృష్టి పెట్టకుండా ఆదాని, అంబానీ లాంటి అనేకమంది కార్పొరేట్ దొంగలకు లాభాలు చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం విడ్డూరమన్నారు. దేశంలో నెలకొన్న కార్పొరేట్, మతోన్మాద ఆర్ఎస్ఎస్, బిజెపి పాసిజాన్ని అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించి ఒంటరిని చేసి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సంయుక్త మండల నాయకులు కంగాల పాపన్న, రాజబోయిన రాజు, అప్పారావు, లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ 395వ జయంతి ఉత్సవాలు



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ - బజరంగ్దళ్ , అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, చత్రపతి శివాజీ యువదల్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ రక్షకుడు, హిందూ సామ్రాట్ చత్రపతి శివాజీ మహారాజ్ 395 జయంతి (ఫిబ్రవరి 19) న వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాజీ నిలువెత్తు చిత్రపటానికి పాలాభిషేకం చేసి, ఘనంగా పుష్పాలతో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విశ్వహిందూ పరిషత్ జిల్లా సహా కార్యదర్శి మల్యాల రవి మరియు నర్సంపేట ఉపాధ్యక్షులు రిటైర్డ్ ఉపాధ్యాయులు రవీందర్ శర్మ మాట్లాడుతూ " ఎందరో యువకులకు ఆదర్శంగా నిలిచిన నిజమైన మహనీయుడు చత్రపతి శివాజీ మహారాజ్ తన తల్లి, తన గురువు నడిపిన బాటలో భరతమాత కోసం హైందవ ధర్మ రక్షణ కోసం చివరి కంట పోరాడిన హిందూ ధర్మస్థాపకుడు చత్రపతి శివాజీ మహారాజ్ అని చెప్పారు ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలు పుట్టిన రోజుల సందర్భంగా కేకులు కాదు బాకులతో యుద్ధనీతి నేర్పే విధంగా హిందూ ధర్మరక్షణకు కంకణబద్దులు అవ్వాలని ప్రతి తల్లి తండ్రి పిల్లలకు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత చరిత్రని తెలియచేసి ప్రతి ఒక్కరిని శివాజీ మహారాజ్ లా తీర్చిదిద్దలని పిలుపునిచ్చారు. ఇలా ప్రతి ఇంటిలో ఒక శివాజీ మహారాజ్ ఒక శంబాజీ మహారాజులు తయారయ్యే విధంగా సినిమాలు కానీ నాటక రంగాలలో మరియు పాఠ్యపుస్తకాలలో వీరి చరిత్రలను తెలిపే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, దీనిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించే విధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ భాషబోయిన వెంకటేష్ నర్సంపేట విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు చోల్లేటి జగదీశ్వర్ కార్యదర్శి వేల్పుల శ్రీధర్,ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవెందర్ భజరంగ్ దళ్ చరణ్ ప్రేమ్ శివ గణేష్, ఏబీవీపీ కార్యకర్తలు ప్రణయ్, ప్రదీప్,రాకేష్, ఛత్రపతి శివాజీ యువ దళ్ కార్యకర్తలు దుర్గ, సాయి, ప్రవీణ్,జీవన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ప్రమాద భీమా తో భరోసా - కలెక్టర్ కోయ శ్రీహర్ష

టీఎస్ జేయు ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఉచిత ప్రమాద బీమా పత్రాలు అందజేత

టీ ఎస్ జే యూ పెద్దపల్లి జిల్లా నూతన కమిటీ ఎన్నిక



**ములుగు జిల్లా ప్రతినిధి,తెలంగాణ సేన న్యూస్ :** జర్నలిస్టులందరికీ వ్యక్తిగత ప్రమాద భీమా తప్పనిసరి అని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. టీ.ఎస్.జే.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పెద్దపల్లి టీఎస్ జేయు యూనియన్ సభ్యులందరికీ ఐదు లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని అందజేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో దీనికి సంబంధించిన బీమా పత్రాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది జర్నలిస్టులు ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడుతుంటారు. ఆ సమయంలో వీరికి ప్రమాద బీమా ఎంతగానో ఉపయోగపడుతుంది అని అన్నారు. టీఎస్ జెయు ఆధ్వర్యంలో జర్నలిస్టులందరికీ ప్రమాద బీమా కల్పించడం నిజంగా అభినందించదగ్గ విషయం అని అన్నారు. కార్యక్రమంలో టీఎస్ జేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, సహాయ కార్యదర్శి రావుల నరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆవునూరి సంపత్ లతో పాటు జిల్లా నూతన కమిటీ బాధ్యులు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా నూతనంగా ఎన్నికైన టీ ఎస్ జే యూ జిల్లా కమిటీని కలెక్టర్ తో పాటు జిల్లా అధికారులు అభినందించారు. ఎన్నికైన టీ ఎస్ జె యూ పెద్దపల్లి జిల్లా నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా బొమ్మగాని శ్రీనివాస్ గౌడ్, కారెంగుల సురేష్ తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీ ఎస్ జే యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని రాష్ట్ర జాయింట్ సెక్రటరీ లు రావుల నరేష్, ఆవునూరి సంపత్ లు ప్రకటించారు. అధ్యక్షులుగా బొమ్మగాని శ్రీనివాస్ గౌడ్ ,ప్రధాన కార్యదర్శిగా కారెంగుల సురేష్, కోశాధికారిగా ఇజ్జగిరి వెంకటేష్, ఉపాధ్యక్షులుగా కొయ్యల రాజమల్లు, పరకాల లక్ష్మీనారాయణ గౌడ్, సహాయ కార్యదర్శులుగా తోట సతీష్, దాసరి వెంకట్, కన్నూరి హరీష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కండె రవీందర్, కలువల రవికుమార్, ఈసీ మెంబర్లుగా తాంబూరి తిరుమలేష్, కె రాజేందర్, సంకే రాజు, కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు.

# గౌరవ డాక్టరేట్ అందుకున్న జబర్దస్త్ రాజమౌళికి ఘనసన్మానం



**మహబుబాబాద్ టౌన్ తెలంగాణ సేన ఫిబ్రవరి :** గౌరవ డాక్టరేట్ అందుకున్న జబర్దస్త్ రాజమౌళిని పురప్రముఖులు, అభిమానులు ఘనంగా సన్మానించారు. బుధవారంనాడు స్థానిక పెరుమాండ్ల జగన్నాధం భవన్ లో జర్నలిస్ట్ గుండెల రాజు సారధ్యంలో కొమిరె సాకి అధ్యక్షతన ఈకార్యక్రమం జరిగింది. ముఖ అతిధిగా హాజరైన ప్రముఖ సినీ సంగీత దర్శకుడు బోలేశావలి మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన గడ్డం రాజమౌళి సక్సెస్ కు మారుపేరుగా నిలిచారన్నారు. ఎక్కడో మారుమూల జంగిలిగొండ గ్రామం నుండి అంచెలంచెలుగా ఎదిగి వెండితెరపై నవ్వుల జల్లు కురిపిస్తున్న రాజమౌళికి గౌరవ డాక్టరేట్ రావడం ఒక కళాకారునికి దక్కిన అరుదైన గౌరవం అని కొనియాడారు.కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా అధికార ప్రతినిధి దేవరం ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ తనజీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా మొక్కవోని దీక్షతో వెండితెరపై నటునిగా రాణించడం గొప్పవిషయమన్నాడు. నటునిగానే కాకుండా ఎంతోంది నిరుపేదలకు సహాయసహకారాలు అందిస్తూ తన ఉదారతను చాటుకున్న మంచి మనిషి అని ప్రశంసించాడు. తన అభినయంతో నవ్వులు పూయించే రాజమౌళి ఎంతోమంది కళాకారులకు స్ఫూర్తిగా నిలిచారన్నాడు.సిపిఎం నాయకుడు సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ గడ్డం రాజమౌళి మానుకోట కళారంగానికే మకుటాయమానంగా నిలిచారన్నాడు. బుల్లితెరనుండి వెండితెరపై తన హాస్య నటనా ప్రావీణ్యంతో మన ప్రాంతానికి గొప్ప పేరు, గుర్తింపు తెచ్చాడన్నారు.సిపిఐ నాయకులు విజయ్ సారథి మాట్లాడుతూ మారుమూల పల్లెనుండి టాలీవుడ్ లో గొప్ప క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణిస్తున్న గడ్డం రాజమౌళికి మున్ముందు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తమ నటుని అవార్డు రావాలని ఆకాంక్షించారు.మహబూబాబాద్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ డా. పాల్వాయి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ జబర్దస్త్ రాజమౌళిని గతంలోనే మున్సిపాలిటీ బ్రాండ్ అంబాసిడర్ గా నియమించుకున్నామన్నాడు. ఎన్నో ప్రజాయుత చైతన్య కార్యక్రమాలు నిర్వహించి రాజమౌళి సందేశం ద్వారా సమాజమార్పుకు నాంది పలికామన్నారు.అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారథి రాష్ట్ర అధ్యక్షుడు కొమిరె వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమ ఆద్యంతం ధూందాం పాటలతో హోరెత్తించారు. స్నేహితులు, అభిమానులు గడ్డం రాజమౌళి దంపతులను గజమాలతో సత్కరించి శాలువాలతో జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు.ఇంకా ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అజయ్ సారధి, శంతన్ రామరాజు, కూతురు సత్యనారాయణ, గిద్దె రాం నర్సయ్య, బండ వెంకన్న, కంబాలపల్లి సత్యనారాయణ, డా. పరికిపండ్ల అశోక్, జానీ, ఐలేష్ తో కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆరో వార్షికోత్సవం

ఆలయదాత బొద్దుల దివాకర్ త్రివేణి



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** పట్టణం యందు ఈరోజు 19 ఫిబ్రవరి 2025 బుధవారం రోజున శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయ ప్రాంగణం యందు ఆలయ సేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం నిర్మించి ఆరో వార్షికోత్సవ మహా వేడుక మహా అన్నదానం వైభవంగా జరిగింది. శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం ఆరో వార్షికోత్సవ మహా వేడుకలు దేవాలయ దాత బొద్దుల దివాకర్ తండ్రి బొద్దుల శేషయ్య జ్ఞాపకార్థకం నిర్మించిన ఆలయంలో అభయాంజనేయ స్వామి మూలవిరాట్టు, పంచలోహ విగ్రహానికి అర్చకులు బ్రహ్మశ్రీ వెన్నంపల్లి నిశాంత శర్మ అవధాని సతీష్ తివారి ఫ్రాన్స్ శివ అంకిత్ ల పూజా విధానంలో పాలు పెరుగు తేనె చక్కెర పంచామృతాలు పసుపు కుంకుమ చందనం లచే బొద్దుల దివాకర్ కుటుంబ సమేతంగా అభిషేకాలుచేయగా నూతన పట్టు వస్త్రం తమలపాకు,, ఆకు గజమాలతో అలంకరణ చేయగా మంగళహారలతో శ్రీరామదూత స్వాగతం పలుకుతూ మధుర గానాలతో ఆలయం భక్తులు కరచాల ధ్వనులతో ఆంజనేయస్వామి భక్తి పరవశం చెందగా స్వామికి నైవేద్యం సమర్పించగా భక్తులకి మహా అన్నదానం నిర్వహించగా ఆలయ చైర్మన్ చేతుల మీదుగా ఆలయ దాత కుటుంబాన్ని ఘనంగా సన్మానించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆలయ దాత బొద్దుల ఉదయమ్మ దివాకర్ త్రివేణి నాగరాజు సౌమ్యశ్రీ అద్విత్ శేషాద్రి ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా రజని సైఫా సురేష్ దొడ్డ రవీందర్ గుప్తా శ్రీరామ్ ఈశ్వరయ్య మాదాలపు చంద్రశేఖరం వదినేపల్లి వెంకటేశ్వర్లు శారద బాల్నే సర్వేశం ఇరుకు కోటేశ్వరరావు చకిలం కృష్ణమూర్తి తక్కెళ్ళపెల్లి చలపతిరావు యుగంధర్ రావు శ్రీనివాస్ రావు,పాలకుర్తి శ్రీనివాస్ శింగిరికొండ వేణుగోపాల్ పిన్న రామనాథం బండారుపల్లి చెంచారావు కళ్యాణి దొడ్డ వేణు మనోహర్ మల్యాల రాజు శ్రీలత ఆకుల ప్రభాకర్ కూచన రవీందర్ గాయకులు మండ వీరస్వామి సురేష్ ఆలయ గురుస్వాములు గుమస్తా దేశి రాము భక్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తెలంగాణ ఉద్యమకారుల కు 250 గజాల స్థలం ఇవ్వాలి

ఉద్యమకారులకు నెలకు 30000 గౌరవ వేతనాన్ని ప్రతినెలా ఇవ్వాలి



**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం తెలంగాణ ఉద్యమకారుల సమావేశ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రఫుల్ రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి ,జేఏసీ గౌరవ అధ్యక్షుడు రంగారెడ్డి లు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఉద్యమంలో పని చేసి లబ్ధి పొందని కళాకారులను సాంస్కృతి సారధిలోని వివిధ పోస్టులలో అవకాశం ఇవ్వాలని ఉచిత బస్సు పాసులు 250 గజాలు ఇంటి స్థలంలో పాటు నాలుగు గదుల ఇల్లు నిర్మించి అందజేయాలని ప్రభుత్వ పథకాలలో ఉద్యమకారులను మొదటి ప్రాధాన్యత ఇవ్వాలనీ ఇతర రాష్ట్రాల్లో ఉద్యమకారులకు ఆర్థిక సహకారాలు అందిస్తున్నట్లుగా తెలంగాణ ఉద్యమకారులకు నెలకు 30000 గౌరవ వేతనాన్ని ప్రతినెలా ఇవ్వాలని అమరవీరుల స్మృతి వనము 100 ఎకరాలలో ఏర్పాటు చేసి ఉద్యమకారులకు ఆరోగ్య భీమా 20 లక్షల వరకు ఏర్పాటు చేసి ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు సంక్షేమ నిధిని అందించి తెలంగాణ ప్రతి జిల్లాలోని అమరులైన ఉద్యమకారులకు స్మారక భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు నాయకులు సోమన్న యాదగిరి చంద్రన్న ప్రసాద్ మాధవి యాదగిరి ఏ యాదగిరి తదితరులు పాల్గొన్నారుతదితరులు పాల్గొన్నారు.

# తిరుగు వారంతో ముగియనున్నా మినీ మేడారం జాతర

తిరుగు వారం లో సందడి చేసిన భక్తులు



**ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవంగా మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మినీ మేడారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వచ్చిపోయే భక్తులు వన దేవతలకు మొక్కులు చెల్లించారు. ఈరోజు తిరుగు వారం కావడం తో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కాగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బస్ సౌకర్యం కల్పించడం, మరుగుదొడ్ల నిర్మాణం, జంపన్న వాగు ఒడ్డున స్నాన ఘట్టాలు చాలా సౌకర్యంగా ఉన్నాయని భక్తులు పేర్కొన్నారు. మేడారం లో ఒకప్పటి ఆలయాల పూజారులు మేడారం సమ్మక్క సార్లమ్మ ల వివరణ ఇచ్చారు. ఆలయాల స్థానం లో గుడిసెలు ఉండేవి మాఘా శుద్ధ పౌర్ణమి వారం రోజుల ముందు వచ్చే బుధవారం గిరిజనులు పాత గుడిసెలను తొలగించి కొత్త వాటిని నిర్మిమించి భక్తి శ్రద్ధ లతో మండ మెలిగే పండగను నిర్వహించేవారు. ఆ తర్వాత పౌర్ణమికి మహా జాతర నిర్వహించడం ఆనవాయితీగా మారింది. తదుపరి మాఘా శుద్ధ పౌర్ణమికి రోజు గిరిజనులు జాతరకు బదులుగా కేవలం మండ మెలిగే పండగను నిర్వహించేవారు. ఈ పండగలో వన దేవతలకు శాంతి పూజలు చేసేవారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు మహా జాతర సమయంలో రాలేని వారు ఈ జాతరకు వచ్చే వారు ఈ విధంగా మండ మెలిగే పండగ చిన్న జాతర గా మారింది. ఈ యేడాది సుమారుగా 10 లక్షల మంది భక్తులు జాతరకు వస్తారని అంచనా. మేడారం మినీ జాతర నాలుగు రోజులు ఇలా మేడారం లోని సమ్మక్క కన్నెపల్లి లోని సారాలమ్మ దేవదాయాలను నేడు ఆదివాసీ పూజారులు శుద్ధి చేస్తారు. హద్దుల్లో ద్వారా స్తా%శీ%బాలు కట్టి గ్రామ నిర్బ%శీ%దం చేస్తారు. ఫిబ్రవరి 13 న సమ్మక్క సారాలమ్మ గద్దెల వద్ద పుసుపు కుంకుమ లతో అమ్మవార్లను ప్రతిష్టించి ప్రతేక పూజలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 14 న భక్తులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకొని ఉంటుంది. ఫిబ్రవరి 15 న ఆలయ పూజారులు గిరిజన సంప్రదాయ ప్రకారం అమ్మవార్లకు ప్రతేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

## తెలంగాణ మహాసభ ఆధ్వర్యంలో ఊస జయంతి




**జనగామ, తెలంగాణ సేన న్యూస్ :** తిరుమలగిరి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే అంబేద్కర్ చౌరస్తా వద్ద సామాజిక తెలంగాణ మహాసభ ఆధ్వర్యంలో ఉ. సాంబశివరావు గారి 73 వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిం చడం జరిగింది.ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమ కారులు ఈ జయంతి కార్యక్రమంలో పాల్గొని మహనీయులు ఉ. సాంబశివరావు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా సామా జిక తెలంగాణ మహా సభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య మాట్లాడుతూ ఉద్యమా ల ఉపాధ్యాయుడు, కులవర్గ సిద్ధాంతకర్త, ఊసగారని, సమాజం లో వర్గమే కాదు కులం కూడా ఉన్నదని అన్నా రు. కారంచేడు ఘటన లో వర్గంతో పాటు కులాన్ని కూడా రూపు మాపాలని కుల వర్గా సిద్ధాంతాన్ని రూపకల్ప న చేసి మారోజు వీరన్న తో కలిసి కులవర్గ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొచ్చారు. ఉసాగారు విద్యార్థి దశ నుండే సమాజంలో అసమానతలు ఉన్నా యన్న ఉద్దేశంతోటి కమ్యూనిజమే కరెక్ట్ అని ఆ పార్టీలో చేరి వివిధ కార్యక్రమాలతో పాటు అడవిలో కూడా పనిచేశారు.అట్లనే మైదాన ప్రాంతా లలో పనిచేశారు. రామన్నపేట నియోజక వర్గంలో కరెంటు కోసం, నీళ్ల కోసం,ప్రజల సమ స్యల కోసం అనేక పోరాటాలు చేసిన మహా గొప్ప నాయకు డు, కామ్రేడ్ ఉసా, ప్రత్యేక తెలంగాణ ఉద్య మంలో కూడా నిరంత రం పోరాడారు. ప్రజలలో సామాజిక చైతన్యం కల్పించిన మహా వ్యక్తి ఉసా అని, అలాంటి ఉసా గారు ఈ టైంలో మనకు లేకపోవడం చాలా బాధాకరం అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రభు, జిఎంపిఎస్ జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య, ఎమ్మార్పీ ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కందుకూరి సోమయ్య, సామాజిక ఉద్యమకారులు బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కందుకూరి ప్రవీణ్,పోరేళ్ళ లక్ష్మ య్య, వంగరి బ్రహ్మం, కందుకూరి శ్రీనివాస్, సంగేపాక రవి, కందు కూరి వెంకన్న, బుక్క రాజు తిరుపతి, కొత్త గట్టు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## వడపర్తి గ్రామంలోకి బస్సులు నడపాలి



**భువనగిరి, తెలంగాణ సేన న్యూస్ :** భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి గకి వడపర్తి గ్రామం నుండి వెళ్తున్న గజ్వేల్ బస్సులని మన గ్రామం లోపల నుండి నడపాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది దీని వలన వాడపర్తి గ్రామ ప్రజలకు మరియు విద్యార్థులకు చాలా ఉపయోగం ఉంటుంది అని తెలపడం జరిగింది.స్పందించి తప్పకుండా సమస్యను పరిష్కరిస్థ నాని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎలిమినేట్ కృష్ణ రెడ్డి ఉడుత ధనకోటి యాదవ్ జిన్నా సత్తయ్య షేకు షానూరు చిలివేరు శ్రీనివాస్ ముదుగుల ఆనందం షేకు గోరెమియా సంకూరి శ్రీకాంత్ మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# భోజరాజుగారి కొలువు



కాశీమజిలీల్లో ప్రస్తుతం సప్తమిత్ర చరిత్రలో ఉన్నాం. కాళిదాస మహాకవి రచించిన మేఘసందేశంలోని యక్షుడు కూడా ఒక ప్రధాన పాత్రగా.. ఏడుగురు మిత్రుల మధ్య ఈ కథ నడుస్తుంది. కాళిదాసు, భోజరాజు కూడా ఇందులో ఉంటారు. ఏడుగురు మిత్రులలో ఇద్దరు తప్ప మిగిలినవారు భోజరాజు ఆస్థానానికి వచ్చారు. భోజరాజుగారి కొలువుకూటంలో విద్వాంసుల సభ మొదలైంది. కాశీనుంచి వచ్చిన ఏడుగురు మిత్రులలో.. కుచుమార, గోనర్దీయ, చారాయణ, సువర్ణనాభ, గోణికాపుత్రులు అనే ఐదుగురూ ఒకవైపు కూర్చున్నారు. మరోపక్క కాళిదాసుతోపాటుగా దండి, భవభూతి, శంకరుడు మొదలైన వారందరూ ఆసీనులయ్యారు. కుచుమారుడు పైకిలేచి.. "మహారాజా! మేమంతా కాశీలో గురుకులవాసం చేసి వచ్చాం. మీ సంస్థాన పండితుల ప్రఖ్యాతిని విని వారితో ప్రసంగించడానికి వచ్చాం. మా ప్రతిభ చూసి, మాకు కూడా మీ కొలువులో తగిన స్థానాలు లభిస్తాయనే ఉద్దేశంతో ఉన్నాం. మాలో ఎవరితోనైనా సరే.. కాళిదాసుగారు వాదం చేస్తే బాగుండునని మా కోరిక" అన్నాడు.

### అందుకు శంకరుడు..

"బాబూ! మీ మాటలు గర్వభూయిష్టంగా ఉన్నాయి. కాళిదాసుగారిని మించిన పండితుడు ఈ ఆస్థానంలో లేడు. ఆయనతో వాదించాలంటే మధ్యవర్తి ఉండాలి. దానికి బ్రహ్మయో, బ్రహ్మపత్ని అయిన సరస్వతియో దిగిరావాల్సి ఉంటుంది. మీకోసం అంతపని చేయడం సాధ్యం కాదు కనుక, వేరెవరితో అయినా వాదం కోరుకోండి" అని సలహా చెప్పాడు. కుచుమారుడు మొదలైనవారంతా అందుకు ఒప్పుకొన్నారు. ఇతర పండితులతో చాలా ప్రసంగాలు జరిగాయి. వారిలో అనేకమందికి బిరుదులు, కానుకలు వేనవేలుగా లభించాయి. సభ ముగిసిన తరువాత భోజరాజు.. గోనర్దీయుడు, కుచుమారులను ఉద్దేశించి.. "ఆనాడు నేను మిమ్మల్ని పురందరపురంలో కలుసుకున్నాను. ఆనాడు సరస్వతి సమక్షంలో మీ ప్రతిభను ప్రత్యక్షంగా చూశాను" అని పలికాడు. ఆ మాటలతో మిత్రులందరూ ఒక్కసారి ఆశ్చర్యంతో భోజరాజుకేసి తేరిపార చూశారు.

### అప్పుడు సువర్ణనాభుడు పైకిలేచి, భోజరాజుతో..

"మహారాజా! దయచేసి మాకు మీతో ఏకాంత సమావేశానికి అవకాశం ఇప్పించండి. మేము మా గోడు కొంత చెప్పుకోవాల్సి ఉంది" అని కోరాడు. భోజరాజు అందుకు సమ్మతించాడు. ఐదుగురు మిత్రులతోపాటు, కాళిదాసు మాత్రమే అక్కడ ఉన్నారు. అప్పుడు చారాయణుడు ఇలా చెప్పాడు. "మహారాజా! నేను ఇక్కడికి సమీప అరణ్యంలో ఒక సిద్ధుణ్ని చూశాను. ఆయనకు వన్యమృగాలను ఐకమత్యంగా కలిసిమెలిసి బతికేలా చేయడం వచ్చు. ఇంకా అనేక విద్యలు వచ్చు. ఆయన నాకు గురూపదేశం చేసే సమయంలో కుట్రపన్ని భైరవుడనే దుర్మార్గుడు ఆయన తల పగులకొట్టాడు. నా నెత్తిమీద ఆకుపసరు పూసి నన్ను ముందుగా గాడిదను, తరువాత మేకను చేశాడు!". "ఆ.. భైరవుడా! వాడే మా మహారాణిని ఎత్తుకుపోయాడు" అని భోజరాజు ఆవేశపడ్డాడు. "ఆ సంగతి కూడా వస్తుంది ప్రభూ! చనిపోయిన సిద్ధుని విద్యలన్నీ మా కుచుమారునికి దైవవశాన పట్టుబడ్డాయి. ఇక మా గోనర్దీయుడు ఒక బ్రహ్మరాక్షసుని కారణంగా విద్యలు సాధించి, చిన్న రాజ్యానికి రాజయ్యాడు" అని చెప్పి కూర్చున్నాడు చారాయణుడు. అప్పుడు సువర్ణనాభుడు పైకి లేచాడు. "నిజానికి మేం ఏడుగురం మిత్రులం ప్రభూ! కాశీలో చదువు ముగించుకుని, వేర్వేరు ప్రాంతాలనుంచి ధారానగరానికి వస్తున్నాం. దారిమధ్యలో నాకొక యక్షకాంత పరిచయమైంది. ఆమెను వివాహం చేసుకుని, సంగీతసభలు నిర్వహించి.. నేను పొట్ట పోషించుకుంటున్నాను. నా భార్యకు అక్క బావలున్నారు. నా తోడల్లుడైన యక్షుడు మరెవరో కాదు.. మన కాళిదాసుగారి మేఘసందేశంలోని యక్షుడే!" అని చెప్పి కూర్చున్నాడు. భోజరాజు ఒకసారి తలతిప్పి కాళిదాసువైపు గౌరవ పురస్సరంగా చూశాడు.

### అప్పుడు గోణికాపుత్రుడు..

"ఆ యక్షుణ్ని మొదటిసారి చూసింది మా దత్తకుడు ప్రభూ! వాడే మొట్టమొదటగా ఈ ధారానగరానికి వచ్చాడు. అతని తరువాత నేను వచ్చాను. తమ కుమారుడైన చిత్రసేనుడికి చారుమతిని కూర్చినవాణ్ని నేనే. ఇంతకూ మా దత్తకుడు ఏమైపోయాడో తెలియలేదు. యక్షుని శాపం వల్లనే అతని రూపం మారిందని తరువాత తెలియవచ్చింది. ప్రస్తుతం చారుమతిగా మీ చిత్రసేనుల వారి భోగకాంతగా ఉన్నది మా దత్తకుడు అవునో కాదో.. తమరే తేల్చాలి. ముందుగా యక్షుణ్ని రక్షించాల్సి ఉంది. అలాగే మా దత్తకుడికి కాబోయే ఇల్లాలిని, నేను పెళ్లాడాలనుకున్న అమ్మాయిని వెంటపెట్టుకుని, ఈ నగరానికి వచ్చాను. వాళ్లిద్దరూ ఏమయ్యారో కూడా తెలియరావడం లేదు. దీనిని మీరే కనిపెట్టాలి" అని వేడుకున్నాడు. తరువాతి విన్నపం గోనర్దీయుడు వినిపించాడు. "ప్రభూ! మీకు మార్గమధ్యంలో సాయం చేసిన ఘోటకముఖుడు మా మిత్రుడే. అతను ఏమయ్యాడో తెలియకుండా ఉంది. అతణ్ని కూడా మీరు రక్షించాలి. భైరవుణ్ని పట్టుకుని, యక్షుడేమయ్యాడో ఆరాతీస్తే తప్ప అసలు విషయం బయటపడదు!"...వారి విన్నపాలు విన్న తరువాత భోజమహారాజు.. "ఇదంతా తేలికగా జరిగే వ్యవహారం కాదు. మరో రెండుమూడు రోజులలో భైరవుడి ప్రదర్శన జరగనున్నది. ఆనాటికి వాడిపని చెబుతాం. అప్పటివరకు మీరు విశ్రాంతి తీసుకోండి" అని చెప్పి ఆనాటికి సభ చాలించాడు.

### మరునాడు పొద్దుటిపూట..

ఐదుగురు మిత్రులూ ఒక ఇంటి చావడిలో కూర్చుని ఉన్నారు. అక్కడికొక ఎడ్లబండి వచ్చి ఆగింది. దానిలోంచి ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు దిగారు. మిత్రులందరూ వెళ్లి ఆ వచ్చినవాణ్ని కౌగిలించుకున్నారు. అతనే ఘోటకముఖుడు. ఆ స్త్రీలు లోనికి వెళ్లారు. కుశల ప్రశ్నలు పూర్తయ్యాక ఘోటకముఖుడు తన కథనిలా చెప్పాడు. "ఆనాడు నేను భోజరాజుగారికి తన ఇల్లాలిని చెరబట్టినవాణ్ని చూపించడానికి ఏకశిలానగరం వెళుతుంటే, దారిమధ్యలో వాడే ఎదురుపడ్డాడు. భోజరాజుగారిని ఒక మేకగా మార్చివేశాడు. నా మీదికి కుక్కలను ఉసిగొల్పాడు. నేను వాటినుంచి తప్పించుకోవడానికి పరుగుపెట్టాను. కొంతదూరం నన్ను తరిమిన తరువాత ఆ కుక్కలు ఏమయ్యాయో తెలియదు. నేను మళ్లీ అడవి మధ్యలో దిక్కుతోచక నిలబడ్డాను. అటువంటి సమయంలో నాకొక ఆడగుర్రం కనిపించింది. నాకు గుర్రపు స్వారీ వచ్చు కనుక, నేను దానిపై ఎక్కి పశ్చిమోత్తర దిశగా వెళ్లడానికి ప్రయత్నించాను. కానీ దారితప్పాను. ఆ గుర్రం నన్ను అడవిలో ఒక విచిత్రమైన ప్రదేశానికి తీసుకుపోయింది. అక్కడొక కుటీరం కనిపించింది. అందులో మనుషులు ఉంటారని తలచి తలుపు తట్టాను. అది దగ్గరికి వేసి ఉంది. ఎవరి అలికిడి కనిపించలేదు. లోపలికి ప్రవేశించాను. స్వల్పంగా సామగ్రి ఉంది. తిన్నగా పెరటిలోకి పోయాను. అక్కడొక నుయ్యి ఉంది. నీళ్లు తోడుకుని, కడుపునిండా తాగాను. మళ్లీ లోపలికి వచ్చి పరిశీలించగా ఆ గుడిసెలో ఒక గదిమాత్రం తాళం వేసి ఉండటాన్ని గమనించాను. ఈవలికి వచ్చాను. నేను ఎక్కి వచ్చిన గుర్రం అక్కడే ఉంది. నేను దానికి కృతజ్ఞతా సూచకంగా మెడ నిమురుతూ లక్షణాలు పరిశీలించసాగాను. దాని మెడలో ఏదో తాయెత్తు కట్టి ఉండటం చూసి, దానిని లాగి వేశాను. నా కళ్లెదురుగానే ఆ గుర్రం ఒక వృద్ధ స్త్రీగా మారిపోయింది.

### నేను ఆశ్చర్యపడుతూ..

"అవ్వా! ఎవరు నువ్వు? ఎందుకిలా గుర్రంలా మారిపోయావు?" అని ప్రశ్నించాను. అప్పుడామె ఇలా చెప్పింది. "బాబూ! ఈ కుటీరం నాదే. మేము సారస్వత బ్రాహ్మణులం. నా భర్తతో కలిసి ఇక్కడ చాలాకాలం కాపురం చేశాను. నా పేరు రాధ. నా పుత్రిక పేరు మిత్రవింద. నా భర్త మరణానంతరం నేను ఆ బాలికను ప్రాణంలా చూసుకుంటూ వచ్చాను".

### అని అంతవరకూ చెప్పి..

"రా నాయనా! లోపలికి వెళదాం. నీకు వంట చేస్తాను. ఎన్నాళ్లయిందో కమ్మని భోజనం చేసి. ఈలోపుగా నువ్వు స్నానం చెయ్యి. భోజనం చేస్తుండగా మిగిలిన కథ చెబుతాను" అన్నది. నేను అలాగే చేశాను. ఆమె వంట చేస్తుండగా ఆమెతో కొంత సంభాషించాను. ఇందాకా తాళంపెట్టిన గదిలోంచి ఆమె కావాల్సిన వస్తువులన్నీ తీసుకువచ్చి.. అరగంట వ్యవధిలో అనేక రుచులతో భోజనం తయారుచేసింది. నాకు పెరటిలో భోజనం వడ్డించింది. కథ వినేటప్పుడు నా ఏకాగ్రతకు భంగం రాకుండా.. ఆమె వడ్డన చేసేటప్పుడు నా ఆకలికి ఏ మాత్రమూ అడ్డంకి లేకుండా తరువాతి కథ ఇలా చెప్పింది. "నా కూతురికి పన్నెండేళ్ల వయస్సున్నప్పుడు.. ఒకనాటి రాత్రి పెద్ద వర్షం పడే సూచనలు కనిపిస్తున్నాయి. మెరుపులు మెరుస్తున్నాయి. ఆ మెరుపుల వెలుగులో గుర్రమెక్కి ఒక రాజపురుషుడు మా తలుపు తట్టాడు. 'అమ్మా! ఈ రాత్రి మీ ఇంట ఉండవచ్చా? బయట చలితీవ్రత ఎక్కువగా ఉంది. వాన పడేలా ఉంది' అని కోరాడు. నేను అంగీకరించి లోనికి ఆహ్వానించాను. అతనికి వంటచేసి పెట్టాను. నిద్రించడానికి మంచమిచ్చాను.

### తెల్లవారిన తరువాత అరుగుమీద కూర్చుని..

'అమ్మా! నిన్ను మరువను. నువ్వు ఒంటరిగా ఈ అరణ్యంలో ఉండటానికి కారణం ఏమిటి? నీకు పిల్లలెందరు?' అని ప్రశ్నించాడు. అప్పుడు నా కూతురిని లోపలినుంచి పిలిచాను. కొద్దిసేపు దాని అందాన్ని చూసి, అతను మైమరిచిపోయినట్లు కనిపించాడు. 'ఉన్న ఊరు, కన్నతల్లి ఒక్కలాంటివి అని చెబుతారు కదా బాబూ! అయినా మాకిక్కడ ఏ లోటూ లేదు. మాకు చాలా పశువులున్నాయి. కావాల్సినంత పచ్చిక ఉంది. మాకు సరిపడేంత ధాన్యం ఫలిస్తుంది. ఇంక ఇది నా కూతురు.. పేరు మిత్రవింద. దీనికి త్వరలో పెళ్లిచేయాలి' అని చెప్పాను. ఇంతలో గుర్రాలమీద పలువురు రాజభటులు వచ్చారు. 'జయము జయము మహారాజా!' అని అతనికి వందనం చేశారు. అప్పుడు విచారించగా ఆయన వరాహ ద్వీపాధిపతి అని తెలిసింది. అతను తన పరివారం వెనుక వెళ్లడానికి ఇష్టంలేక నాలుగురోజులపాటు ఇక్కడే ఉండిపోయాడు. ఐదోరోజున నా కూతురిని గాంధర్వవిధిని వివాహమాడాడు. నన్నుకూడా తనతోపాటు తమ ద్వీపానికి రమ్మని కోరాడు. కానీ నేను అంగీకరించలేదు. అప్పుడతను.. 'ఏ అవసరం వచ్చినా మమ్మల్ని మరిచిపోవద్దు' అని చెప్పి నా కూతురిని తీసుకుని వెళ్లిపోయాడు. అప్పటినుంచి ఒంటరిగానే ఉంటున్నాను. ఒకనాడు ఇక్కడికో తాంత్రికుడు వచ్చాడు. అతని దగ్గర చాలా పశువులున్నాయి. వాటితోపాటు క్రూరమృగాలు ఉన్నాయి. నేనతనికి అడ్డం వెళ్లాను. 'బాబూ! నీ మృగాలు మా పశువులను బెదిరిస్తున్నాయి. కాస్త దూరంగా తోలుకువెళ్లు' అని కోరాను.

### అందుకతడు కన్నెర్ర చేస్తూ..

'ఈ అడవిపై నాకు అధికారం ఉంది. నా ఇష్టం వచ్చినచోట నా మృగాలను తిప్పుకొంటాను' అన్నాడు. 'ఈ అడవిపై నీకు అధికారం ఉందని నువ్వు చెబితే.. నీ పశువులపై, మృగాలపై నాకు అధికారం ఉందని నేను చెబితే నీకు కోపం వస్తుందేమో! భగవంతుడి సృష్టి అందరికీ సమానం కదా!' అని నేను చెప్పేసరికి అతనికి పెద్ద కోపం వచ్చింది. నా నెత్తిపై ఏదో పసరుపూసి నన్నొక గుర్రంగా చేశాడు. ఆ తరువాత జరిగినవన్నీ స్వప్నప్రాయంగా ఉన్నాయి. ఇంతకాలానికి నువ్వు నాకు శాపవిమోచనం కలిగించావు. నా ఇంటికి మళ్లీ నేను నేనుగా తిరిగివచ్చాను. నీకు ఏం కోరినా ఇవ్వాలని ఉంది".. అని ముసలమ్మ పలికిన మాటలు విని నాకు ఆశ్చర్యం కలిగించాయి. "అవ్వా! పేదదానివి. ఈ కీకారణ్యంలో ఉన్నదానివి. నువ్వు నాకేం ఇవ్వగలవు?" అని అడిగాను.

### అందుకామె..

"బాబూ! నా దగ్గర కుబేరుని వద్దకూడా లేని ధనరాశులు ఉన్నాయి. ఇందాక మా కొట్టుగదిలోంచి వంటసామాన్లు తీసుకొచ్చాను కదా.. అలాగే నువ్వేం కోరినా తేగలను!" అని చెప్పింది. నాకు ఆశ్చర్యం వేసింది. "అవ్వా! ఈ సంగతి మరెవ్వరికీ చెప్పబోకు. నిన్ను దోచుకోగలరు" అన్నాను. "బాబూ! నువ్వు ప్రాణదాతవు కనుక నీకు, అల్లుడు కనుక ఆ మహారాజుకు చెప్పాను. ఈ సంగతులు నా కూతురికి కూడా సరిగా తెలియవు" అన్నది అవ్వ. ఘోటకముఖుడు తన కథను ఇంకా కొనసాగించాడు.

## ఈ ఆహారాలను రోజూ తింటే చాలు
# మీ ఎముకలు ఉక్కులా మారుతాయి

పూర్వం మన పెద్దలు క్యాల్షియం సమృద్ధిగా ఉండే ఆహారాలను తినేవారు. అందుకనే వారు వయస్సు మీద పడినప్పటికీ దృఢంగా ఉండేవారు. ఎంతో కష్టమైన పనులను సైతం వృద్ధాప్యంలో అవలీలగా చేసేవారు. అయితే శారీరకంగా దృఢంగా ఉండేందుకు కావల్సిన మినరల్స్‌లో క్యాల్షియం కూడా ఒకటి. ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచడంలో క్యాల్షియం ఎంతో ముఖ్య పాత్రను పోషిస్తుంది. కనుక క్యాల్షియం ఉండే ఆహారాలను మనం రోజూ తీసుకోవాలి. ఈ ఆహారాల వల్ల మనకు ఇతర ప్రయోజనాలు కూడా కలుగుతాయి. క్యాల్షియం ఉండే ఆహారాలను రోజూ తీసుకోవడంతోపాటు విటమిన్ డి కూడా అందేలా చూసుకోవాలి. దీంతో మన శరీరం క్యాల్షియంను సులభంగా శోషించుకుంటుంది. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి.

### అంజీర్ పండ్లు..

క్యాల్షియం సమృద్ధిగా ఉండే ఆహారాల్లో అంజీర్ పండ్లు కూడా ఒకటి. ఇవి మనకు మార్కెట్‌లో డ్రై ఫ్రూట్స్ రూపంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయి. అంజీర్ పండ్లను రోజూ రాత్రి పూట నానబెట్టి మరుసటి రోజు ఉదయం తినాలి. రోజుకు ఒక కప్పు అంజీర్ పండ్లను తింటే సుమారుగా 121 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం పొందవచ్చు. అలాగే ఈ పండ్లలో ఉండే పొటాషియం హైబీపీని నియంత్రిస్తుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. అంజీర్ పండ్లలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది అధిక బరువును తగ్గించడంతోపాటు జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్దకాన్ని తగ్గిస్తుంది. అంజీర్ పండ్లలో ఉండే ఐరన్ రక్తం తయారయ్యేలా చేస్తుంది. దీంతో రక్తహీనత నుంచ బయట పడవచ్చు.

### నారింజ పండ్లు..

ఒక పెద్ద నారింజ పండును తినడం వల్ల మనకు సుమారుగా 74 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంద. నారింజ పండ్లలో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. ఈ పండ్లను తినడం వల్ల విటమిన్ డి ని కూడా పొందవచ్చు. దీంతో శరీరం క్యాల్షియంను సులభంగా శోషించుకుంటుంది. అలాగే సార్డైన్ అనే చేపలను 120 గ్రాముల మేర తింటే దాదాపుగా 351 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. వీటి ద్వారా విటమిన్ బి12 ను కూడా పొందవచ్చు. ఇది మెదడు, నాడీ వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది.

### బెండకాయలు, బాదంపప్పు..

బెండకాయల్లోనూ క్యాల్షియం సమృద్ధిగానే ఉంటుంది. ఒక కప్పు బెండకాయలను తింటే సుమారుగా 82 మిల్లీగ్రాముల మేర క్యాల్షియంను పొందవచ్చు. అలాగే బెండకాయల ద్వారా మనకు విటమిన్ బి6, ఫోలేట్ లభిస్తాయి. ఆరోగ్యానికి బాదంపప్పు కూడా ఎంతగానో మేలు చేస్తుంది. రోజూ 30 గ్రాముల మేర బాదంపప్పును తింటే సుమారుగా 75 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. బాదంపప్పును రాత్రిపూట నీటిలో నానబెట్టి మరుసటి రోజు ఉదయం పొట్టు తీసి బ్రేక్‌ఫాస్ట్‌లో తినాలి. దీంతో క్యాల్షియంను సమృద్ధిగా పొందవచ్చు. ఇలా పలు రకాల ఆహారాలను తినడం వల్ల క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుంది. దీంతో ఎముకలు ఆరోగ్యంగా, దృఢంగా మారుతాయి.



# భయం భయంగా..భాన్‌గఢ్ చూసొద్దామా!



పగలంతా ఆ రాతికోట బంగారు వన్నెలో వెలిగిపోతూ దర్శనమిస్తుంది. చీకటి పడేకొద్దీ దడపుట్టిస్తుంది. లేని ధైర్యం కూడదీసుకున్నా.. అనుమానం పెనుభూతమై వెంటాడుతుంది. దీనికితోడు ఓ నవ్వు లీలగా పలకరిస్తుంది. పట్టించుకుంటే ఫర్వాలేదు! భ్రమ అనుకొని అక్కడే ఉండిపోతేనే సమస్య!! తొలుత వినసొంపుగా అనిపించిన నవ్వు.. అంతలోనే వికటాట్టహాసంగా మారిపోతుంది. ఆ భయహాసానికి మువ్వల సవ్వడి కోరస్ పాడుతుంది. చుట్టూ ఎవరూ ఉండరు.. చీకటి తప్ప! ఒళ్లు గగుర్పాటుకు గురిచేసే ఇలాంటి అనుభవం రాజస్థాన్‌లోని భాన్‌గఢ్ కోటకు వచ్చినవాళ్లకు తప్పకుండా కలుగుతుందని కొందరు చెబుతారు! దెయ్యాలు ఉన్నాయా? లేదా? ఎప్పటికీ తెమలని ప్రశ్న. ఉన్నాయని నమ్మేవారు వాటిని చూశామని బలంగా చెప్పలేరు! లేవని వాదించేవాళ్లు దెయ్యాల దిబ్బగా పేరున్న చోట్లకు నిర్భయంగా వెళ్లిన దాఖలాలూ తక్కువే! ఈ తర్కవితర్కాలు పక్కనపెడితే.. ప్రతికూల శక్తులకు నెలవుగా ఉన్న ప్రాంతాలు ఇప్పుడు పేరుమోసిన పర్యాటక కేంద్రాలుగా అలరారుతున్నాయి. అక్కడున్నది దెయ్యమా, మన భ్రమా పక్కనపెడితే.. అచ్చోటికి వెళ్లినవాళ్లకు హారర్ సినిమా ఒంటరిగా చూసిన అనుభూతి కలుగుతుంది. గుంపుగా వెళ్లినా.. దిక్కులు చూస్తూ, బిక్కుబిక్కుమంటూ కాలాన్ని భారంగా గడుపుతుంటారు. అలా ఉత్సాహంగా వెళ్లి, భయంగా కాలక్షేపం చేసే నెలవుల్లో భాన్‌గఢ్‌లోని రత్నావతి కోట ఒకటి. రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాలో ఉంటుంది భాన్‌గఢ్. పట్టపగలు వేలమంది మనసులు దోచుకునే భాన్‌గఢ్ అందాలు.. రాత్రయ్యిందంటే అంతమందినీ భయపెడుతుంటాయి. దీనికి నిదర్శనంగా కోట ప్రాంగణంలో పురావస్తుశాఖ ఏర్పాటు చేసిన సూచిక కనిపిస్తుంది. 'సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తర్వాత కోటలోకి ప్రవేశం నిషిద్ధం. అలా కాకుండా ఎవరైనా కోటలోకి ప్రవేశిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని ఆ ప్రకటన సారాంశం. 15వ శతాబ్దానికి చెందిన ఈ కోటలో.. రాజప్రాసాదాలు, ఆలయాలు, మండువా లోగిళ్లు, భారీ ద్వారాలు, ఈత కొలనులు, మంచినీళ్ల బావులు ఇలా ఎన్నో అద్భుతాలు దాగున్నాయి. వీటన్నిటినీ తేరిపారా చూసి సాయంత్రానికి పర్యాటకులు తిరుగు ప్రయాణం అవుతారు. అక్కడ ఉండటానికి మాత్రం నిబంధనలు ఒప్పుకోవు. అందుకు కారణం రత్నావతి నవ్వు అని చెబుతుంటారు స్థానికులు. మొఘల్ చక్రవర్తి అక్బర్ సేనాధిపతి మాన్‌సింగ్ సోదరుడు మాధోసింగ్ అధీనంలో ఉండేది భాన్‌గఢ్ కోట. మొఘలుల ప్రాభవం తగ్గాక భాన్‌గఢ్ కోటపై శత్రురాజుల కన్నుపడింది. అదే కోటలో రత్నావతి అనే అపురూప సౌందర్యరాశి ఉండేది. ఒకసారి భాన్‌గఢ్‌కు వచ్చిన ఓ మాంత్రికుడు అనుకోకుండా రత్నావతిని చూశాడట. ఆమె అందానికి పరవశుడై, రత్నావతిని తన వశం చేసుకోవాలని అనుకుంటాడు. ఇందుకోసం మంత్రించిన అత్తరును ఆమెపై చల్లాలని భావిస్తాడు. అది గ్రహించిన రత్నావతి ఆ అత్తరు సీసాను బండకేసి బాదడంతో.. బండ పగిలి రాళ్లన్నీ మాంత్రికుడిపై పడ్డాయట. తీవ్ర గాయాలపాలైన ఆ మాంత్రికుడు.. రత్నావతి తనను తిరస్కరించిందన్న అక్కసుతో 'ఈ కోట నాశనమవుతుంది' అని శపించి కన్నుమూశాడు. ఈ సంఘటన జరిగిన ఏడాదిలోనే అజబ్‌గఢ్ రాజు భాన్‌గఢ్‌పైకి దండెత్తి వచ్చాడు. కోటను స్వాధీనం చేసుకున్నాడు. శత్రువులకు చిక్కితే మానప్రాణాలు దక్కవని భావించిన రత్నావతి, కోటలోని మహిళలతో కలిసి ఆత్మాహుతి చేసుకుందట. నాటి నుంచి ఆ కోట నిర్మానుష్యంగా మారిపోయింది. బలవన్మరణానికి పాల్పడిన రత్నావతి సహా మిగిలిన మహిళలంతా ఆత్మలుగా ఆ కోటలోనే నేటికీ సంచరిస్తున్నారని స్థానికుల మాట! ఇప్పటికీ రాత్రిపూట ఆ కోటలో వింత శబ్దాలు, నవ్వులు వినిపిస్తాయని నమ్మకంగా చెబుతారు. ఐదు దశాబ్దాల కిందట రాత్రిపూట కోటలోకి కొందరు ప్రవేశించారనీ, తర్వాత కొన్నాళ్లకు వాళ్లంతా రకరకాల కారణాలతో మృత్యువాతపడ్డారని అంటుంటారు! ఇందులో నిజమెంతో ఆ రత్నావతికే తెలియాలి!! ఈ చరిత్రంతా పక్కనపెడితే.. రాజస్థాన్ పర్యాటక సిగలో భాన్‌గఢ్ వజ్రపు తునకలా మెరిసిపోతుంటుంది. రోజూ వందలమంది పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. వారాంతాల్లో ఈ సంఖ్య వేలు దాటుతుంది. పొద్దంతా కోటలో దర్జాగా విహరిస్తారు. సాయంత్రాలు.. హోటల్ గది నుంచి కోటవైపు భయం భయంగా చూస్తుంటారు. ఆ క్షణం వాళ్ల మనసులో కలిగిన భావాలను చిలువలు పలువలు చేసి తమవారితో కథలుగా పంచుకుంటారు. ఇంతకీ ఈ భయం గొలిపే పర్యాటక కేంద్రం భాన్‌గఢ్‌కు ఎలా వెళ్లాలనే కదా! ఈ కోట రాజస్థాన్ రాజధాని జైపూర్ నుంచి 65 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. బస్సులు, ట్యాక్సీల్లో వెళ్లొచ్చు. డిసెంబర్‌లో భాన్‌గఢ్ విహారం పసందుగా ఉంటుంది!

### తీవ్ర గాయాలపాలైన ఆ మాంత్రికుడు..

రత్నావతి తనను తిరస్కరించిందన్న అక్కసుతో 'ఈ కోట నాశనమవుతుంది' అని శపించి కన్నుమూశాడు. ఈ సంఘటన జరిగిన ఏడాదిలోనే అజబ్‌గఢ్ రాజు భాన్‌గఢ్‌పైకి దండెత్తి వచ్చాడు. కోటను స్వాధీనం చేసుకున్నాడు. శత్రువులకు చిక్కితే మానప్రాణాలు దక్కవని భావించిన రత్నావతి, కోటలోని మహిళలతో కలిసి ఆత్మాహుతి చేసుకుందట.

# అవిశ్వాస తీర్మానంలో ఓడిన ఫ్రాన్స్ ప్రధాని వ్యతిరేకంగా 331 మంది ఓటేశారు

పారిస్: ఫ్రాన్స్ ప్రధాని మైఖేల్ బార్నియర్ కు చుక్కెదురైంది. జాతీయ పార్లమెంట్‌లో జరిగిన అవిశ్వాస తీర్మానంలో ఆయన ఓడిపోయారు. దీంతో ఆయన ప్రభుత్వం కూలిపోయింది. అతివాద, వామపక్ష నేతలందరూ బార్నియర్‌కు వ్యతిరేకంగా ఓటేశారు. బడ్జెట్ కేటాయింపులపై మొదలైన రగడ.. ప్రధాని పీఠానికే ఎసరుపెట్టింది. సోషల్ సెక్యూర్టీ బడ్జెట్ ప్లాన్ నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 49.3 ద్వారా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అవిశ్వాసంలో ఓడిన ప్రధాని బార్నియర్.. ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని నడపనున్నారు. మాజీ ప్రధాని గాబ్రియల్ అటల్ కూడా ఇలాగే తమ ప్రభుత్వాన్ని నడిపిన విషయం తెలిసిందే. ఆపద్ధర్మ ప్రభుత్వం కొత్త చట్టాలను రూపొందించే వీలు ఉండదు. అయితే అధ్యక్షుడు మాక్రన్ కొత్త ప్రధానిని నామినేట్ చేసే అవకాశాలు ఉన్నాయి. దానికి మాత్రం ప్రత్యేకమైన డెడ్‌లైన్ ఏదీ లేదు. 24 గంటల్లో దీనిపై నిర్ణయం తీసుకోనున్నట్లు అధ్యక్షుడు మాక్రన్ తెలిపారు. ప్రస్తుత పార్లమెంట్‌లో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ లేని కారణంగా.. కొత్త ప్రధాని ఎన్నిక సంక్లిష్టంగానే మారనున్నది. కొత్త ప్రధాని ఎవరు అవుతారన్న దానిపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత సైనిక శాఖ మంత్రి సెబాస్టియన్ లెకోర్న్ పేరు వినిపిస్తున్నది. సెంట్రిస్టు మోడెమ్ పార్టీ నేత ఫ్రాంకోయిస్ బేరౌ పేరు కూడా ప్రస్తావనలో ఉన్నది. వామపక్ష ఎన్ఎఫ్‌పీ కూటమి మాత్రం ఆర్థికవేత్త లూసి కాస్టెట్స్ పేరును ప్రస్తావిస్తున్నది. దేశాన్ని పాలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇటీవల కాస్టెట్స్ పేర్కొన్నారు.



## స్త్రీ శరీరాలను తినే ఆదివాసులు తినకుండా మిగిలిపోయే అవయవం



చనిపోయిన తమ బంధువుల మృతదేహాలను తినే అలవాటు ఉన్న ఓ తెగ గురించి ఆసక్తికరమైన సమాచారం వెల్లడైంది. పండ్ల చెట్ల మధ్య ఒక వ్యాధి వ్యాపిస్తుంది. 1950వ దశకంలో, పాపువా న్యూ గినియాలోని ఒకపా ప్రాంతంలో నివసిస్తున్న ఫోర్ గిరిజన మహిళల్లో నాడీ వ్యవస్థ వ్యాధి కురు విస్తృతంగా వ్యాపించింది. ఈ వ్యాధిపై అధ్యయనం చేసేందుకు వెళ్లిన షిర్లీ లిండెన్‌బామ్ అనే పరిశోధకుడు.. చనిపోయిన వారి మృతదేహాలను ఏం చేశారని గిరిజనులను అడిగారు. దానికి వారు చనిపోయిన వారి మృతదేహాలను మేమే తింటామని చెప్పారు. చనిపోయిన వారి స్త్రీ బంధువుల మృతదేహాలను తినడం ముందరి గిరిజన స్త్రీలలో చనిపోయినవారిని గౌరవించే చర్యగా పరిగణించబడుతుంది. మగవాళ్ళు మనుషులను తినరు! ఈ ఫోర్ మహిళలు గాల్ బ్లాడర్ మినహా మిగిలిన అన్ని అవయవాలను తింటారు. పిత్తాశయం చాలా చేదుగా ఉంటుంది కాబట్టి, వారు దానిని వదిలివేస్తారు. ఈ విధంగా, పరిశోధకుడు షిర్లీ లిండెన్‌బామ్, కురు అనే నాడీ వ్యవస్థ వ్యాధి, చనిపోయినవారిలో కొంతమంది సోకిన మెదడులను తినడం ద్వారా ఫోర్ ప్రజలకు వ్యాపిస్తుందని కనుగొన్నారు. కానీ తోటి మనుషులను తినే ఈ ఆనవాయితీకి 1960ల్లోనే స్వస్తి పలకడం గమనార్హం.

## భూమి లోపల బయటపడ్డ 4 వేల ఏళ్ల నాటి రహస్యం...!


గ్రీస్‌లోని ఓ దీవిలో విమానాశ్రయానికి సన్నాహాలు జరుగుతున్నాయి. పునాది కోసం భూమిని తవ్వగా, భూగర్భంలో ఉన్న వింత నిర్మాణాన్ని చూసి ఒక్కసారిగా షాక్ తిన్నారు. ఈ కట్టడాన్ని పరిశోధించగా అది 4వేల సంవత్సరాల నాటి కట్టడమని తేలింది. ఇది ప్రాచీన గ్రీకు నాగరికత రహస్యాలను ఛేదిస్తుందని పరిశోధకులు ఆశిస్తున్నప్పటికీ, అది దేనికి వినియో గించారనే దానిపై వారు అయో మయంలో ఉన్నారు. జెయింట్ వీల్ లాగా కనిపించే ఈ నిర్మాణం క్రీస్తుపూర్వం 1700,2000,మధ్య ఉపయోగించబడిన మినోవాన్ నాగరికత నాటిదని పరిశోధకులు భావిస్తున్నారు. ఎందుకంటే క్రీట్‌లోని స్మారక రాజభవనం కూడా



అదే కాలంలో నిర్మించబడింది. అందువల్ల, మినోవాన్ నాగరికతతో సంబంధం ఉన్న గతంలో కనుగొనబడిన నిర్మాణాల మాదిరిగానే ఈ నిర్మాణం యొక్క పనితీరు ఏమిటో శాస్త్రవేత్తలు పరిశోధన కొనసాగిస్తున్నారు. పెద్ద చక్రంలా కనిపించే ఈ నిర్మాణం మొత్తం 19,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. గ్రీక్ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రకారం, నిర్మాణం 157 అడుగుల వ్యాసం మరియు మినోవాన్ సమాధులను పోలి ఉంటుంది. ఎందుకంటే ఇటీవల కనుగొనబడిన ఈ నిర్మాణం దగ్గర పురాతన జంతువుల ఎముకలు మరియు అవశేషాలు కనుగొనబడ్డాయి. అందువల్ల, పురాతన కాలంలో ఈ ప్రదేశంలో వివిధ ఆచారాలు నిర్వహించబడతాయని నమ్ముతారు. అందువల్ల ప్రస్తుతం పురావస్తు శాఖ అధికారులు పరిశోధనలు ప్రారంభించడంతో విమానాశ్రయం పనులు నిలిచిపోయే అవకాశం ఉందని చెబుతున్నారు.

## రోబో' ఆత్మహత్య.. యావత్ ప్రపంచం నివ్వెరపోయే న్యూస్

హైదరాబాద్ : జీవితంలో కష్టాలను ఎదుర్కోలేక కొందరు మనుషులు ఆత్మహత్య హత్యలు చేసు



కుంటారని తెలుసు.. కానీ మర మనిషి 'ఆత్మహత్య' చేసుకోవడం గురించి మీరెప్పుడైనా విన్నారా? ఇదేం విచిత్రం అని ఆశ్చర్యపోతున్నారా? మీరే కాదు.. యావత్ ప్రపంచమే నివ్వెరపోతోంది. ప్రపంచంలోనే తొలిసారిగా దక్షిణ కొరియాలో ఒక రోబో ఇటీవల 'ఆత్మహత్య' చేసుకుంది. గుమీ నగరంలోని సిటీ హాల్ ఆఫీసులో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న ఒక రోబో ఉద్దేశ పూర్వకంగానే రెండు మీటర్ల పొడవున్న మెట్ల మీద నుంచి దూకింది. ఏమాత్రం కదలికలు లేని స్థితిలో దాన్ని గుర్తించారు. తనను తాను అంతం చేసుకొనే ముందు రోబో విచిత్రంగా ప్రవర్తించిందని.. ఒకేచోట అదేపనిగా గుండ్రంగా తిరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అధిక పనిభారం లేదా యంత్రంలో సాంకేతిక లోపం వల్ల ఇలా జరిగి ఉండొచ్చని నిపుణులు అను మానిస్తున్నారు. ఈ ఘటనను దేశంలోనే తొలి రోబో ఆత్మహత్యగా స్థానిక మీడియాతోపాటు నెటిజన్లు అభివర్ణిస్తున్నారు. అయితే ఈ ఘటనను 'ఆత్మహత్య'గా పేర్కొనడం నమ్మశక్యంగా అనిపించడం లేదు. ఎందుకంటే.. రోబోలు భావోద్వేగాలకు గురయ్యే లేదా తనను తాను అంతం చేసుకొనే సామర్థ్యం ఉండనందున ఇది ఎలా జరిగి ఉండొచ్చన్న ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రోబో కదలికలకు దోహదపడే నేవిగేషన్ లో లోపాలు, సెన్సార్ల వైఫల్యం, ప్రోగ్రామింగ్ లో బగ్ వల్ల రోబో ఇలా విచిత్రంగా ప్రవర్తించి ఉండొచ్చన్న చర్చ నడుస్తోంది.

## డీఎడ్ అభ్యర్థులకే ఎస్జీటీ పోస్టులు

**నోటిఫికేషన్ జారీ.. ఆగస్టు 5 నుంచి 20 వరకు పరీక్షలు.. 30న ఫలితాలు**

అమరావతి: సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులను డీఈడీ అభ్యర్థులకే ఇవ్వాలని ప్రభుత్వం



నిర్ణయించింది. సోమవారం జారీచేసిన టెట్ నోటిఫికేషన్‌లో ఈ విషయాన్ని స్పష్టంచేసింది. గత ప్రభుత్వం ఎస్జీటీ పోస్టులకు అర్హత విషయంలో పదే పదే నిర్ణయాన్ని మార్చుకుంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బీఈడీ చదివిన వారు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో స్పష్టంచేసింది. ఈనెల 3 నుంచి 16 వరకు ఫీజు చెల్లించే గడువుగా పేర్కొంది. 4 నుంచి 17లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని, 16 నుంచి ఆర్‌లైన్‌లో మాక్ టెస్ట్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపింది. 25 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పరీక్షలు ఆగస్టు 5 నుంచి 20వ తేదీ వరకు రోజూ రెండు సెషన్లలో జరుగుతాయని పేర్కొంది. ఒక్కో కేటగిరీ పరీక్షలు ముగిసిన తర్వాత 10 నుంచి ప్రాథమిక కీ విడుదలవుతుందని, 11 నుంచి 21 వరకు అభ్యర్థులు అభ్యంతరాలు తెలపవచ్చని వివరించింది. 25న తుది కీ విడుదల చేసి, 30న ఫలితాలు విడుదల చేస్తామని నోటిఫికేషన్‌లో స్పష్టంచేసింది. తాజా నిర్ణయం ప్రకారం ఎస్జీటీ పోస్టులకు పరీక్షలు జరిగే పేపర్-1ఏకు డీఈడీ అర్హత కలిగినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

# భూభ్రమణంలో మార్పులా..

భూమి నాలుగు పొరలను కలిగి ఉంటుంది. వాటిలో ఇన్నర్ కోర్ (లోపలి పొర) ఘన రూపంలో ఉండి ఇనుము, నికెల్ మూలకాలతో ఏర్పడింది. ఇది భూమికి కేంద్రభాగమని చెప్పవచ్చు. 2010లో ఈ కోర్ భ్రమణం తగ్గుతుందని గమనించారు శాస్త్రవేత్తలు. భూమి ఉపరితలంతో పోలిస్తే, లోపలిపొర భ్రమణం క్రమేపీ మందగిస్తున్నట్లు ఇటీవల పరిశోధనల నివేదిక శాస్త్రవేత్తలు. 'ఇది స్పష్టమైన రుజువు' అంటున్నారు ఎర్త్ సైన్సెస్ ప్రొఫెసర్ మిస్టర్ విడేల్. ఈయన యూనివర్శిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా డోర్న్‌సైఫ్ కాలేజ్ ఆఫ్ లెటర్స్, ఆర్ట్స్ అండ్ సైన్సెస్ డీన్ కూడా. భూమి అనేది డైనమిక్ గ్రహం. ఇది ఉనికిలోకి వచ్చినప్పటి నుండి నిరంతరం మార్పులకు లోనవుతూనే ఉంది. భూమి లోపల శక్తివంతమైన ఉష్ణప్రసరణ కణాలుంటాయి. వీటి చలనంలోని హెచ్చుతగ్గుల వలనే భూకంపాలు రావడం, అగ్నిపర్వతాలు పేలి పర్వత శ్రేణులు ఏర్పడటం సంభవిస్తున్నాయి. మన చుట్టూ ఉండే గాలి (వాతావరణం), నీరు (జలాశయాలు), భూమి, జీవులు.. భూవ్యవస్థ కింది ఉపవ్యవస్థలు. ఇవన్నీ పరస్పర సంబంధాన్ని కలిగి ఉంటాయి.



### లోపలి కోర్....

భూమి లోపలిపొర భూఉపరితలం నుండి 4,800 కిలోమీటర్లు లోపలికి ఉంటుంది. ఇది దాదాపు చంద్రుని పరిమాణంలో ఉంటుంది. అంటే భూమి కంటె ఒకశాతం కన్నా తక్కువ పరిమాణం. అయినా మొత్తం అయస్కాంత క్షేత్ర శక్తిలో పది శాతం ఈ ఇన్నర్‌కోర్‌నే ఆవరించి ఉంటుంది. ఈ అయస్కాంత క్షేత్రమే జీవి మనుగడకు కీలకం. లోపలి కోర్ వెలుపలి భాగంమాత్రం ఇనుము, నికెల్ పదార్థంతో ఉంటుంది. ఇది 2,200 కిమీ మందం, అధిక ఉష్ణోగ్రతను కలిగిన కణ నిర్మితం. ఈ కణాల కదలిక అయస్కాంత క్షేత్రాన్ని సృష్టిస్తుంది. అయస్కాంత క్షేత్రం భూమి వాతావరణం చుట్టూ విస్తరించి ఉంటుంది. ఈ క్షేత్రం కింద ఉండే ద్రవ ప్రవాహం భూ భ్రమణాన్ని సమన్వయ పరుస్తుంది. భూమి లోపలి పొరల నుండి ఉపరితలానికి పయనించే అయస్కాంత తరంగాలు అంతరిక్ష వికిరణానికి లోనుకాకుండా భూమిని రక్షిస్తాయి.

భూమి లోపలి కోర్, భూ ఉపరితలం కంటే చాలా నెమ్మదిగా తిరుగుతున్నట్లు ఇటీవల అధ్యయనంలో శాస్త్రవేత్తలు గుర్తించారు. లోపలికోర్ భ్రమణవేగం తగ్గటం 2010 నుంచి ప్రారంభమైందని.. 1991-2023 సంవత్సరాల మధ్య దక్షిణ అట్లాంటిక్‌లోని దక్షిణ శాండ్‌విచ్ దీవుల్లో జరిగిన అధ్యయనంలో ఈ విషయం రుజువైందంటారు జాన్ విడేల్, అతని బృందం.

ఆయా పునరావృత భూకంపాల నుండి 121 రీడింగ్ నమూనాలను సేకరించారు. అంతేకాక 1971-1974 మధ్య నిర్వహించిన సోవియట్ అణు పరీక్షల డేటా, ఫ్రెంచ్, అమెరికన్ అణు పరీక్షల డేటాలను కూడా ఈ అధ్యయనంలో పరీక్షించారు. ఈ మార్పును భూకంపాలు, అణు పరీక్షల ద్వారా ఉత్పన్నమయ్యే భూకంప తరంగాలపై అధ్యయనాలు జరిపి నిర్ధారించారు.

### ఇలా నమ్మాల్సివచ్చింది..

'ఈ మార్పును సూచించే సీస్మోగ్రామ్ (భూమి కదలికలను రికార్డుచేసి చూపించే పరికరం)ను మొదటిసారి చూసినప్పుడు మేము స్టన్ అయ్యాం. దానిపై అనేక పరీక్షలు జరిపినప్పటికీ అదే నమూనాను పదేపదే సూచించడం.. 'ఇదే స్పష్టమైన నిర్ధారణగా నమ్మాం' అంటారు ప్రొఫెసర్ విడేల్. అంతర్గత కోర్ భ్రమణం 2009లో దాదాపుగా ఆగిపోయి, తర్వాత వ్యతిరేక దిశలో తిరగటం ప్రారంభించిందని చైనాలో పెకింగ్ యూనివర్శిటీకి చెందిన జియాడాంగ్ సాంగ్, యి యాంగ్‌ల నివేదిక. 'భూమి యొక్క ఉపరితలానికి సంబంధించి, లోపలి కోర్ ఒక స్వింగ్ లాగా ముందుకు వెనుకకు తిరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

### ఈ పరిస్థితుల వలన...


పగలు, రాత్రుల నిడివి ఒక్కొక్కటి ఆరు నెలల వరకు పెరుగుతుంది. వాతావరణంలో అనేక మార్పులు వస్తాయి. గాలి, సముద్ర ప్రవాహాలు భూ భ్రమణం మీదే ఆధారపడి ఉంటాయి. భూ అయస్కాంత క్షేత్రంలో మార్పులు.సంభవిస్తాయి. భూమి గురుత్వా కర్షణ శక్తి తగ్గటం.. రోజుకు 24 గంటల కాలగమనంలో మార్పు రావటం.. ఈ రెండింటిపై లోపలిపొర భ్రమణ వేగంలో వచ్చిన ఈమార్పు గణనీయమైన ప్రభావం చూపుతుందంటున్నారు పరిశోధకులు.

## తక్కువ ధరలో 5జీ ఫోన్ ... అయితే దీనిపై ఓ లుక్కేయాల్సిందే..!



ప్రస్తుతం 5జీ స్మార్ట్‌ఫోన్‌లకు డిమాండ్ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా 5జీ సేవలు విస్తరిస్తున్న నేపథ్యంలో చాలా మంది 5జీ ఫోన్‌లను షిఫ్ట్ అవుతున్నారు. కంపెనీలు సైతం మార్కెట్లోకి 5జీ ఫోన్‌లను పెద్ద ఎత్తున తీసుకొస్తున్నాయి. అయితే మొదట్లో భారీగా ఉన్న 5జీ ఫోన్‌ల ధరలు ప్రస్తుతం తగ్గుముఖం పడుతున్నాయి. మరీ ముఖ్యంగా రూ. 10వేల బడ్జెట్‌లోనే 5జీ ఫోన్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే తక్కువ బడ్జెట్ అని ఫీచర్ల విషయంలో ఎలాంటి కాంప్రమైజ్ అవ్వట్లేదు కంపెనీలు. ఇందులో భాగంగానే చైనాకు చెందిన స్మార్ట్ ఫోన్ దిగ్గజం పోకో మార్కెట్లోకి బడ్జెట్ ఫోన్‌ను గతేడాది తీసుకొచ్చింది. దీనిపేరే పోకో ఎమ్6 ప్రో 5జీ. అత్యంత తక్కువ బడ్జెట్‌లో తీసుకొచ్చిన ఈ ఫోన్‌కు మంచి ఆదరణ లభించింది. మరి మీరు కూడా తక్కువ బడ్జెట్‌లో 5జీ ఫోన్ సొంతం చేసుకోవాలనుకుంటే. ఈ ఫోన్ బెస్ట్ ఆప్షన్‌గా చెప్పొచ్చు. మరి పోకో ఎమ్6 ప్రో 5జీలో ఎలాంటి ఫీచర్లు ఉన్నాయి.? దీని ధర ఎంతో ఇప్పుడు తెలుసుకుందాం.. పోకో ఎమ్6 ప్రో 5జీ ఫోన్ అసలు ధర రూ. 16,999గా ఉండగా అమెజాన్‌లో 41 శాతం డిస్కౌంట్‌తో రూ. 9,999కి లభిస్తోంది. దీంతో పాటు రూ. 250 కూపన్ కూడా డిస్కౌంట్ లభిస్తోంది. ఈ ఫోన్‌ను రూ. 485 ప్రారంభ ఈఎమ్ఐతో సొంతం చేసుకోవచ్చు. ఇక ఈ ఫోన్ ఫీచర్ల విషయానికొస్తే 6 జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజ్ వేరియంట్‌తో తీసుకొచ్చారు. ఆండ్రాయిడ్ 13 ఆపరేటింగ్ సిస్టమ్‌తో ఈ ఫోన్ పనిచేస్తుంది. తక్కువ బడ్జెట్‌లో స్నాప్‌డ్రాగన్ 4 జెన్ 2 ప్రాసెసర్‌ను అందించారు. ఇక ఈ స్మార్ట్ ఫోన్‌లో 6.79 ఇంచెస్‌తో కూడిన ఫుల్‌హెచ్‌డీం స్క్రీన్‌ను తీసుకొచ్చారు. 90 హెజ్‌జెడ్ రిఫ్రెష్ రేట్ ఈ స్క్రీన్ సొంతం. గొరిల్లా గ్లాస్ 3 లేయర్ స్క్రీన్ ప్రొటెక్షన్‌ను అందించారు. ఓటీటీ కంటెంట్‌ను హెచ్‌డ్ క్వాలిటీలో వీక్షించే అవకాశం కల్పించారు. ఇక కెమెరా విషయానికొస్తే 50 మెగాపిక్సెల్స్‌తో కూడిన రెయిర్ కెమెరాను అందించారు. అలాగే 8 మెగాపిక్సెల్స్ హెూల్ పంచ్ కట్‌అవుట్‌తో కూడిన ఫ్రంట్ కెమెరాను అందించారు.

## పెరిగిన రీఛార్జ్ ధరలు..!




జియో తన రీఛార్జ్ ధరలను అమాంతం పెంచేసింది. దీంతో ఎయిర్ టెల్, వొడాఫోన్ ఐడియా నెట్వర్క్ లు కూడా రీఛార్జ్ ప్లాన్ ధరలను పెంచేశాయి. దీంతో యూజర్లు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. అయితే మీకు ఇప్పుడు ఒక ఆప్షన్ ఉంది. పెరిగిన రీఛార్జ్ ధరల భారం మీ మీద పడ కూడదంటే కనుక మీరు వెంటనే ఈ పని చేయండి. జియో, ఎయిర్ టెల్ నెట్వర్క్ లు పెంచిన రీఛార్జ్ ప్లాన్స్ ని జూలై 3 నుంచి అమలు చేయనున్నాయి. ఇక వొడాఫోన్ ఐడియా జూన్ 4 నుంచి పెంచిన ధరలను అమలు చేయనుంది. అయితే ఈ నెట్వర్క్ సిమ్ లు వాడుతున్న వారు ఈ అధిక భారం నుంచి తప్పించుకోవచ్చు. ఎలా అంటే? ఉదాహరణకు మీరు జియో సిమ్ వాడుతున్నట్లైతే కనుక మీరు ఉన్న ప్లాన్ ని కాకుండా ఏడాది ప్లాన్ తో జూలై 3వ తేదీ లోపు రీఛార్జ్ చేయించుకోండి. అప్పుడు మీకు ఇప్పుడున్న ధరకే ఏడాది మొత్తం వర్తిస్తుంది. మీ పాత ప్లాన్ 28 రోజులకు రూ. 239 అయితే మీరు 13 నెలలు రీఛార్జ్ చేయించాల్సి ఉంటుంది. అప్పుడు 13 నెలలకు రూ. 3,107 రూపాయలు అవుతుంది. అదే ఏడాది పాటు రీఛార్జ్ చేయిస్తే రూ. 2,999 అవుతుంది. దీంతో మీకు రూ. 108 ఆదా అవుతుంది. ఈ 239 రూపాయల ప్లాన్ లో రోజుకు 1.5 జీబీ డేటా మాత్రమే వస్తుంటే ఏడాది ప్లాన్ లో రోజుకు 2.5 జీబీ డేటా వస్తుంది. అది కూడా 365 రోజులు వస్తుంది. ఇప్పుడే ఏడాది ప్లాన్ తో రీఛార్జ్ చేయించుకుంటే రూ. 2,999తో వదిలిపోతుంది. జూలై 3 నుంచి ఈ ప్లాన్ ధర రూ. 3,599 అయి పోతుంది. ఒకవేళ నెల ప్లాన్ వేయించుకోవాలి అని అనుకుంటే రూ. 239 రూపాయల ప్లాన్ జూలై 3 నుంచి రూ. 299 అవుతుంది. అప్పుడు 13 నెలలకు రూ. 3,887 అవుతుంది. ఇలా చూసినా గానీ మీకు నష్టమే. కాబట్టి జూలై 3వ తేదీ లోపు ఏడాది ప్లాన్ తో రీఛార్జ్ చేసుకుంటే కనుక ఎక్కువ డేటా వస్తుంది. పనిలో పనిగా 365 రోజులు వస్తుంది. డబ్బులు కూడా ఆదా అవుతాయి. నెల ప్లాన్ కంటే కూడా ఏడాది ప్లాన్ వేసుకుంటే గనుక మీరు ఈ ధరల పెంపు భారం నుంచి తప్పించుకోవచ్చు. వొడాఫోన్, ఎయిర్ టెల్ నెట్వర్క్ సిమ్ వాడేవారు కూడా ఇలా చేస్తే ప్రయోజనం పొందుతారు. ఒకవేళ మీ ప్లాన్ గడువు తేదీ ఇంకా అవ్వకపోతే గనుక లాభనష్టాలు భేరీజు వేసుకుని ఏడాది ప్లాన్ వేయించుకోండి.

## ఆ యాప్స్‌తో ఇక కరెంట్ బిల్లు కట్టలేరు..!

**ఆర్‌బిఐ ఆంక్షలు**

న్యూఢిల్లీ : చెల్లింపుల యాప్‌ల ద్వారా ఇకపై కరెంట్ బిల్లులను చెల్లించడానికి వీలుండదు. ఇప్పటికే క్రెడిట్ కార్డుల ద్వారా ప్రభుత్వ బిల్లు చెల్లింపులు కుదరవని చెప్పిన రిజర్వు బ్యాంక్, తాజాగా గూగుల్ పే, ఫోన్ పే, పేటియం తదితర యాప్స్ ద్వారా కూడా బిల్లులను అంగీకరించబోమని పేర్కొంది. కరెంటు బిల్లుల్ని తమ సంస్థ అధికారిక వెబ్‌సైట్ ద్వారా గాని, ఆయా కార్యాలయాలకు వెళ్లి గాని చెల్లించాలని ఆర్‌బిఐ స్పష్టం చేసింది.




## ప్రతిరోజు రాగి జావా తాగితే ఇన్ని ప్రయోజనాలా..!



కొద్దీ సంవత్సరాలుగా అనేక మంది సాంప్రదాయ కాఫీకి బదులుగా ఆరోగ్య ప్రయోజనాల ప్రత్యామ్నా యంగా రాగి జావా బాగా ప్రజాదరణ పొందింది. ఈ రాగి జావా గొప్ప రుచిని, రాగి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో మిళితం చేస్తుంది. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించే శక్తివంతమైన డ్రింక్ గా మారుతుంది. రాగి జావా మన ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరుస్తుందో ఓ సారి చూద్దాం.

### యాంటీ ఆక్సిడెంట్ గుణాలు......

రాగి జావాలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్ ను ఎదుర్కోవడంలో సహాయపడతాయి. ఫ్రీ రాడికల్స్ అనేవి అస్థిర అణువులు. ఇవి కణాలకు నష్టం కలిగిస్తాయి. అంతేకాకుండా క్యాన్సర్, గుండె జబ్బులు, వృద్ధాప్యంతో సహా శరీరం యొక్క సహజ ప్రతిస్పందన. కానీ., దీర్ఘకాలిక వాపు ఆర్థరైటిస్, డయాబెటిస్, గుండె జబ్బులు వంటి అనేక ఆరోగ్య సమస్యలకు ఇది దారితీస్తుంది. రాగి జావాలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి శరీరంలో మంటను తగ్గించడానికి, మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్స హించడానికి ఎంతగానో సహాయపడతాయి. రాగి జావాను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా.. మీరు తాపజనక పరిస్థితులను అభివృద్ధి చేసే ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

### మెదడు పనితీరు మెరుగుపడింది...

రాగి జావాలోని కెఫిన్ కంటెంట్ జ్ఞాపకశక్తి, దృష్టి, మానసిక స్థితితో సహా అభిజ్ఞా పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కెఫిన్ ఒక ఉద్దీపనకారిగా పనిచేస్తుంది. ఇది అప్రమత్తత, ఏకాగ్రతను పెంచుతుంది. రోజంతా దృష్టి కేంద్రీకరించడం,ఉత్పాదకతను సులభతరం చేస్తుంది. అదనంగా, రాగి జావాలోని యాంటీ ఆక్సిడెంట్లు మెదడును వయస్సు సంబంధిత క్షీణత నుండి రక్షించడంలో కూడా పాత్ర పోషిస్తాయి. ఇది అల్జీమర్స్ వంటి న్యూరో డెజెనరేటివ్ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

### రోగనిరోధక శక్తిని పెంచుతుంది...


రాగి ఒక ముఖ్యమైన ఆరోగ్యకరమైన ఖనిజం. ఇది రోగనిరోధక పనితీరులో కీలక పాత్ర పోషిస్తుంది. రాగి జావా తాగడం ద్వారా.. మీరు మీ శరీర రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇవ్వడానికి, అంటువ్యాధులు, అనారోగ్యాల నుండి మీ రక్షణను బలోపేతం చేయడానికి ఎంతగానో సహాయపడవచ్చు. రాగి యాంట °మైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉందని తేలింది. ఇది హానికరమైన బ్యాక్టీరియా, వైరస్లతో పోరాడడంలో శక్తివంతమైన మిత్రదేశంగా మారింది. మీ దినచర్యలో రాగి జావాను చేర్చడం ద్వారా, మీరు మీ రోగనిరోధక వ్యవస్థకు చాలా అవసరమైన ప్రోత్సాహాన్ని ఇవ్వవచ్చు.

వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు దోహదం చేస్తాయి. రాగి జావాను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా, మీరు మీ కణాలను దెబ్బతినకుండా రక్షించుకోవచ్చు. దాంతో మనం దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

### యాంటీ ఇన్ఫ్లమేటరీ ఎఫెక్ట్స్...

వాపు అనేది గాయం కలిగినప్పుడు

## బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలంటే ఎంత సిబిల్ స్కోర్ ఉండాలి..?




లోన్ తీసుకోవడానికి సిబిల్ స్కోర్ చాలా అవసరం.. ఇది తక్కువగా ఉండే బ్యాంకులు అస్సలు లోన్ ఇవ్వవు.. ఒకవేళ ఇచ్చినా చాలా ఎక్కువ ఇంట్రస్ట్‌కు ఇస్తాయి.. అసలు బ్యాంకు నుండి రుణం పొందాలంటే ఎంత సిబిల్ ఉండాలి..? CIBIL స్కోర్ లేదా క్రెడిట్ స్కోర్ అనేది రుణం పొందాలా వద్దా అనే విషయాన్ని నిర్ణయించే ముఖ్యమైన అంశాలలో ఒకటి. మంచి క్రెడిట్ స్కోర్ అనేది ఆర్థిక స్థిరత్వానికి ప్రతిబింబం. తక్కువ %జ×దీ×ూ% స్కోర్ రుణం పొందడం కష్టతరం చేస్తుంది.

### CIBIL స్కోర్ ఎంత ఉండాలి..?

క్రెడిట్ స్కోర్ అనేది 300 నుండి 900 వరకు ఉండే సంఖ్య. రుణగ్రహీత యొక్క క్రెడిట్ చరిత్ర, క్రెడిట్ కార్డ్‌లు లేదా తిరిగి చెల్లించే సామర్థ్యం వంటి వాటి ఆధారంగా ఒక వ్యక్తి యొక్క స్కోర్ 700 కంటే ఎక్కువ క్రెడిట్ స్కోర్‌గా పరిగణించబడుతుంది. రుణం కోసం దరఖాస్తు చేస్తున్నప్పుడు, బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థలు ఒక వ్యక్తి యొక్క క్రెడిట్ స్కోర్‌ను వారి క్రెడిట్ యోగ్యతను అంచనా వేయడానికి ప్రాథమికంగా తనిఖీ చేస్తాయి. ఒక వ్యక్తి తన రుణ చెల్లింపులను డిఫాల్ట్ చేస్తే, అది అతని క్రెడిట్ స్కోర్‌ను కూడా ప్రభావితం చేస్తుంది.

### మంచి క్రెడిట్ స్కోర్ అంటే ఏమిటి?

మంచి క్రెడిట్ స్కోర్ సాధారణంగా 720 మరియు 900 మధ్య ఉంటుంది. మంచి క్రెడిట్ స్కోర్‌ను కలిగి ఉండటం వలన వేగంగా రుణం పొందడం సులభం అవుతుంది. క్రెడిట్ స్కోర్ 600 కంటే తక్కువ ఉంటే రుణం పొందడం కష్టమవుతుంది. 600 - 699 మధ్య సిబిల్ స్కోరు చాలా అసమానమైనది. మంచి క్రెడిట్ స్కోర్ 700 - 799 మధ్య ఉంటుంది. అధిక క్రెడిట్ స్కోర్ ఇప్పటికీ ఆర్థిక స్థిరత్వాన్ని సూచిస్తుంది. క్రెడిట్ స్కోర్ మీరు సకాలంలో రుణాన్ని తిరిగి చెల్లిస్తారనడానికి సంకేతం. క్రెడిట్ కార్డుల వాడకం క్రెడిట్ స్కోర్‌పై తీవ్రంగా ప్రభావితం చూపిస్తుంది. మీ దగ్గర క్రెడిట్ కార్డు ఉండి వాడకపోయినా, లేదా అధికంగా వాడినా మీ సిబిల్ ప్రభావితం అవుతుంది.

## టీబీ డ్యాంకు భారీగా వరద ఆయకట్ట రైతన్నలో చిగురుస్తున్న ఆశలు



కర్ణాటక రాష్ట్రం హొస్పేట వద్దఉన్న టీబీడ్యాం

జలాశయానికి భారీగా వరద నీరువచ్చి చేరుతోంది. గాజునూరు జలాశయం నుంచి విడుదలచేస్తున్న నీరంతా తుంగభద్ర జలాశయానికి చేరుతోంది. సోమవారం నాటికి 6308 క్యూసెక్కులుగా ఉన్న ఇన్ ఫ్లో మంగళవారం నాటికి11854 క్యూసెక్కులకు పెరిగిందన్నారు. ప్రస్తుత డ్యామ్ లో 1633 అడుగులకు నీటిమట్టానికి గాను1584. 15 అడుగులకు నీరు చేరింది. హెచ్ఎల్సి ఆయకట్ట రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

## ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నీరు..లీటర్ ఇన్ని లక్షలా?

నీరు లేకుండా ప్రపంచం ఉండదని అందరికి తెలిసిన విషయమే.భూమిపై ఉన్న అన్ని జీవులకు నీరు చాలా ముఖ్యమైనది. మనుగడ, పెరుగుదలకు నీరు అవసరం.మానవ శరీరం దాదాపు 60% నీటితో నిండిఉంది. శరీరంలోని జీర్ణక్రియ, పోషకాలను అన్ని భాగాలకు రవాణా చేయడంలో నీర తోడ్పడుతుంది. హైడ్రేషన్ లేకుండా మనం ఏమీ చేయలేము. మన శరీరంలో నీటి శాతం కొద్దిగా తగ్గినా మన శరీరం అలసిపోతుంది. జీవరాశులకు అతీతంగా వ్యవసాయం, ఆరోగ్యం,పరిశ్రమలకు నీరు చాలా ముఖ్యమైనది. పంటలకు నీరందించేందుకు, పశువుల పెంపకానికి నీరు అవసరం. నీటిని వివిధ పారిశ్రామిక కార్యకలాపాలకు ఉపయోగిస్తారు. అందుకే నీరు ప్రతి మనిషి ప్రాథమిక హక్కు అని చెబుతున్నప్పటికీ నీరు నేడు మార్కెట్ లో విస్తారంగా వ్యాపించి ఉంది. ఈ సందర్భంలో, ప్రపంచం లోనే అత్యంత ఖరీదైన బాటిల్ వాటర్ జపాన్‌లోని ఫిలికో జ్యువెలరీ కంపెనీ వాటర్ బాటిల్ నుండి వచ్చింది. దీని ధర $ 1,390. అంటే భారతీయ పరిభాషలో లీటర్ వాటర్ బాటిల్ ధర రూ.1,16,000. ఫిలికో జ్యువెలరీ కంపెనీ నీటిని వేరు చేసేది నీటి స్వచ్ఛత మాత్రమే కాదు, దాని విలాసవంతమైన ప్యాకేజింగ్ వల్ల చాలా మంది కొనుగోలు చేస్తారు. ముందుగా ఈ



నీటిని గోబీ అనే ప్రదేశంలో ఉన్న సహజ నీటి బుగ్గ నుండి తీసుకుంటారు. ఇది సీసాలో అందంగా రూపొందించిన నాణ్యమైన సీసాలలో విక్రయిస్తారు. నీటి ధర ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ, చాలా మంది ఈ వాటర్ బాటిల్ విలాసానికి కొనుగోలు చేస్తారు.స్వచ్ఛమైన నీటిని పొందడం చాలా మందికి సవాలుగా మారింది. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అటువంటి సంస్థల నుండి నీరు కూడా ప్రజలు వినియోగిస్తారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY

గురువారం 20 - 02 - 2025

# తెలంగాణలో ప్రజలు వదిలేసి వెళ్లిపోయిన వేల కోట్ల విలువైన ఈ భూములు ఎవరికి చెందుతాయి ?



"తెలంగాణలో రూ.10 వేల కోట్లకు పైగా విలువైన ఎనిమీ ప్రాపర్టీస్ ఉన్నాయి. వాటిపై అధికారులతో సమీక్షించాం. మార్చి 15లోగా క్షేత్రస్థాయిలో సర్వే చేసి వివరాలు ఇవ్వాలని చెప్పాం" అంటూ కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు.దీంతో ఇప్పుడు ఈ ఎనిమీ ప్రాపర్టీ లెక్కలు తేల్చే పనిలో ఉన్నారు అధికారులు.ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎనిమీ ప్రాపర్టీలున్నాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. వీటిలో చాలావరకు అన్యాక్రాంతమైనట్లుగా అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు వాటిని తిరిగి తీసుకోవడం అధికారులకు సవాలుగా మారనుందనే చెప్పాలి."అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం, చాలా ప్రాంతాల్లో ఇవి ఆక్రమణకు గురైనట్లుగా తెలుస్తోంది. వాటిని ఏ విధంగా తిరిగి స్వాధీనం చేసుకోవాలనే విషయాన్ని ఆలోచిస్తాం. అవసరమైతే తిరిగి ప్రజలకే అందించేలా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది" అని చెప్పారు బండి సంజయ్.

**హైదరాబాద్ చుట్టుపక్కలే ఎక్కువ**

ఎనిమీ ప్రాపర్టీస్ తెలంగాణలో నాలుగు జిల్లాల్లో ఉన్నప్పటికీ హైదరాబాద్ చుట్టుపక్కలే ఎక్కువగా ఉన్నాయి.హైదరాబాద్ జిల్లా బాకారంలో 5,578 గజాలు, బహదూర్ పురాలోని రికాబ్ గంజ్‌లో 3,300 గజాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో 40 ఎకరాలు, వికారాబాద్ జిల్లా అలంపల్లిలో 17.22 ఎకరాలు ఉన్నాయని రెవెన్యూ అధికారులు, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ, మియాపూర్ పరిధిలో ఎనిమీ ప్రాపర్టీలు రికార్డుల్లో ఉన్నట్లుగా చెబుతున్నప్పటికీ, ఏళ్ల తరబడిగా పట్టించుకోకపోవడంతో అన్యాక్రాంతమైనట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. "హైదరాబాద్ జిల్లా పరిధిలోని షేక్‌పేట మండలం, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఓల్డ్ బోయిన్‌పల్లి, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ, శేరిలింగంపల్లి మండలం మియాపూర్, గండిపేట, పుప్పాలగూడ ప్రాంతాల్లో ఎనిమీ ప్రాపర్టీలున్నాయి.వాటిపై అజమాయిషీ లేకపోవడంతో ఆక్రమణలకు గురవుతూ వచ్చాయి. ఈ ప్రాంతాల్లో దాదాపు 1,500 ఎకరాల ఎనిమీ ప్రాపర్టీ భూముల లెక్క తేలాల్సి ఉంది" అని రంగారెడ్డి జిల్లాకు చెందిన మాజీ రెవెన్యూ అధికారి ఒకరు బీబీసీకి చెప్పారు.ప్రస్తుతం ఈ భూములు ఎన్ని ఉన్నాయనేది పూర్తి వివరాలు తీసే పనిలో ఉన్నారు అధికారులు.

**ఏమిటీ ఎనిమీ ప్రాపర్టీ ?**

దేశంలో ఎనిమీ ప్రాపర్టీలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 'ది ఎనిమీ ప్రాపర్టీ యాక్ట్ - 1968'ను తీసుకువచ్చింది. 1968 జులై 10 నుంచి ఇది అమల్లోకి వచ్చింది.ఎనిమీ ప్రాపర్టీస్ చట్టం ప్రకారం, ఆస్తులకు కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ ఫర్ ఇండియా (సెపీ) పర్యవేక్షణ ఉంటుంది. ఇది కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉంటుంది.రాష్ట్రాల్లో జిల్లాస్థాయిలో కలెక్టర్లకు పర్యవేక్షణ బాధ్యత ఉంటుంది.1962లో భారత్, చైనా మధ్య 1965, 1971లో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధాలు జరిగాయి.ఈ యుద్ధాల తర్వాత కొందరు భారత్‌ను విడిచి చైనా, పాకిస్తాన్‌లకు వలస వెళ్లిపోయారు. ముఖ్యంగా పాకిస్థాన్‌తో యుద్ధాల తర్వాత పెద్ద సంఖ్యలో ముస్లింలు తమకు సంబంధించిన భూములు, స్థిరాస్తులను వదిలి వలస వెళ్లిపోయారు."1968లో వచ్చిన చట్టం మేరకు అలా వలస వెళ్లిపోయిన వారి భూములు, ఇతర స్థిరాస్తులు స్వాధీనం చేసుకుంటున్నట్లుగా అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది" అని బీబీసీకి చెప్పారు మాజీ ఐఏఎస్ అధికారి సురేష్ పొద్దార్.ఈ ఆస్తుల ఆక్రమణలు, వివాదాలు రేగడంతో వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. దీంతో ఈ భూములకు ట్రస్టీగా సెపీ, యజమానిగా వేరే దేశానికి వలస వెళ్లిపోయిన వ్యక్తి ఉంటారని 2005లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.అయితే, కేంద్ర ప్రభుత్వం 2016లో ఎనిమీ ప్రాపర్టీస్ చట్టానికి సవరణ చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది. దీని ప్రకారం ఎనిమీ ప్రాపర్టీకి యజమానిగా కేంద్ర ప్రభుత్వం ఉంటుంది.ఈ చట్ట సవరణ బిల్లును 2017 మార్చి 14న లోక్‌సభ ఆమోదించింది.అలాగే, ఈ చట్టంలోని సెక్షన్ 8(ఏ) ప్రకారం ఈ ఆస్తులను అమ్ముకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది.నగరాల్లోని అత్యంత కీలకమైన ప్రాంతాల్లో ఎనిమీ ప్రాపర్టీస్ ఉండటం కారణంగా మార్కెట్ విలువ వేల కోట్లకు చేరుకుంది. దీంతో ప్రైవేటు వ్యక్తులు, కేంద్ర ప్రభుత్వం మధ్య వీటిపై కోర్టుల్లో వివాదాలు నడుస్తున్నాయి."రంగారెడ్డి జిల్లాలో చాలావరకు భూములు ఆక్రమణకు గురయ్యాయి. వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవడం ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా కష్టంతో కూడుకున్నది" అని చెప్పారు సురేష్ పొద్దార్.కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఎనిమీ ప్రాపర్టీ విషయంలో లెక్కలు తేల్చుతుండటంతో, మున్ముందు ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది చూడాల్సి ఉందన్నారు పొద్దార్.మార్చి 15లోగా ఎనిమీ ప్రాపర్టీ లెక్కలు సమర్పించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశించిన క్రమంలో అధికారుల సర్వే కీలకం కానుంది. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా పరిధిలో వందల కోట్ల విలువైన భూములకు సంబంధించి లెక్కలు తేలాల్సి ఉంది.

రూ.లక్ష కోట్ల ఎనిమీ ప్రాపర్టీస్

తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా ఎనిమీ ప్రాపర్టీస్ ఎన్ని ఉన్నాయనే విషయంపై స్పష్టత రావాల్సి ఉందని పేరు వెల్లడించడానికి ఇష్టపడని రెవెన్యూ శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. దీనిపై సర్వే జరుగుతున్నట్లు తెలిపారు."ఎనిమీ ప్రాపర్టీల విషయంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ తక్కువగా ఉండేది. దీనివల్ల దశాబ్దాలుగా సరైన నిఘా లేకపోవడంతో ఆక్రమణకు గురయ్యాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆ లెక్కలు తీసే పనిలో ఉంది" అని ఆయన చెప్పారు.2017నాటికి దేశవ్యాప్తంగా 9500 ఎనిమీ ప్రాపర్టీస్ ఉన్నట్లుగా ప్రభుత్వం గుర్తించిందని పీఆర్ఎస్ ఇండియా తన కథనంలో పేర్కొంది.ఇవి చాలావరకు పాకిస్తాన్‌కు వలస వెళ్లి, అక్కడ స్థిరపడిన వారివేనని ప్రభుత్వం చెబుతోంది. అప్పటికి ఈ ఆస్తుల విలువ రూ.1,04,339 కోట్లు ఉన్నట్లుగా పీఆర్ఎస్ ఇండియా కథనంలో ప్రస్తావించింది.

ఎనిమీ, ఎవాక్యూ ప్రాపర్టీల మధ్య తేడా ఏంటి?

ఎనిమీ ప్రాపర్టీలే కాదు, ఎవాక్యూ ప్రాపర్టీ పేరుతో కూడా భారత్‌లో ఆస్తులున్నాయి. ఇవి కూడా ఎక్కువగా హైదరాబాద్ చుట్టుపక్కలే ఉన్నాయి.ఎవాక్యూ ప్రాపర్టీని కాందిశీకుల భూమి అని కూడా పిలుస్తారు.దేశ విభజన సమయంలో జరిగిన ఘర్షణల తర్వాత పెద్ద సంఖ్యలో ముస్లింలు వారి భూములు, స్థిరాస్తులను వదిలి పాకిస్తాన్‌కు వలస వెళ్లారు.అలా వెళ్లిన వారి ఆస్తులను ఎవాక్యూ ప్రాపర్టీగా పిలుస్తారని సురేష్ పొద్దార్ చెప్పారు. ఎనిమీ, ఎవాక్యూ ప్రాపర్టీలు రెండూ వలస వెళ్లిపోయిన వారికి చెందిన భూములే అయినప్పటికీ, వారు వలస వెళ్లిన కాలం వేర్వేరు అని వివరించారు సురేష్ పొద్దార్.

# కుంభమేళాతో కోనసీమలో కొందరు రైతుల ఆనందం



కొన్నేళ్లుగా సరైన గిట్టుబాటు ధర లేక, పెట్టుబడి ఖర్చులు రాక నష్టాలలోనే సాగు చేస్తోన్న కోనసీమ కొబ్బరి రైతులలో ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళా ఉత్సాహం నింపింది.కోనసీమ నుంచి భారీ సంఖ్యలో కొబ్బరికాయలు కుంభమేళాకు ఎగుమతి కావడంతో ఇక్కడి రైతులు చాలాకాలం తర్వాత లాభాలు కళ్లజూశారు.ఒకప్పుడు గోదావరి జిల్లాల్లో "కొబ్బరి చెట్టు కొడుకు కన్నా మిన్న" అనే సామెత బాగా వినపడేదని పెద్దలు చెబుతుంటారు. కొడుకులు చూసినా చూడకపోయినా ఇంటి దగ్గర పది కొబ్బరి చెట్లు ఉంటే బతికేయవచ్చు అనే నమ్మకంతో ఇక్కడి ప్రజలు ఉండేవారు.అంతటి వైభవం ఉన్న కొబ్బరి పంటను నమ్ముకున్న రైతులు కొన్నాళ్లుగా నష్టాల్లో ఉన్నారు. కేంద్రప్రభుత్వం ఇచ్చే గిట్టుబాటు ధర సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చారు.సరిగ్గా ఈ సమయంలోనే గతనెలలో ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా మొదలైంది.కుంభమేళాలో జరిగే పూజలు, ఇతరత్రా వైదిక కార్యకలాపాల కోసం కోనసీమ జిల్లా నుంచి పెద్దసంఖ్యలో కొబ్బరికాయలు ఎగుమతి కావడం, ధర కూడా 14 నుంచి 16 రూపాయల వరకు చేరడంతో రైతులు, వ్యాపారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

**ప్రయాగ్‌రాజ్‌కు పోటెత్తిన కొబ్బరికాయలు**

"ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరుగుతున్న కుంభమేళా.. కోనసీమ కొబ్బరి రైతులకు వరం అనే చెప్పాలి. కుంభమేళాకు లక్షల సంఖ్యలో కొబ్బరికాయలు ఎగుమతి కావడం, ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడటంతో కొబ్బరి ధరలు అమాంతం పెరగడం ఆనందదాయకం. చాలాకాలం తర్వాత కొబ్బరి ధరలు పెరగడం వల్ల రైతులు చాలా ఉత్సాహంగా ఉన్నారు" అని డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన కొబ్బరి రైతు, కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ సీఈవో అడ్డాల గోపాలకృష్ణ బీబీసీకి తెలిపారు.మరో రైతు, అమలాపురానికే చెందిన అబ్బిరెడ్డి రంగబాబు మాట్లాడుతూ "మా కొబ్బరి కాయ కుంభమేళాకు వెళ్లింది కాబట్టే ఎంతో కొంత గిట్టుబాటు ధర వచ్చింది. ఐదారేళ్ల కిందట ఐదారు రూపాయలే ఉండగా, మొన్నటివరకు పది రూపాయలు రావడం గగనంగా మారింది. ఇప్పుడు ఏకంగా 14 రూపాయలకు కొంటున్నారు" అని అన్నారు.ఇక మరో రైతు వంకాయల స్వామి ప్రకాశ్ మాట్లాడుతూ.. 'నా పొలంలోని కాయలు కుంభమేళాకు వెళ్లడంతో వెయ్యి కాయల ధర రూ. 16 వేల నుంచి 16,500 వరకు వెళ్లింది' అని సంతోషాన్ని వెలిబుచ్చారు.కాగా, కుంభమేళా తర్వాత పరిస్థితి ఏమిటనే ఆందోళన కోనసీమ కొబ్బరి రైతుల్లో కనిపిస్తోంది."కుంభమేళా అయిపోతోందన్న భయం ఇక్కడి రైతుల్లో కనిపిస్తోంది. ధర మళ్లీ నెమ్మదిగా పాత స్థితికి చేరుకుంటుందన్న ఆందోళన రైతుల్లోఉంది" అని గోపాలకృష్ణ అన్నారు.



**కొబ్బరి రైతుల సమస్యేంటి?**

ప్రపంచ కొబ్బరి ఉత్పత్తిలో భారతదేశం మూడో స్థానంలో ఉంది. ఉత్పత్తిలో దేశంలో కేరళ, తమిళనాడు, కర్ణాటక తరువాత ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉంది.రాష్ట్రంలో దాదాపు మూడు లక్షల ఎకరాల వరకు కొబ్బరి విస్తీర్ణం ఉండగా, ఒక్క డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే లక్షా 5వేల ఎకరాల్లో కొబ్బరి పంట సాగవుతోంది. 2000 సంవత్సరం వరకు కొబ్బరి సాగు బాగానే ఉండేది.అయితే ఆ తర్వాతి నుంచి ఎర్ర నల్లి, తెల్ల దోమ వంటి తెగుళ్లు ఆశించడంతో దిగుబడి బాగా తగ్గింది.మరోవైపు మార్కెట్లో ధరలు హెచ్చుతగ్గులుగా ఉండటం వల్ల కూడా నష్టపోతున్నామని కొబ్బరి రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**అమెరికా నుంచి వచ్చిన తెల్లదోమతో..**

"కోనసీమలో ఎకరం కొబ్బరి తోట ఉంటే ప్రతి నెలా వెయ్యి కొబ్బరి కాయలు దించే వారు. కానీ 2000 సంవత్సరంలో అమెరికా నుంచి వచ్చిన తెల్లదోమ వల్ల పంట తీవ్రంగా దెబ్బతిని కాయసైజు, నాణ్యత తగ్గింది. దేశంలో ముందుగా పొలాచ్చిలో కనిపించిన ఆ తెల్ల దోమ ఆ తర్వాత అన్ని ప్రాంతాల్లోని కొబ్బరి పంటలనూ నాశనం చేసింది. అప్పటి నుంచి దిగుబడులు తగ్గాయి. గతంలో ప్రతి నెలా లేదంటే 45 రోజులకు పంట వచ్చేది. ఇప్పుడు మూడు, నాలుగు నెలలకు పంట వస్తోంది" అని రైతులు గోపాలకృష్ణ, అబ్బిరెడ్డి రంగబాబు చెప్పారు.



**కాయ నాణ్యత కూడా..**

"తెల్లదోమ ప్రభావంతో పాటు నల్లతెగులు వల్ల కొబ్బరిపై మచ్చలు ఏర్పడి.. కాయ సైజు తగ్గిపోతోంది. తద్వారా దిగుబడి తగ్గుతోంది. కాయ బాగుంటే ఇచ్చే రేటుకు, మచ్చ ఉన్న కాయకి ఇచ్చే రేటుకు తేడా సగానికి సగం ఉంటుంది. ఒకప్పుడు మొత్తం ఆకు పచ్చగా కనిపించే కొబ్బరితోటలో ఇప్పుడు మచ్చకాయలే ఎక్కువ కనిపిస్తున్నాయి" అని రైతు వంకాయల స్వామి ప్రకాశ్ బీబీసీకి తెలిపారు.పంటకు ఆశించే తెగుళ్లకు రైతులందరూ మందులు స్ప్రే చేస్తేనే ఉపయోగం ఉంటుందని చెబుతున్నారు.పక్క పొలంలోని రైతు చేయకపోయినా.. ఆ పంట తెగులు పక్కనే ఉన్న మందు కొట్టిన పంటను కూడా నాశనం చేస్తోందని, పంట ఎదగనివ్వడం లేదని పేరూరుకు చెందిన రైతు మోటూరు సూరిబాబు అన్నారు.

**'ప్రభుత్వాలు ఆదుకోవాలి'**

"కోనసీమలో కొబ్బరి ఉప ఉత్పత్తుల తయారీ లేకపోవడం వల్ల కేవలం కొబ్బరికాయలు ఎగుమతిపైనే రైతులు ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు ముందుగా కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తేనే సీజన్‌లతో సంబంధం లేకుండా కొబ్బరి రైతు స్థిరమైన లాభాలను పొందుతారు" అని ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె. శ్రీనివాసరావు బీబీసీతో అన్నారు.అలాగే కేంద్రప్రభుత్వం కొబ్బరికాయలకు గిట్టుబాటు ధరను పెంచాలని ఆయన కోరారు."కేంద్రం ఈ ఏడాది బంతి కొబ్బరికి రూ. 12,100, మిల్లింగ్ కొబ్బరికి రూ.11, 528 గిట్టుబాటు ధరగా ప్రకటించింది. కానీ రైతుకు పెరిగిన పెట్టుబడి ధరలు, దిగుబడి స్థాయిలు చూస్తే ఆ ధరలు ఏమాత్రం సరిపోవు" అని శ్రీనివాసరావు చెప్పారు.

క్వింటా కొబ్బరికి కనీసం రూ. 15 వేలు ఉండాలని రైతులు అడుగుతున్నారని, ఆ మేరకు కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని శ్రీనివాసరావు కోరారు.నాఫెడ్ (నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) లేదా ఆయిల్‌ఫెడ్ (ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి కొబ్బరి కొనుగోలు చేయాలని శ్రీనివాసరావు కోరారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటునిస్తేనే కొబ్బరి రైతు సాగు చేసే పరిస్థితి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బీవీ రమణకొబ్బరి రైతులకు లాభాలు ఎలా తీసుకురావాలన్న దానిపై రాష్ట్ర ప్రభుత్వపరంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బీవీ రమణ బీబీసీకి తెలిపారు."ముందుగా ప్రభుత్వపరంగా కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. కోల్డ్ స్టోరేజీల మాదిరిగా రైతులు కొబ్బరి పంట రాగానే అవసరమైతే మూడు, నాలుగు నెలలు దాచుకుని మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకునే వీలు కల్పిస్తాం" అని ఆయన చెప్పారు.అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేసి కొబ్బరి ఆధారిత ఉత్పత్తుల తయారీ, అమ్మకాన్ని ప్రోత్సహిస్తామని రమణ చెప్పారు.

# తెలంగాణలో పండే 'టమోటా మిర్చి' స్పెషాలిటీ



అది వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామం. పాలడుగుల రామయ్య అనే వ్యక్తి తన ఇంటి అరుగుపై కూర్చుని కొడుకు, కోడలు, ఇంజినీరింగ్ చదువుతున్న మనవడితో తమ కుటుంబ వ్యవసాయ నేపథ్యం గురించి మాట్లాడుతున్నారు. మూడు తరాల అనుభవాల ముచ్చట్లు అవి."మా తాత, నాన్న, నేను, ఆ తర్వాత నా కొడుకు వరకు ఇలాగే కొనసాగుతోంది. ఆ విత్తనాల మూలం ఎక్కడ? ఎలా, ఎప్పుడు అనే విషయాలేవీ మాకు తెలియదు" అన్నారు రామయ్య.దేశవాళీ రకం 'చపాట మిరప' పంట గురించి వారు మాట్లాడుతున్నారు. దీన్నే 'టమోటా మిర్చి' అని కూడా పిలుస్తారు. ఈ పండు మిరపకాయలు టమోటా ఆకారంలో ఉంటాయి.సాధారణ మిరప రకాలతో పోలిస్తే ఎక్కువ ఎరుపు, తక్కువ కారం చపాట మిర్చి ప్రత్యేకత. అంతేకాదు ఈ పంట తెలంగాణలోని ఉమ్మడి వరంగల్ జిల్లాకే పరిమితమని ఇక్కడి అధికారులు చెబుతున్నారు.చపాట మిర్చికి జీఐ ట్యాగ్ (జియోగ్రాఫికల్ ఇండికేషన్) గుర్తింపు ప్రక్రియ చివరి దశలో ఉంది. ఇటీవల 'జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ జర్నల్'లో చపాట మిర్చి వివరాలు ప్రచురితం అయ్యాయి.ఏవైనా ఉత్పత్తులకు ప్రత్యేక లక్షణాలుంటే వాటి భౌగోళిక స్థానం, లక్షణాలను జీఐ ట్యాగ్ గుర్తిస్తుంది. దీనిద్వారా ఆ ఉత్పత్తిని ఇతరులు కాపీ చేయకుండా వాటి మేథోపరమైన హక్కులపై చట్టపరంగా రక్షణ లభిస్తుంది."జీఐ గుర్తింపు వస్తే ఖచ్చితంగా అది మాకు గర్వకారణం. ఎక్కడా లేనిది మా దగ్గరుందంటే గొప్పతనమే కదా!" అని అన్నారు లక్ష్మీప్రసాద్."చిన్నప్పుడు సెలవుల్లో మా పొలానికి వెళ్లేవాడిని. ఇతర రాష్ట్రాల మార్కెట్లకు ఎగుమతి చేసే మిరప బస్తాలను గుర్తుపట్టేలా వాటిపై మా తాతయ్య, నాన్న పేరు మార్కర్ పెన్‌తో రాయడం, బస్తాలు లెక్కపెట్టడం నాకింకా గుర్తుంది" అని ఆయన చెప్పారు.

**చపాట మిర్చి**



చపాట మిర్చిని స్థానికంగా దొడ్డుకాయ, లబ్బుకాయ, నీటి కాయ, మోదాలు, దేశవాళీ, సింగిల్ పట్టి, డబుల్ పట్టీ, టమోటా.. ఇలా వివిధ రకాల పేర్లతో పిలుస్తారు.జీఐ జర్నల్‌లో ప్రచురించిన వివరాల ప్రకారం.. ఉమ్మడి వరంగల్‌లో నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి, ములుగు, శాయంపేట్, పరకాల, నడికుడ, మొగుల్లపల్లి, టేకుమట్ల, చిట్యాల, ఘనపూర్, భూపాలపల్లి, వెంకటాపూర్ ప్రాంతాలకు ఈ పంట సాగు పరిమితమైంది.కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టీకల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త భాస్కర్ కొంతకాలం 'చపాట'పై పరిశోధనలు చేశారు. ఈ పంట కొన్ని ప్రాంతాలకే పరిమితమవడంపై ఆయన బీబీసీకి వివరించారు.'ఈ ప్రాంతాల్లో అధిక వర్షపాతం, చల్లటి వాతావరణం, కాయ అభివృద్ధి దశలో పొడి వాతావరణ పరిస్థితులు ఉంటాయి. ఇక్కడి ఎర్ర, నల్ల రేగడి నేలల్లో ఉదజని సూచిక (పీహెచ్) 7.5 వరకు ఉండటం వల్ల సాధారణ మిరప రకాలతో పోలిస్తే అధిక రంగు, తక్కువ కారం లక్షణాలుంటాయి. మిరపలోని అతి తక్కువ ఎస్‌హెచ్‌యూ (స్కావిల్లే హీట్ యూనిట్స్)వల్ల ఘాటు తక్కువగా ఉంటుంది" అని భాస్కర్ చెప్పారు.చపాట మిర్చిలోని ప్రత్యేక లక్షణాల వల్ల పచ్చళ్లు, పానీయాలు, ఆహారశుద్ధి, ఐస్‌క్రీమ్ కలర్స్, లిప్ స్టిక్, నూనెల తయారీలలో వాడుతున్నారని ఆయన తెలిపారు.స్థానిక మార్కెట్‌లతో పాటూ జాతీయస్థాయిలో దిల్లీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలకు చపాట మిర్చి ఎగుమతి చేస్తున్నారు.ప్రతి సంవత్సరం సుమారు ఏడు వేల ఎకరాల్లో 10 వేల మెట్రిక్ టన్నుల చపాట మిర్చి ఉత్పత్తి జరుగుతోందని భాస్కర్ తెలిపారు."ఒక్కో ప్రాంతంలో ఒక్కో పంట ఎక్కువగా పండిస్తుంటారు. మాకు చపాట మిర్చి ప్రత్యేకం. దీని రంగు బాగుంటుంది. పచ్చళ్లకు ఉపయోగిస్తాం. కూరల్లో చిక్కదనం (గ్రేవీ) వస్తుంది. ఏటా ఈ కారం పొడిని పంపాలని దూరప్రాంతాల బంధువులు, స్నేహితుల నుంచి కాల్స్ వస్తాయి" అని తిమ్మంపేటకు చెందిన మహిళా రైతులు, గృహిణులైన నరహరి సునీత, పాలడుగుల స్వప్న వివరించారు.రైతులు చపాట మిర్చి విత్తనాలను సంప్రదాయ పద్దతిలో ఇంటి వద్దే తయారు చేస్తున్నారు.ఆగస్టులో విత్తనాలు వేసి, నారు పోస్తారు. సెప్టెంబర్ మొదటి వారంలో నాట్లు వేస్తారు. పంట కాలం 5 నుంచి 6 నెలలు.చపాట విత్తన నిల్వలో మహిళలది చెప్పుకోదగ్గ పాత్ర ఉంది.తిమ్మంపేటకు చెందిన శ్రీమతమ్మ ఈ పంట గురించి మాట్లాడుతూ.. "చపాట మిర్చి మా జీవితంలో ఒక భాగం. ఈ పంట సాగులో 50 ఏళ్ల అనుభవం నాది. విత్తనాలు ఇంటి వద్దే తయారు చేస్తాం. నాణ్యమైన కాయల నుంచి విత్తనాలు తీసి ఎండబెట్టి, పురుగు పట్టకుండా పొడరు (రసాయనం కలిపి) నిల్వచేస్తాం. నారు పోసే ముందు మరోసారి ఎండబెడతాం" అని అన్నారు.చపాట మిర్చికి కొన్నేళ్లుగా దోమ, నల్లి తెగుళ్లు సోకుతున్నాయి. తక్కువ విస్తీర్ణంలో సాగయ్యే ఇలాంటి పంటల విత్తనాలు భద్రపరచడం, పరిరక్షించడం సవాల్‌తో కూడుకున్న పని అని శాస్త్రవేత్తలు అంటున్నారు. ప్రతి ఏటా విత్తనశుద్ధి క్రమం తప్పకుండా జరపాలని సూచిస్తున్నారు.వ్యవసాయ శాస్త్రవేత్తల రిపోర్టుల ప్రకారం.. గత 80 ఏళ్ల నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో చపాట మిర్చి సాగవుతోంది.ప్రత్యేక లక్షణాలున్న ఈ చపాట మిర్చికి జీఐ గుర్తింపు కోసం



వరంగల్ జల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేటకు చెందిన రైతులు సంఘంగా ఏర్పడి 'తిమ్మంపేట చిల్లీ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' పేరుతో 2022లో దరఖాస్తు చేశారు.కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టీకల్చర్ యూనివర్సిటీ పరిధిలోని జన్నారెడ్డి వెంకట్ రెడ్డి హార్టీకల్చర్ రీసర్చ్ స్టేషన్ (మల్యాల, మహబూబాబాద్ జిల్లా) జీఐ గుర్తింపునకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక, పరిశోధనా సహకారాలను అందించింది."జీఐ గుర్తింపుతో దూరప్రాంతాల నుంచి మా దగ్గరికే కొనుగోలుదారులు వస్తారు. మార్కెటింగ్ అవకాశాలు మెరుగవుతాయి. మధ్యవర్తులు లేకుండా మా సంఘంతో నేరుగా వ్యాపారం చేయడం వల్ల రైతులకు లాభం చేకూరుతుంది. తక్కువ విస్తీర్ణంలో పండించే పంట కాబట్టి స్థిరమైన ధర పలుకుతుంది" అని తిమ్మంపేట చిల్లి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ అధ్యక్షుడు నరహరి రాజ్‌కుమార్ రెడ్డి బీబీసీతో అన్నారు.'జీఐ ట్యాగ్‌తో చపాట సాగు చేసే రైతులు సొంత లోగోతో బ్రాండ్ క్రియేట్ చేసుకోవచ్చు. అంతర్జాతీయ స్థాయిలో వీరి ఉత్పత్తులకు ఎక్కువ ధర పలికే అవకాశాలుంటాయి. ఈ పంట సాగు ప్రాంతాల్లో లోకల్ టూరిజం కూడా అభివృద్ధి చెందుతుంది. అంతర్జాతీయ ప్రదర్శనల్లో వరంగల్ చపాట చిల్లీ ఉత్పత్తులు ప్రదర్శించవచ్చు" అని శాస్త్రవేత్త భాస్కర్ తెలిపారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
గురువారం 20 - 02 - 2025

## టీవీఎస్ 2025 ఎడిషన్ రోనిన్ బైకుని పరిచయం చేసింది




ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటర్..దేశీయ మార్కెట్‌కు మరో వాహనాన్ని పరిచయం చేసింది. 2025 ఎడిషన్‌గా విడుదల చేసిన 225 సీసీ మోటర్‌సైకిల్ 'రోనిన్'లో భద్రత ఫీచర్లను అప్‌గ్రేడ్ చేసింది. 2025 ఎడిషన్ రోనిన్ బైకు ప్రారంభ ధర రూ.1.35 లక్షలు చెన్నై, ఫిబ్రవరి 18: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటర్..దేశీయ మార్కెట్‌కు మరో వాహనాన్ని పరిచయం చేసింది. 2025 ఎడిషన్‌గా విడుదల చేసిన 225 సీసీ మోటర్‌సైకిల్ 'రోనిన్'లో భద్రత ఫీచర్లను అప్‌గ్రేడ్ చేసింది. రెండు రంగుల్లో లభించనున్న ఈ బైకు ప్రారంభ ధర రూ.1.35 లక్షలుగా నిర్ణయించింది. డ్యూయల్ చానెల్ ఏబీఎస్ రకం మాడల్ రూ.1.59 లక్షలు. ఈ ధరలు చెన్నై షోరూంనకు సంబంధించినవి. 225.9 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు 20.4 పీఎస్‌ల శక్తినివ్వనున్నది. టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసిన సంస్థ..ఈ బైకును యువతకు నచ్చే విధంగా డిజైన్ చేసినట్లు వెల్లడించింది. స్టైలిష్, రైడింగ్ పరంగా కొన్ని మార్పులు చేసినట్టు కంపెనీ పేర్కొన్నది. ఈ మాడల్‌తో సేల్స్ పెరుగు తాయన్న ఆశాభావాన్ని సంస్థ కనబరుస్తున్నది.


## కజారియా నయా సెంటర్




దేశంలో అతిపెద్ద సిరామిక్ అండ్ విట్రిఫైడ్ టైల్ తయారీసంస్థ కజారియా..హైదరాబాద్‌లో అతిపెద్ద ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ అన్ని రకాల టైల్స్ లభించనున్నాయని కంపెనీ ఎండీ రిషీ కజారియా తెలిపారు. టైల్స్, బాత్, శానిటరీవేర్ ఉత్పత్తులను ప్రతీ కుటుంబానికి అందించడం లక్ష్యంలో భాగంగా ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు చెప్పారు.స్టార్టప్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. దేశీయ స్టార్టప్‌లకకు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించాలనే ఉద్దేశంతో టీహబ్..బ్రెజిల్‌కు చెందిన గోయాస్ హబ్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో టీ హబ్ పౌండేషన్ సీఈవో సుజిత్, గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు ఇక్కడ అవకాశాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధానంగా కృత్రిమ మేధస్సు, ఐటీ, అగ్రి-టెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ తదితర రంగాల్లో పరస్పర సహకారం ఉంటుందని వారు వివరించారు.

## ఎన్‌ఎస్‌ఈ విలువ రూ.4.7 లక్షల కోట్లు

### గత ఏడాది 201 శాతం వృద్ధి




నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) విలువ రూ.4.7 లక్షల కోట్లకు చేరిందని ఓ తాజా నివేదిక పేర్కొన్నది. దేశంలోని అతిపెద్ద ఈక్విటీ మార్కెట్ వేదికల్లో ఒకటైన ఎన్‌ఎస్‌ఈ.. త్వరలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారతీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన, నమోదుకాని 500 భారీ సంస్థలతో బుర్గండి ప్రైవేట్ హురున్ ఇండియా 2024కుగాను ఓ జాబితాను తీసుకొచ్చింది. ఇందులో గత ఏడాది ఎన్‌ఎస్‌ఈ విలువ ఏకంగా 201 శాతం పుంజుకున్నట్టు తేలింది. ఇక దేశంలో అత్యంత విలువైన కంపెనీల్లో ఎన్‌ఎస్‌ఈ 10వ స్థానంలో ఉన్నది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఎన్‌ఎస్‌ఈ స్థూల ఆదాయం 28 శాతం పుంజుకొని రూ.16,352 కోట్లుగా నమోదైంది. పన్ను అనంతర లాభం 51 శాతం ఎగిసి రూ.8,306 కోట్లుగా ఉన్నది. కాగా, ఇటీవలే లిస్టింగ్ ప్రక్రియను మొదలుపెట్టిన ఎన్‌ఎస్‌ఈ.. మార్కెట్ రెగ్యులేటర్ సెబీకి దరఖాస్తు చేసుకున్నది. పబ్లిక్ ఇష్యూలో 10 శాతం వాటాలను విక్రయించే వీలున్నట్టు అంచనా.

**రిలయన్స్ టాప్**

రూ.17.5 లక్షల కోట్ల విలువతో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) హురున్ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నది. రూ.16.1 లక్షల కోట్లతో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రెండో స్థానంలో ఉండగా, 30 శాతం వృద్ధిని సాధించినట్టు హురున్ పేర్కొన్నది. గ్రూప్‌లవారీగా చూస్తే.. టాటా గ్రూప్ విలువ 37 శాతం వృద్ధితో రూ.32.27 లక్షల కోట్లుగా ఉన్నది. రిలయన్స్ గ్రూప్ రూ.19.71 లక్షల కోట్లుగా ఉంటే.. గౌతమ్ అదానీ గ్రూప్ విలువ రూ.13.40 లక్షల కోట్లుగా తేలింది. ఇక ఈసారి జాబితాలో చోటు దక్కించుకున్న 500 కంపెనీల్లో ప్రతీదాని విలువ బిలియన్ డాలర్లపైనే. ఈ మొత్తం కంపెనీల వాల్యూ కూడా 3.8 ట్రిలియన్ డాలర్లను తాకింది. రెవిన్యూ ట్రిలియన్ డాలర్లుగా ఉంటే.. లాభం రూ.8 లక్షల కోట్లుగా ఉన్నది. పన్నులు రూ.2.2 లక్షల కోట్లుగా ఉండగా.. ఉద్యోగులు 85 లక్షల మంది ఉన్నారు.

## 400 లక్షల కోట్ల దిగువకు

### క్షీణించిన బీఎస్‌ఈ సంస్థల విలువ



బీఎస్‌ఈలో లిట్కస్టైన సంస్థల విలువ రూ.400 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోతుండటం, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలతో మదుపరుల్లో సెంటిమెంట్ నీరుగారింది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో మంగళవారం రూ.2,01,032.5 కోట్లు కరిగిపోయి రూ.3,89,31,067.30 కోట్ల(4.58 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది. గతేడాది ఏప్రిల్‌లో తొలిసారిగా రూ.400 లక్షల కోట్ల మార్క్‌ను అధిగమించిన బీఎస్‌ఈలో లిట్కస్టైన సంస్థల విలువ 10 నెలల్లో ఈ మైలురాయిని కోల్పోవడం విశేషం. గతేడాది సెప్టెంబర్ 27న చారిత్రక గరిష్ఠ స్థాయి 85,978.25 పాయింట్లను తాకిన బీఎస్‌ఈ సెన్సెక్స్ ప్రస్తుతం 10,010.86 పాయింట్లు లేదా 11.64 శాతం వాటాను కోల్పోయింది. సూచీలదీ అదేదారి స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఎఫ్ఐఐల పెట్టుబడులు ఉపసంహరణ, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలతో మంగళవారం సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 29.47 పాయింట్లు నష్టపోయి 75, 967.39 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 14.20 పాయింట్లు కోల్పోయి 22,945.30 వద్ద స్థిరపడింది. మార్కెట్లో ఇండస్ఇండ్ బ్యాంక్, మహీంద్రాఅండ్ మహీంద్రా, హెచ్‌యూఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, ఐటీసీ, టాటా మోటర్స్, సన్‌ఫార్మా షేర్లు నష్టపోగా..ఎన్‌టీపీసీ, టెక్ మహీంద్రా, జొమాటో, పవర్‌గ్రిడ్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే ఇండస్ట్రియల్స్ 1.51 శాతం నష్టపోగా, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.19 శాతం, టెలికం 1.06 శాతం, క్యాపిటల్ గూడ్స్, వాహన రంగ షేర్లు నష్టపోయాయి. కానీ, యుటిలిటీ, ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, ఎనర్జీ సూచీలకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.

# ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్




ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) సంస్థ మంగళవారం ఓ సరికొత్త ప్లాన్‌ను పరిచయం చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు చేతులమీదుగా దీన్ని ఆవిష్కరించింది. ఇక ఇదో నాన్-లింక్డ్, వ్యక్తిగత/బృంద, పొదుపు, తక్షణ యాన్యుటీ ప్లాన్. సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ యాన్యుటీ రకాల కోసం విస్తృత శ్రేణిలో యాన్యుటీ ఆప్షన్లను అందిస్తుంది. జీవించి ఉన్న పాలసీదారులకైనా, మరణించిన పాలసీదారుల నామినీలు, వారసులకైనా ప్లాన్ నిబంధనలకు లోబడి ఎంచుకున్నవిధంగా ఒకేసారి లేదా వాయిదా పద్ధతుల్లో చెల్లింపులుంటాయి. ఈ కార్యక్రమంలో ఆర్థిక సేవల విభాగం అదనపు కార్యదర్శి ఎంపీ తంగిరాల, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ కుమార్ గోయల్‌లతోపాటు ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మహంతీ ఇతర మేనేజింగ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

### స్మార్ట్ పెన్షన్ ప్లాన్ ప్రత్యేకతలు

సింగిల్ ప్రీమియం, తక్షణ యాన్యుటీ.

కస్టమర్ల అవసరాలకు తగ్గట్టుగా విస్తృత రీతిలో యాన్యుటీ ఆప్షన్లు.

పాలసీదారుడి కనీస వయసు 18 ఏండ్లు. గరిష్ఠ వయసు యాన్యుటీ ఆప్షన్‌నుబట్టి 65 నుంచి 100 ఏండ్లు.

సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ యాన్యుటీ ఆప్షన్లను ఎంచుకునే వెసులుబాటు.

ప్రస్తుత పాలసీదారులకు, చనిపోయిన పాలసీదారుల నామినీ లేదా వారసులకు యాన్యుటీ రేటు పెంపు ద్వారా ఆకర్షణీయ ప్రోత్సాహకాలు.

పాలసీ నిబంధనలకు లోబడి పాక్షికంగానైనా లేదా పూర్తిస్థాయిలో నగదు ఉపసంహరించుకొనే సౌకర్యం.

కనీస కొనుగోలు ధర లక్ష రూపాయలు. దీన్ని మించి ఎక్కువగా కొంటే ప్రోత్సాహకాలూ లభిస్తాయి.

వార్షిక, అర్ధ వార్షిక, త్రైమాసిక, నెలవారీ చెల్లింపులకు అవకాశం. వీటికి తగ్గట్టే యాన్యుటీ వాయిదాలుంటాయి.

ప్రత్యేకంగా ఎన్‌పీఎస్ సబ్‌స్క్రైబర్లకు తక్షణ యాన్యుటీకి వెసులుబాటు.

దివ్యాంగుల కోసం కూడా ప్రయోజనకర ఆప్షన్లు.

www.licindia.in ద్వారా ఆన్‌లైన్‌లో ప్లాన్‌ను కొనవచ్చు. ఎల్ఐసీ ఏజెంట్, ఇతర ఆఫ్‌లైన్ మార్గాల ద్వారా కూడా కొనవచ్చు.ప్లాన్ కొన్న 3 నెలల తర్వాత ఎప్పుడైనా పాలసీదారులు రుణ సదుపాయం తీసుకునే వీలుంటుంది.

# ముగింపు దశకు చేరిన మహా కుంభమేళా..!

# ఆకాశన్నంటున్న విమాన ఛార్జీలు..!



మహా కుంభమేళా ముగింపు దశకు చేరుకుంది. ఈ నెల 26న శివరాత్రితో ముగియనున్నది. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్ చేరుకుంటున్నారు. ఇప్పటికే 50కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణీ సంగమంలో స్నానాలు ఆచరించారు. మహా కుంభమేళా ముగింపునకు రైళ్లు, బస్సులు, ప్రత్యేక వాహనాల ద్వారా పెద్ద సంఖ్యలో జనం ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటున్నారు. అదే సమయంలో విమాన మార్గంలోనూ పెద్ద సంఖ్యలోనే భక్తులు తరలివస్తున్నారు. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్ వెళ్లే విమానాల్లో టికెట్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. తాజాగా ధరలు మరింత పెరుగుతున్నాయి. అదే సమయంలో విమానాల రాకపోకల సంఖ్య సైతం భారీగానే పెరిగింది. మహా కుంభమేళా సమయంలో ఢిల్లీ నుంచి రూ.13వేలకు తక్కువ కాకుండా ధర ఉండగా.. కొన్ని తేదీల్లో రూ.20వేలకుపైగా ధర పలికింది. గత రెండురోజులుగా ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయం నుంచి నడిచే విమానాల సంఖ్య వంద మార్క్‌ను దాటింది.అయినప్పటికీ చాలా నగరాల నుంచి నేరుగా విమాన సర్వీసులు నడుస్తుండగా.. ధరలు ఏమాత్రం దగ్గడం లేదు. చార్జీలు సైతం అధికంగా ఉన్నా.. సీట్లు మాత్రం దొరకడం లేదు. మంగళవారం (ఫిబ్రవరి 18) రోజున ప్రయాగ్‌రాజ్ నుంచి బెంగళూరు ప్రయాణానికి ఓ ప్రైవేట్ ఎయిర్‌లైన్ కంపెనీ ఒక్కొక్కరికి రూ.39,146 వసూలు చేస్తున్నది. కుంభమేళా సమయంలో బెంగళూరుకు రూ.22వేల వరకు వసూలు చేస్తుండేవారు. తాజాగా కంపెనీలు భారీగా పెంచేశాయి. ఇక ముంబయికి వెళ్లే విమానాల్లో టికెట్ల ధర ఇదే పరిస్థితి ఉన్నది. మంగళవారం ప్రయాగ్‌రాజ్ నుంచి ముంబయికి ఏడు విమానాలు నడుస్తుండగా.. రూ.20వేలకుపైగా వసూలు చేస్తున్నాయి. సోమవారం కనీసం రూ.21,974 వసూలు చేశాయి. ఇక మహారాష్ట్రలోని పుణేకు సైతం విమాన చార్జీలు రూ.20వేలకు తక్కువగా లేవు. హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు రూ.28వేల నుంచి రూ.32వేలు, ప్రయాగ్‌రాజ్ నుంచి హైదరాబాద్‌కు రూ.33వేల వరకు ధర పలుకుతున్నది.అలాగే, కోల్‌కతా, భువనేశ్వర్ తదితర ప్రాంతాలకు నడిచే విమానాల్లోనూ టికెట్ల ధరలు ఇదే తరహాలు ఉన్నాయి. విమానయాన సంస్థలు ప్రయాణికుల నుంచి భారీగానే దండుకుంటున్నాయి. విశేషమే ంటంటే.. స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా తదితర విమానయాన సంస్థలు ఫిబ్రవరి 28 వరకు విమానాలను నడిపేందుకు షెడ్యూల్ చేశాయి. ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్ నుంచి జైపూర్, గౌహతి, కోల్‌కతా, భువనేశ్వర్, ఢిల్లీ, డెహ్రాడూన్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్, పుణే, ముంబయి, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, హైదరాబాద్, చండీగఢ్, లక్నోకు నేరుగా విమానాలు నడుస్తున్నాయి. తాజాగా ఇండిగో ఎయిర్‌లైన్ కంపెనీ ప్రయాగ్‌రాజ్ నుంచి పుణేకు నేరుగా విమానాన్ని ప్రారంభించింది. ఈ విమానం 11.10 గంటలకు బయలుదేరి.. మధ్యాహ్నం 1.10 గంటలకు పుణే చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి.. సాయంత్రం 4.10 గంటలకు ప్రయాగ్‌రాజ్ చేరుతుంది. అదే సమయంలో ప్రయాగ్‌రాజ్ నుంచి రాంచీకి డైరెక్ట్ విమానం నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

## మార్కెట్ 'కింగ్' రిలయన్స్

### మార్కెట్ విలువలో టాప్

### రూ. 17.5 లక్షల కోట్లతో అగ్రస్థానం

### అన్‌లిస్టెడ్ సంస్థల్లో నంబర్ వన్‌గా ఎన్‌ఎస్‌ఈ

### బర్గండీ ప్రైవేట్ హురున్ ఇండియా టాప్ 500 జాబితాలో వెల్లడి




దేశీయంగా అత్యధిక మార్కెట్ వేల్యుయేషన్‌తో పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ వరుసగా నాలుగో ఏడాదీ అగ్రస్థానంలో కొనసాగింది. రూ. 17.5 లక్షల కోట్ల విలువతో బర్గండీ ప్రైవేట్ హురున్ ఇండియా టాప్ 500 కంపెనీల లిస్టులో నంబర్ వన్ ర్యాంకు దక్కించుకుంది. అటు ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రూ. 16.1 లక్షల కోట్ల మార్కెట్ వేల్యుయేషన్‌తో రెండో స్థానంలో, రూ. 14.22 లక్షల కోట్లతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మూడో స్థానంలో నిల్చాయి.మరోవైపు, ఐపీవోకి సన్నాహాలు చేసుకుంటున్న స్టాక్ ఎక్స్ఛేంజీ ఎన్‌ఎస్‌ఈ సంస్థ రూ. 4.7 లక్షల కోట్ల వేల్యుయేషన్‌తో.. అన్‌లిస్టెడ్ కంపెనీల విభాగంలో అగ్రస్థానంలో ఉంది. 2024 ఆర్థిక సంవత్సరంలో సంస్థ ఆదాయాలు 28 శాతం పెరిగి రూ. 16,352 కోట్లకు, లాభాలు 51 శాతం ఎగిసి రూ. 8,306 కోట్లకు చేరాయి. ఈ విభాగంలో రూ. 77,860 కోట్ల వేల్యుయేషన్‌తో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా అయిదో స్థానంలో ఉంది. బైటి నుంచి నిధులు సమీకరించకుండా సొంతంగా ఎదిగిన బూట్‌స్ట్రాప్డ్ సంస్థల లిస్టులో నాలుగో ర్యాంకు దక్కించుకుంది.గ్రూప్‌లవారీగా చూస్తే టాటా సన్స్ వేల్యుయేషన్ 2024లో 37 శాతం ఎగిసి రూ. 32.27 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో రిలయన్స్ గ్రూప్ మొత్తం వేల్యుయేషన్ రూ. 19.71 లక్షల కోట్లుగా, అదానీ గ్రూప్ విలువ రూ. 13.40 లక్షల కోట్లుగా ఉంది. తొలిసారిగా లిస్టులోని కంపెనీలన్నీ 1 బిలియన్ డాలర్ల పైగా వేల్యుయేషన్ ఉన్నవేనని హురున్ చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు. దేశవ్యాప్తంగా పరిశ్రమ నిపుణులు, జర్నలిస్టులు, బ్యాంకర్ల నుంచి సేకరించిన అభిప్రాయాలు, బహిరంగంగా అందుబాటులో ఉన్న గణాంకాల ఆధారంగా ఈ జాబితాను సిద్ధం చేసినట్లు వివరించారు. దీనికి డిసెంబర్ 13 కటాఫ్ తేదీగా నిర్ణయించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఇందులో పరిగణనలోకి తీసుకోలేదు.

మరిన్ని వివరాలు ..

- టాప్ 500లోకి చోటు దక్కించుకునేందుకు ఈసారి కనిష్ట వేల్యుయేషన్ పరిమితిని 43% అధికంగా రూ. 9,580 కోట్లకు పెంచారు. 2023లో ఇది రూ. 6,700 కోట్లుగా ఉంది.
- లిస్టులోని మొత్తం కంపెనీల విలువ 40 శాతం ఎగిసి 3.8 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ. 324 లక్షల కోట్లు) చేరింది. ఇది దాదాపు 3.5 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న దేశ జీడీపీ కన్నా అధికం కావడం గమనార్హం. మోతీలాల్ ఓస్వాల్, ఐనాక్స్ విండ్, జెప్టో, డిక్సన్ వంటి సంస్థల వేల్యుయేషన్ అత్యధికంగా పెరిగింది.
- మొత్తం సుమారు రూ. 86 లక్షల కోట్ల పైగా ఆదాయం ఉన్న ఈ 500 కంపెనీలు దాదాపు రూ. 8 లక్షల కోట్ల లాభాలు ఆర్జించగా, రూ. 2.2 లక్షల కోట్ల మొత్తాన్ని పన్నుల కింద చెల్లించాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాలపై రూ. 11,000 కోట్లు వెచ్చించాయి. సుమారు 85 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాయి.
- టాప్ కంపెనీల సంఖ్యాపరంగా చూస్తే రూ. 10.11 లక్షల కోట్ల విలువ చేసే 35 సంస్థలతో హైదరాబాద్ అయిదో స్థానంలో నిల్చింది. రాష్ట్రాలవారీగా చూస్తే తెలంగాణ ఏడో ర్యాంకులో ఉంది. మార్కెట్ 'కింగ్' రిలయన్స్.

## టెస్లా వచ్చేస్తోంది!

### భారత్‌లో నియామకాలు షురూ - కంపెనీ రాక ఇక లాంఛనమే

### ముందుగా మోడల్ - 3తో ఎంట్రీ



టెస్లా.. ఎంతో కాలంగా ఊరిస్తూ వస్తున్న అమెరికాకు చెందిన ఈ ఈవీ దిగ్గజం ఎట్టకేలకు భారత్‌లో అడుగుపెడుతోంది. ఇందుకోసం నియామకాలను మొదలుపెట్టింది. ఢిల్లీ, ముంబై కేంద్రంగా 13 రకాల పోస్టులకు సిబ్బంది అవసరమంటూ లింక్డ్ఇన్ వేదికగా కంపెనీ ఉద్యోగ ప్రకటన ఇచ్చింది.దీంతో కంపెనీ రాక ఇక లాంఛనమే అయింది. ఇటీవలి అమెరికా పర్యటన సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీతో టెస్లా వ్యవస్థాపకుడు, అమెరికన్ టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్ సమావేశం అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్‌లో టెస్లా నియామకాలు మొదలుపెట్టడం ఆసక్తి కలిగిస్తోంది. భారత మార్కెట్లోకి టెస్లా ప్రవేశం గురించి చాలా ఆసక్తిగా ప్రజలు ఎదురుచూస్తున్న విషయం విదితమే.

తొలుత మోడల్ -3

పూర్తిగా తయారైన ఎలక్ట్రిక్ వాహనాలను తొలుత భారత్‌కు టెస్లా దిగుమతి చేసుకోనుంది. అన్ని అనుకూలిస్తే తయారీ కేంద్రం కార్యరూపం దాల్చడం ఖాయంగా కనిపిస్తోంది. టెస్లా ఈ ఏడాది భారత్‌లో తక్కువ ధర కలిగిన ఎలక్ట్రిక్ వాహనాన్ని విడుదల చేసే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. యూఎస్‌లో కంపెనీ నుంచి చవక కారు 'మోడల్ -3' ధర దాదాపు రూ.26 లక్షలు ఉంది. భారత మార్కెట్లో పోటీగా ఉండేందుకు మోడల్ -3లో చవక వెర్షన్ ముందుగా రంగ ప్రవేశం చేసే చాన్స్ ఉంది.

షోరూంలు ఎక్కడంటే..

న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని ఏరోసిటీలో, ముంబై విమానాశ్రయం సమీపంలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో టెస్లా షోరూంలు రానున్నాయి. దాదాపు 5,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు కానున్నాయి. ఇవి షోరూంలు మాత్రమే. సర్వీస్ కేంద్రాలు కావు.

ఉద్యోగాలివీ..

బిజినెస్ ఆపరేషన్స్ అనలిస్ట్, సర్వీస్ అడ్వైజర్, పార్ట్స్ అడ్వైజర్, సర్వీస్ టెక్నీషియన్, సర్వీస్ మేనేజర్, సేల్స్ అండ్ కస్టమర్ సపోర్ట్, స్టోర్ మేనేజర్, కస్టమర్ సపోర్ట్ స్పెషలిస్ట్, కస్టమర్ సపోర్ట్ సూపర్‌వైజర్, డెలివరీ ఆపరేషన్స్ స్పెషలిస్ట్, ఆర్డర్ ఆపరేషన్స్ స్పెషలిస్ట్, ఇన్‌సైడ్ సేల్స్ అడ్వైజర్, కన్జ్యూమర్ ఎంగేజ్‌మెంట్ మేనేజర్ కావాలంటూ కంపెనీ ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మరిన్ని వివరాలకు, దరఖాస్తుకు లింక్డ్ఇన్‌లో టెస్లా పేజీని చెక్ చేసుకోవచ్చు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332